www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 207 | బుధవారం | 17 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



మార్చి 13న రాష్ట్ర బడ్జెట్ 3

- వేర్వేరుగా వ్యవసాయ, మహిళా పద్దులు
- 12 నుంచి అసెంబ్లీ

ఆర్‌డిఎస్ ఆధునీకరణకు చొరవ 11

- ఎపి మంత్రి దేవినేనికి మంత్రి హరీశ్‌రావు లేఖ

7 హైటెక్ వ్యభిచారం రట్టు

నూతనాధ్యాయం

మార్చి 11న ఒక్కరోజులోనే పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ

- అంతకుముందే ప్రత్యేక వాహనంలో తరలింపు
- ప్రతి గ్రామానికో నోడల్ అధికారి
- మార్చి 12 తరువాత సాదా బైనామాల దరఖాస్తుల స్వీకరణ ఉండదు
- ఇక నుంచి మండలానికో రిజిస్ట్రేషన్ కార్యాలయం
- భూ రికార్డులన్నింటికీ కోర్ బ్యాంకింగ్ నెట్‌వర్క్
- పాస్ పుస్తకాలను బ్యాంకు రుణాలకు తాకట్టు పెట్టుకోవద్దు
- భూ రికార్డుల ప్రక్షాళన సాహసోపేతం, దేశానికే ఆదర్శం : కలెక్టర్లతో సమీక్షలో సిఎం కెసిఆర్



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని రైతులందరికీ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను మార్చి 11వ తేదీన ఒక్క రోజులోనే పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. పంపిణీ కోసం ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించడంతో పాటు ఒక రోజు ముందుగా లేదా అదే రోజు ఉదయానికి ఆ గ్రామానికి కొత్త పాస్‌పుస్తకాలు చేరే విధంగా వాహనాలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, అవసరమైన నిధులను కూడా విడుదల చేస్తుందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో మార్చి 12వ తేదీ నుంచి విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, ప్రతి మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉంటుందని వ్యాఖ్యానించారు. మార్చి 12వ తేదీ తర్వాత సాదా బైనామా దరఖాస్తులను స్వీకరించడం కుదరదని, భూ బదలాయింపులన్నీ రిజిస్ట్రేషన్ ద్వారా లేదా వారసత్వ హక్కుగా మాత్రమే మ్యుటేషన్ జరుగుతాయని స్పష్టం చేశారు. ఇకపైన పాస్‌బుక్‌లను బ్యాంకులు రుణాల కొరకు తాకట్టు పెట్టుకోరాదని స్పష్టం చేశారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిందని, సాహసోపేతమైన నిర్ణయానికి యావత్తు రెవెన్యూ శాఖ పూర్తిస్థాయిలో సహకరించి అనుమానాలను పటాపంచలు చేసిందని, దేశమంతా మనవైపు చూస్తూ ఉన్నదని, ఈ ప్రక్రియను అనేక రాష్ట్రాలు అభినందించాయని, కొత్త రాష్ట్రమైనా మనం దేశానికే ఆదర్శంగా నిలిచామని వ్యాఖ్యానించారు. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని, ముందు కూడా అవినీతి రహితంగా జరగాలన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రగతి భవన్‌లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సిఎం సమీక్ష జరిపారు. భూ రికార్డుల ప్రక్షాళన, పంచాయతీలకు ఎన్నికలు జరపడం, పాస్‌బుక్‌ల పంపిణీ, మున్సిపల్ చట్ట సవరణ, పంచాయతీలు నిర్వహించాల్సిన విధులు, అసైన్డ్ భూముల నిర్వహణ, కొత్తగా ఏర్పడే పంచాయతీల హద్దులు... ఇలా అనేక అంశాలపై సిఎం సూచనలు చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖ అవసరం లేదు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో 93 శాతం భూమి, 92 శాతం భూకమతాలు వివాదరహితంగా తేలాయని, ఇప్పటివరకు జరిగిన ప్రక్షాళన మొత్తం స్థిరపడాలని సిఎం అన్నారు. వచ్చే నెల చివరికల్లా ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్లు, కలెక్టర్లు నిర్వహించే రెవెన్యూ కోర్టుల స్థానంలో జిల్లా మొత్తానికి ఒకే రెవెన్యూ కోర్టు ఉండాలని అన్నారు. భూముల కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ శాఖ అవసరం లేదని, ఇప్పుడున్న 141 రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అదనంగా 443 మండల

తరువాయి 6లో

ఫిబ్రవరిలోనే?

- పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు
- కొత్తగా 4 వేల పంచాయతీలు 3
- భౌగోళిక హద్దులపై త్వరలో స్పష్టత
- జనవరి 25కల్లా ప్రతిపాదనలు
- అన్ని అంశాలతో ముసాయిదా బిల్లు



హజ్ సబ్సిడీ ఎత్తివేత

రాయితీ నిధులతో మైనారిటీలకు లబ్ధి శూన్యం

ఆ నిధులు ముస్లిం బాలికల విద్యకు ఉపయోగిస్తాం : కేంద్ర మంత్రి నఖ్వీ

న్యూఢిల్లీ: హజ్ యాత్రికులకు ఇచ్చే రాయితీని ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ సబ్సిడీ నగదును మైనార్టీల సంక్షేమానికి ఉపయోగిస్తామని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ మంగళవారం వెల్లడించారు. భారత్ నుంచి మొదటిసారిగా ఈ ఏడాది 1.75 లక్షల మంది యాత్రికులు ఎటువంటి రాయితీ లేకుండా హజ్ యాత్రకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. గతేడాది 1.25 లక్షల మంది యాత్రికులు హజ్ వెళ్లారు. రాయితీని ఉపసంహరించుకోవడం వల్ల ప్రభుత్వానికి రూ.700 కోట్లు ఆదా అవుతుందని, ఈ మొత్తాన్ని ముస్లిం బాలికల విద్యకు, ఆ వర్గానికి చెందిన వారి సంక్షేమానికి ఉపయోగించనున్నట్లు తెలిపారు. రాయితీతో మైనారిటీలకు ఏ మాత్రం లబ్ధి చేకూరడం లేదన్నారు. సముద్ర మార్గం ద్వారా కూడా యాత్రికులు హజ్ చేరుకునేందుకు సౌదీ ప్రభుత్వం అంగీకరించిందని నఖ్వీ పేర్కొన్నారు. ఈ ఏడాది దాదాపు 1300 మంది మహిళలు పురుషుల తోడు లేకుండా యాత్రకు వెళ్తున్నారు. 2022 నాటికి హజ్ సబ్సిడీని క్రమంగా ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు 2012లో ఆదేశించింది.

సబ్సిడీ రద్దు నిర్ణయం తొందరపాటు

- కేంద్రంపై అసదుద్దీన్ ఒవైసి ధ్వజం 3



అయినా.. అదే పద్ధతి

న్యూఢిల్లీ : నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తనపై తీవ్ర ఆరోపణలు చేసినా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) తనదైన పంథాలోనే కొనసాగుతున్నారు. ఈ ఆరోపణలను ఆయన పెద్దగా పట్టించుకున్నట్టుగా లేదు. తనకు, నలుగురు సీనియర్ న్యాయ మూర్తుల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో అత్యవసర కేసులను విచారించేందుకు ఆయన ఏర్పాటు చేసిన రాజ్యాంగ ధర్మాసనంలో తనపై ఆరోపణలు చేసిన ఆ నలుగురికి

తరువాయి 6లో



- తిరుగుబాటు జడ్జీలకు రాజ్యాంగ ధర్మాసనంలో చోటివ్వని సిజె
- ఆ నలుగురితో ప్రత్యేక భేటీ, కీలక అంశాలపై చర్చ
- వివాదం ముగియలేదు : ఎజి

11 గవర్నర్‌పై అసంతృప్త గళాలు

- ఎపికి కొత్త గవర్నర్‌ను నియమించాలని హోంమంత్రి రాజ్‌నాథ్‌కు తాజాగా ఆ రాష్ట్ర బిజెపి ఎంపి కంభంపాటి హరిబాబు లేఖ

నవ బంధం 10



- భారత్-ఇజ్రాయెల్ మధ్య 9 ఒప్పందాలు
- మోడీ, నెతన్యాహూ పరస్పర ప్రశంసలు

హైదరాబాద్‌హౌస్‌లో సోమవారం నాడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో మోడీ ముచ్చట్లు

ఫొటో ఎస్ఎస్ సిన్హా



కోళ్ల పౌరుషం వీళ్లకంటినట్లుంది..!

పాపికొండల్లో పర్యాటకులపై దాడి



మన తెలంగాణ/ భద్రాచలం: పాపికొండల సందర్శనకు వెళ్లిన పర్యాటకులపై నిర్వాహకులు విచక్షణారహితంగా చేసిన దాడి సంచలనం రేకెత్తించింది. మహిళలు, పిల్లలు అనే తేడాలేకుండా కర్రలతో బాది పర్యాటకుల బంగారు నగలు, నగదు దోచుకున్న ఘటన ఆదివారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి స్థానిక రెడ్డి సత్రం ఆవరణలో మంగళవారం బాధితులు

తరువాయి 6లో

ఖైదీలకు క్షమాభిక్ష పెట్టండి : రేవంత్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా యావజ్జీవ శిక్ష పడిన ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలని సిఎం కెసిఆర్‌కు కాంగ్రెస్ నేత ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, గత ఎన్నికల సందర్భంగానూ ఐదేళ్ళు శిక్ష పూర్తి చేసిన వారిని విడుదల చేస్తామని కెసిఆర్ పలు సందర్భాలలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఐదేళ్ళ శిక్షకాలం పూర్తి చేసిన ఖైదీలందరినీ విడుదల చేస్తామని మామీ నిలబెట్టుకుంటారని భావించారని, అయితే మొదటి సారి ప్రసాదించిన క్షమాభిక్షవందలాది మంది ఖైదీలను నిరాశ పరిచిందన్నారు.గతంలో ఇచ్చిన మాటకు భిన్నంగా 12 నుండి 14 సంవత్సరాల వాస్తవ శిక్ష, కనీసం ఆరు సంవత్సరాల రెమిషన్ శిక్షతో కలిపి 18 నుండి 20 సంవత్సరాల శిక్ష పూర్తైన వారినే విడుదల చేయడంతో అనేక మంది ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రాబోయే రిపబ్లిక్ డే సందర్భంగానైనా జనవరి 26న ఖైదీలను విడుదల చేయడానికి అవసరమైన జిఓను విడుదల చేయాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళా ఖైదీల్లో ఐదు సంవత్సరాల వాస్తవ శిక్షను పూర్తి చేసిన వారికి,మగఖైదీలలో ఏడు సంవత్సరాల వాస్తవ శిక్షను, మూడేళ్ళ రెమిషన్ శిక్షను కలిపి పదేళ్ళ శిక్షను పూర్తి చేసిన వారందరిని విడుదల చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

- **కొరియా కంపెనీల ప్రతినిధులతో మంత్రి కెటిఆర్**

మన తెలంగాణ/హైదరాబాద్: దక్షిణ కొరియాలో పర్యటిస్తోన్న పరిశ్రమల శాఖ మంత్రి కె.తారాకరామారావు పలు కంపెనీల సిఇవోలు,ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వ్యాపార, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, టిఎస్–ఐపాస్ విధానాన్ని వివరించారు. పెట్టుబడులకు తెలంగాణ ఏ విధంగా అనువైన ప్రదేశమో కూడా వివరించారు. ప్రధానంగా ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని వారిని మంత్రి కెటిఆర్ కోరారు. ఆటోమొబైల్ దిగ్గజం హ్యూందయ్ కార్పోరేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు నామ్ గుహ్నోతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఆటోమొబైల్ రంగంలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను వివరించారు. టిఎస్. ఐపాస్ ద్వారా సింగిల్ విండో అనుమతుల విధానాన్ని మంత్రి కెటిఆర్ నామ్ గుహ్నోకు వివరించగా అందుకు ఆయన తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారు. అలాగే గ్లోబల్ రైల్వే విభాగం డైరక్టర్ కెకె యూన్, గ్రీన్ ఎనర్జీ అగ్రగ్రామి ఒసిఐ సిఇవో వూ హుయిన్ లీతో కూడా మంత్రి కెటిఆర్ సమావేశమ్యారు. ప్రపంచ వ్యాప్తంగా 33 ప్రాంతాల్లో తమ కార్యాకలాపాలను కొనసాగిస్తున్న కంపెనిని తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానించారు.

మొయిబా సంస్థతో ఒప్పందం : మొబైల్ ఇంటర్‌నెట్ బిజినెస్ అసోసియేషన్ (మొయిబా) సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదర్చుకున్నది. ఈ సంస్థలో సుమారు 500లకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ ఒప్పందం ప్రకారం మొయిబా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఇంటర్‌నెట్ ఆఫ్ తింగ్స్, వర్చువల్ రియాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి అంశాల్లో కలిసి పనిచేస్తాయి. మొయిబా సిఇవో చొయ్ డొంగ్ జిన్‌తో సమావేశమైన మంత్రి కెటిఆర్ బృందం ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న ప్రపంచ ఐటి కాంగ్రెస్‌కు ఆహ్వానించింది.

టెక్స్‌టైల్ రంగానికి తెలంగాణ ఆకర్షణీయమైన ప్రదేశం : టెక్స్‌టైల్ రంగానికి తెలంగాణలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పెట్టుబడులకు ఆకర్షణీయమైన ప్రదేశమని మంత్రి కెటిఆర్ అన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమల వర్గాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టెక్స్‌టైల్ పరిశ్రమల సమాఖ్య కోఫాతి ఛైర్మన్ కిహూక్ సుంగ్, ఇతర కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. కాగా యంగ్వాన్ సంస్థ ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో 300 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నది. యంగ్వాన్ సంస్థ నార్త్ ఫేస్ అనే బ్రాండ్ పేరుతో వస్త్రాలను తయారు చేస్తోంది. ఈ బ్రాండ్ వస్త్రాలు రానున్న ఒలింపిక్స్ క్రీడలకు అధికారిక భాగస్వామిగా ఉన్నది. అలాగే మంత్రి మరో ప్రముఖ టెక్స్‌టైల్ సంస్థ హ్యోసంగ్ సంస్థ ఉపాధ్యక్షులు జె.జూంగ్ లీ కూడా సమావేశమయ్యారు. తమ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడి పెట్టాలని ఆయనను కెటిఆర్ కోరారు. డైటెక్ పరిశ్రమలో మంత్రి బృందం పర్యటించిన అనంతరం ఇంకోక ప్రముఖ టెక్స్‌టైల్ దిగ్గజ సంస్థ కోలాన్ గ్రూప్‌తో కూడా కెటిఆర్ సమావేశమయ్యారు.



డైగు నగర సందర్శన : కొరియా టెక్స్‌టైల్ సిటీగా ప్రసిద్ధి చెందిన డైగు మెట్రో పాలిటన్ నగరాన్ని మంత్రి కెటిఆర్ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ నగరంలో కొరియన్ టెక్స్‌టైల్, ఫ్యాషన్, హై టెక్నాలజీ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నది. ఈ సందర్భంగా నగర డిప్యూటీ మేయర్ కిమ్ యాన్ చాంగ్‌తో సమావేశమయ్యారు. అలాగే డైగు నగర ఇన్నోవేషన్, ఆర్థిక విభాగ బృందంతో కూడా సమావేశమైన మంత్రి కెటిఆర్ వారిని ఇమేజ్ టవర్ ప్రాజెక్ట్‌లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ పర్యటనలో ప్రభుత్వ సలహా దారులు జి.వివేక్, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

జువెనైల్ హోం నుంచి బాల నేరస్తుల పరారీ

మన తెలంగాణ/హైదరాబాద్: ఎల్‌బినగర్‌లోని జువెనైల్ అబ్జార్వేషన్ హోమ్ నిర్వాహకులను బెదిరించి ఆరుగురు బాల నేరస్థులు పరారయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హోమ్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు ఎల్‌బినగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే హోమ్‌లో గతంలోకూడా రెండు సార్లు బాల నేరస్థులు పరారయ్యారు. నిర్వహణ తమ వల్ల కావడం లేదని అబ్జర్వేషన్ హోంను తరలించాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని హోమ్ సూపరింటెండెంట్ సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరాపోయిన బాల నేరస్థులు చోరీ కేసులో ఇక్కడికి వచ్చారని సాయిలు తెలిపారు.

క్ర. సం.	లోన్ నం.	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	సెక్యూరిటీ వివరములు	మొత్తం బరువు
1.	560991002636393	[illegible]	[illegible]	116.700 గ్రా
2.	560991002574517		[illegible]	84.7 గ్రా

మార్కెటింగ్‌లో కొత్త విధానాలు

- **కోహెడకు తరలనున్న గడ్డి అన్నారం మార్కెట్**
- **కందుల కొనుగోళ్ల పరిమితి పెంచాలని కేంద్రానికి మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి**



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్కెటింగ్‌లో కొత్త విధానాలను ప్రవేశ పెట్టాలని మార్కెటింగ్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. ఇందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో వస్తున్న కొత్త పరిణామాలను అధికారులు నిరంతరం పరిశీలించాలన్నారు. సచివాలయంలో బుధవారం వివిధ వ్యవసాయఉత్పత్తులు, రైతులకు లభిస్తున్న కనీస మద్దతు ధరలు, చెల్లింపులపై మంత్రి హరీశ్‌రావు సమీక్షి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పద్ధతులలో పని చేయొద్దని సిబ్బందిని కోరారు. రైతులకు జవాబు దారీగా పని చేయాలన్నారు. గడ్డి అన్నారం మార్కెట్‌ను కోహెడ కు తరలించనున్నందున అత్యాధునిక హంగులూ, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త మార్కెట్ ఏర్పాటు కోసం మూడు ప్రవేటు సంస్థలు సమీక్షలో ప్రజెంటేషన్ ఇచ్చాయి. కోహెడ మార్కెట్ ఏర్పా టు, ఆధునీకరణ, వ్యయం, ఇతర వివరాలతో డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ ను 15 రోజుల్లో సమర్పించాలని ఆయా సంస్థల ప్రతినిధులను మంత్రి కోరారు.

చెల్లింపుల ఆలస్యంపై అంసతృప్తి : పంట ఉత్పత్తుల కొనుగోలు తరువాత రైతులకు చెల్లింపులో జాప్యం జరిగితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని మంత్రి హెచ్చరించారు. వివిధ జిల్లాల్లో పెండింగులో ఉన్న చెల్లింపులను వారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కందుల కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపుల పెండింగ్‌పై హరీశ్ రావు అసంతృప్తి వ్యక్తం చేశా రు. కందుల రైతులకు రూ. 145 కోట్లు , మొక్క జొన్న రైతులకు రూ.21 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఇకపై తాను జిల్లాలు పర్యటించినపుడు తప్పనిసరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను సందర్శిస్తానని మంత్రి స్పష్టం చేశా రు. ఈ సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పార్థసారధి, కమిషనర్ డాక్టర్ ఎం. జగన్‌మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మి బాయి పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్ల పరిమితి పెంచండి:

కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రికి విజ్ఞప్తి చేయాలని మంత్రి హరీశ్ రావు నిర్ణయించారు. ఈ సీజన్‌లో 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కందుల దిగుబడి రానుందని అంచనా. అయితే 33 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం సుముఖత చూపింది. ఇప్పటివరకు 26, 200 మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్ కు వచ్చినట్లు అధికారులు మంత్రికి తెలిపారు.

ఫిబ్రవరి 3న 4వ దశ పనులు


- **మిషన్ కాకతీయ రోజువారీ పనుల ఫోటోలు వాట్సప్‌లో పెట్టాలి**
- **ఫీడర్ ఛానల్స్ నిర్మాణానికి ప్రాధాన్యత**
- **వివిధ దశల్లో చేపట్టిన పనులు పూర్తికాకపోవడంపై మంత్రి అసంతృప్తి**

మన తెలంగాణ/హైదరాబాద్ : మిషన్ కాకతీయ 4వ దశ పనుల ప్రారంభానికి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఫిబ్రవరి 3వ తేదీని గడువుగా విధించారు. ఈ దశలో ఫీడర్ చానల్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిషన్ కాకతీయ 4వ దశపై మంగళవారం సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోజువారీ పనుల ఫోటోలను విధిగా వాట్సప్‌లో పెట్టాలని కోరారు. మిషన్ కాకతీయ రెండు, మూడో దశలలో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాకపోవడం పట్ల హరీశ్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.పనులు పూర్తయిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులలో జాప్యం చేయరాదని ఆదేశించారు. 5703 చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని 4వ దశలో చేపడుతున్నట్టు చెప్పారు.ఎట్టి పరిస్థితులలోనూ ఈ నెలాఖరులోగా పనుల గ్రౌండింగ్ జరగాలని, ఫిబ్రవరి 3వ తేదీన మళ్లీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలను, వ్యవసాయ అధికారులను నాలుగో దశలో భాగస్వాములు చేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. మిషన్ కాకతీయ కింద చేపట్టనున్న పనులలో సాగునీటి వనరుల ఆయకట్టును స్థిరీకరణకు, అదనపు ఆయకట్టుకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్‌ఈ, ఈఈలు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటించాలని ఆదేశించారు. 4వ దశ లో చేపట్టనున్న చెరువుల జాబితాను ముం దుగానే వ్యవసాయ అధికారులకు అందిస్తున్నందున పూడిక మట్టిని రైతులు వాడుకునే ముందు తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. గతంలో రాష్ట్రంలో భూసార పరీక్ష కేంద్రాలు 9 మాత్రమే ఉండేవని , ప్రస్తుతం ప్రతి మూడు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక భూసార పరీక్ష కేంద్రం ఉందన్నారు. మొత్తం 2,500 భూసార పరీక్ష ల్యాబ్‌లున్నట్లు మంత్రి తెలిపారు. పూడిక తీత మట్టిలో ఉండే పోషకాలపై ప్రజలు, రైతుల్లో చైతన్యం, అవగాహన తీసుకు రావాలని కోరారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచిం చారు. నీటిపారు దల ఈఎన్‌సిలు మురళీధరరావు, నాగేం దర్ రావు, 'కాడా' కమిషనర్ డాక్టర్ మల్సూర్‌లు పాల్గొన్నారు.

తోటి విద్యార్థిపై కత్తితో దాడి

మన తెలంగాణ/హైదరాబాద్: తన చెల్లెల్ని వేధించవద్దని అన్నందుకు ఓ విద్యార్థి తోటి విద్యార్థిపై కత్తితో దాడి చేసిన సంఘటన నాచారం పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. కత్తిపోట్లకు గురైన విద్యార్థిని హుటాహుటీనా స్థానిక ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. దాడికి పాల్పడ్డ విద్యార్థిన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు,. వివరాలు ఇలా ఉన్నాయి. నాచారంలోని కౌడియానగర్‌కు చెందిన డిసిఎం డ్రైవర్ క్రిష్ణ కూతురు (14), కుమారుడు అరవింద్ (15)లు సెయింట్ మాథ్యూస్ హై స్కూల్‌లో చదువుతున్నారు. ఇదే కాలనీకి చెందిన విద్యార్థి (15) వీరి స్కూల్‌లోనే పదవ తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజుల నుంచి అరవింద్ చెల్లెల్ని..సదరు విద్యార్థి వేధింపులకు గురిచేస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని ఆ అమ్మాయి తండ్రి క్రిష్ణ, సోదరుడు అరవింద్‌కు చెప్పింది. దీంతో అరవింద్ మంగళవారం మధ్యాహ్నం సదరు విద్యార్థి ఇంటికి వెళ్లి తన చెల్లెల్ని మరోసారి వేధించవద్దని మందలించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన విద్యార్థి ఆవేశానికి గురై కత్తితో అరవింద్‌పై దాడి చేశాడు.



కత్తిపోట్లకు గురైన అరవింద్ అక్కడే పడిపోవడంతో ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని స్థానిక ప్రసాద్ అసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. క్రిష్ణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కత్తిపోట్లకు పాల్పడిన సదరు విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్ష సమావేశం : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు సూచనలను స్వీకరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఇటీవల ముఖ్యమంత్రికి మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన పంచాయతీరాజ్ ముసాయిదా చట్టంలో సర్పంచ్ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించాలని భావిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయని, పరోక్ష ఎన్నికలంటే గ్రామాల్లో వార్డు మెంబర్‌ల కొనుగోలుకు తెరలేపినట్లే అవుతుందని, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ చిచ్చు రేపడమే కాకుండా గొడవలకు దారి తీస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే ప్రత్యక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలకు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వం ఫిబ్రవరి నెలలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ నెలలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చి, గడువు తీరకముందే హడావుడిగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏమిటని చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే త్వరలో పదవీకాలం ముగియనున్న సహకార సంఘాలకు తొలుత ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

పున:నిర్ణయం తీసుకోండి

మన తెలంగాణ/ హైదరాబాద్ : గోదవరి జలాల వరద ప్రవాహ నీటి లెక్కల విషయంలో పునఃనిర్ణయం తీసుకునే విధంగా బుధవారం ఢిల్లీలో జరిగే కేంద్ర జలవనరుల అభివృద్ధి సంస్థ సమావేశంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి తీసుకురావాలని సిఎల్‌పి ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా హాల్ లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం నదుల అనుసంధానం చేయాలనే ప్రతిపాదనలు చేస్తూ బుధవారం రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 40 సంవత్సరాల నీటి లెక్కలను ప్రామాణికంగా తీసుకున్నారని, నదుల అనుంధానానికి గోదావరి వరద ప్రవాహ 110 సం వత్సరాల లెక్కలను సిడబ్ల్యుసి ప్రామాణికంగా తీసుకుంటోందన్నారు. అలా జరిగితే రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్నారు.

నేడు స్కీమ్ వర్కర్‌ల అఖిలభారత సమ్మె

మన తెలంగాణ/ హైదరాబాద్ : వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న స్కీమ్ వర్కర్లు బుధవారం నాడు దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నారు. తమను వర్కర్లుగా గుర్తించాలని, నెలకు రూ.18వేల కనీస వేతనం ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి పథకాలు అమలు చేయాలని, రూ.3వేల తగ్గకుండా పెన్షన్ వర్తింపజేయాలనే డిమాండ్‌లతో సమ్మె తలపెట్టారు. ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, సేవా, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపు నిచ్చాయి. ఈ సమ్మెలో ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన పథకం, ఎన్‌హెచ్‌ఎం, సర్వశిక్ష అభియాన్, ఎన్‌సిఎల్‌పి తదితర కేంద్ర ప్రాయోజిత పథకాలు, పలు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు సుమారు కోటి మంది స్కీమ్ వర్కర్లు పని చేస్తుండగా, అందులో 27 లక్షల మంది అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు ఉన్నారు. అలాగే 28 లక్షల మంది మధ్యాహ్న భోజన పథకం వర్కర్‌లు, పది లక్షల మంది ఆశా వర్కరుల పని చేస్తున్నారు. గౌరవ వేతనం లేదా ప్రోత్సాహకం పేరుతో అంగన్‌వాడీ వర్కర్‌లకు నెలకు రూ.3వేలు, హెల్పర్‌లకు రూ.1500, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. వెయ్యి, ఆశా వర్కర్‌లకు సగటున నెలకు రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారు. వీరందరిని కార్మికులుగా గుర్తించాలని అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రద్దీ దృష్ట్యా 46 ప్రత్యేక రైళ్లు

మన తెలంగాణ / హైదరాబాద్: ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా హైదరాబాద్ – కోచువెళి, హైదరాబాద్ – ఎర్నాకుళం మధ్య ఏప్రిల్ 7వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు మొత్తం 46 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. హైదరాబాద్ – కొరువెళి ప్రత్యేక రైలు (నెం.07115) ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రతి శనివారం హైదరాబాద్‌లో రాత్రి 9 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 3:20 గంటలకు కోరువెళి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో కోచువెళి – హైదరాబాద్ ప్రత్యేక రైలు (నెం.07116) ఏప్రిల్ 9వ తేదీ నుంచి ప్రతి సోమవారం కోచువెళిలో రాత్రి 7:45 గంటలకు బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్ – ఎర్నాకుళం ప్రత్యేక రైలు (నెం.07117) ఈ నెల 24 నుంచి ప్రతి బుధవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి గురువారం సాయంత్రం 5:30 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళం – హైదరాబాద్ ప్రత్యేక రైలు (నెం.07118) ఎర్నాకుళంలో ఈ నెల 25 నుంచి ప్రతి గురువారం రాత్రి 9:45 గంటలకు బయలుదేరి శుక్రవారం 10:55 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని ఎస్‌సిఆర్ సిపిఆర్‌ఓ ఎం.ఉమా శంకర్ కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.



స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికను ఒప్పుకునే ప్రసక్తే లేదు

మన తెలంగాణ/హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలలో పరోక్ష పద్ధతిని ఆమోదించే ప్రసక్తే లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. పరోక్ష పద్ధతిని ఏ ప్రజాప్రతినిధి ఒప్పుకోరన్నారు. ప్రతిపక్ష పార్టీల వ్యక్తులపై టిఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వం సర్పంచ్‌ను పరోక్ష పద్ధతిలో ఎన్నుకునే దానిపై చట్టాన్ని సవరిస్తుండటంతో రావుల ఈ విధంగా స్పందించారు. 1981 నుంచి స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలే ఉన్నాయని, పరోక్ష ఎన్నికలను ప్రతిపక్షాలు, స్థానిక సంస్థలు, సర్పంచ్‌లు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. మొండిగా వ్యవహరిస్తే ప్రతిపక్షాలుగా అందరం కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుని దుయ్యబట్టారు. జాతీయ స్థాయిలో విద్యపై కేంద్రం సమీక్ష నిర్వహిస్తుందని, ప్రతిసారి అనుకూల అంశాలను కాకుండా విద్యలో ఉన్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. విద్యపై టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కెజి టూ పిజి ఉచిత విద్య అందిస్తామని చెప్పి, ఉన్న పాఠశాలలను కూడా మూసేసారన్నారు. కేంద్రం నుంచి 4200 స్కూల్స్‌కి రూ. 2.10 లక్షల చొప్పున నిధులు వస్తే కేవలం ఒక్క స్కూల్ కి మాత్రమే ఖర్చు చేసిందన్నారు.

22న టిమాస్ చలో కలెక్టరేట్

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న చలో కలెక్టరేట్ ఆందోళనను నిర్వహించనున్నట్లు టిమాస్ స్టీరింగ్ కమిటీ నాయకులు గద్దర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విమల తెలియజేశారు. అణగారిన కులాలకు, పేదలకు ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని మండల కేంద్రాలలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఈ నెల 19 వరకు కొనసాగుతాయని వారు ఒక ప్రకటనలో తెలిపారు. టిఆర్‌ఎస్ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయకపోతే ప్రజాఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్ష పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, కెజి టు పిజి ఉచిత విద్య, అందరికీ ఉచిత వైద్యం అందించాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ రిజర్వేషన్లు పెంచాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇజ్రాయెల్ ప్రధానిని ఆహ్వానించడం సమంజసం కాదు



మన తెలంగాణ/హైదరాబాద్ : పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్య పోరాటాలను, హక్కులను కాలరాస్తున్న ఇజ్రాయెల్ దేశాన్ని భారత ప్రధాని సందర్శించడం, ఇజ్రాయెల్ ప్రధానిని భారత్‌కు ఆహ్వానించడం భారత అలీనవిధాన సూత్రాలకు వెన్నుపోటు పొడవడమేనని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నాయకులు విమర్శించారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమెన్ నేతన్యాహు భారత్ పర్యటనకు వ్యతిరేకంగా ఐప్సో నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో నిరసన సభను నిర్వహించారు. 'గో బ్యాక్ నెతన్యాహు' అని ఐప్సో నాయకులు ప్లకార్డులను ప్రదర్శించారు. జెరూసలేమ్ నగరాన్ని ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్య సమితితో సహా పలు ఇతర దేశాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రధానిని ఆహ్వానించడం సమంజసం కాదని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐప్సో రాష్ట్ర అధ్యక్షులు తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ ట్రంప్ నిర్ణయం వల్ల మధ్యప్రాచ్య దేశాల్లో శాంతి కోసం సుదీర్ఘకాలంగా చేస్తున్న ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఐప్సో రాష్ట్ర సమన్వయకర్త కెవిఎల్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ ప్రధానిని స్వాగతించడమంటే అంతర్జాతీయంగా, ప్రపంచ దేశాలు చేస్తున్న నిరసనను, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాటాలను, భారత విదేశీ విధానాలను ప్రధాని మోడీ తుంగలో తొక్కడమేనని పేర్కొన్నారు. సమావేశంలో ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కెసిఆర్ చిచ్చు

మన తెలంగాణ/ హైదరాబాద్ : సర్పంచ్‌లకు పరోక్ష ఎన్నికలు పెట్టి గ్రామాలలో సిఎం కెసిఆర్ చిచ్చు పెడుతున్నారని, దీనికి సంబంధించిన పంచాయతీరాజ్ బిల్లును శాసనసభలో కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరోక్ష ఎన్నికల్లో డబ్బులు ఉన్నవారే గెలుస్తారని అన్నారు.గడిచిన నాలుగేళ్ళలో గుర్తుకు రాని బిసిలు ఇప్పుడు ఎన్నికలు వచ్చే సరికి కెసిఆర్‌కు గుర్తుకు వస్తున్నారని అన్నారు. బిసిలపై కెసిఆర్‌ది కపట ప్రేమ అని, బిసిలకు క్యాబినెట్‌లో తగిన ప్రాధాన్యత లేదని, ఎంబిసిల పేరుతో కొత్త నాటకం మొదలు పెట్టాడని ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే బిసిలకు క్రీమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కారెక్కనున్న సంకినేని

28న ముహూర్తం ఖరారు?



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: ఇటీవల రాష్ట్ర బిజెపిలో కొనసా గుతున్న రాజీనామాల పరంపర రాజకీయ సెగ జిల్లాను తాకినట్లు కనిపిస్తుంది. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరావు ఈ నెల 28న టీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. తుంగతుర్తి నియోజకవర్గంలో తమ అనుచర వర్గంగా వున్న సర్పంచ్‌లు, ఎంపీటీసిలు ఇప్పటికే కారెక్కగా సంకినేని గత కొంత కాలంగా బీజేపి పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటూ వస్తున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ పర్యటన సందర్భంలో కూడ ఆయన అనారోగ్యకారణాల వల్ల ఆయన పాల్గొనలేదు. తిరుగు ప్రయాణంలో లక్షణ్ సంకినేని ఇంటిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి పార్టీతోనే సంకినేని కలిసివున్నట్లు సంకేతాలు పంపారు. గత కొంత కాలంగా సంకినేని బిజెపిని వీడి టీఆర్‌ఎస్‌లో చేరడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్న ఊహగానాలు సాగుతున్నాయి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు పార్టీ గ్రామ, మండల శాఖలను ఏర్పాటు చేయకపోవడాన్ని ఉదహరిస్తున్నారు. టీఆర్‌ఎస్‌లో చేరితే ఏ స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టాలన్న విషయమై పార్టీ అధిష్టానం వద్ద చర్చ సాగిన ట్లుగా తెలుస్తోంది. మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున కోదాడ నియోజకవర్గం నుండి బరిలోకి దించే విషయమైకూడ ఆలోచన చేసినట్లు సమాచారం. కాగా గ్రామ పంచాయతి ఎన్నికలు సమీపిస్తున్నందున అందుకు ముందుగానే ఆయన కారెక్కేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. జనవరి 29న పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైనా 28నే ఆయన ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరనున్నారన్నది విశ్వసనీయ సమాచారం.

18న పంచాయతీ రాజ్ చట్టంపై టిపిసిసి సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్:రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న ప్రతిపాదిత పంచాయతీరాజ్ చట్టంపై విస్తృతంగా చర్చించేందుకు ఈ నెల 18న మధ్యాహ్నం 12 గంటలకు టిపిసిసి విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. గాంధీభవన్‌లో జరిగే ఈ సమావేశంలో టిపిసిసి ఆఫీస్ బేరర్లు, డిసిసి అధ్యక్షులు, తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐసిసి ఆఫీస్ బేరర్లు, టిపిసిసి అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొంటారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వడ్డీమాఫీపై కలెక్టర్లకు వినతిపత్రాలు

రాష్ట్రంలో హైదరాబాద్ మినహా అన్ని పాత జిల్లా కేంద్రాలలో రైతు వడ్డీ మాఫీపై బుధవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.



ఫిబ్రవరిలోనే పంచాయతీ ఎన్నికలు

- కొత్తగా 4వేల కొత్త పంచాయతీలు
- భౌగోళిక హద్దులపై త్వరలో స్పష్టత
- అన్ని అంశాలతో ముసాయిదా బిల్లు
- కలెక్టర్ల సమావేశంలో సిఎం కెసిఆర్ దిశానిర్దేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలను ఫిబ్రవరిలోనే నిర్వహించడానికిగల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సిఎం కెసిఆర్ తెలిపారు. ఎన్నికల విధి విధానాలకు సంబంధించిన అంశాలను బిల్లులో పొందుపరుస్తున్నామని, శాసనసభలో ప్రవేశపెడతామని తెలిపారు. గ్రామాలు బాగుపడడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎలా ఉండాలనేదానిపై జిల్లాల కలెక్టర్లు పంచాయతీరాజ్ కార్యదర్శికి పంపాలని స్పష్టం చేశారు. సర్పంచ్‌ల నుంచి సమర్ధవంతమైన పనిని రాబట్టుకోడానికి ఏం చేయాలనే అంశమై జిల్లా పంచాయతీ అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని, సరిగ్గా పనిచేయించి సత్ఫలితాలను సాధించడమెలాగో కూడా సూచనలు, సలహాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. వీటి ఆధారంగా కొత్త పంచాయతీ రాజ్ చట్టం ముసాయిదా బిల్లు తయారవుతుందని, ఫిబ్రవరి మొదటివారంలో శాసనసభలో ప్రవేశపెడతామని కెసిఆర్ పేర్కొన్నారు. ప్రగతి భవన్‌లో మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో కెసిఆర్ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికలను తప్పకుండా నిర్వహించాలని, గ్రామ పంచాయతీల ఏర్పాటుకు పంచాయతీ జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా భౌగోళిక హద్దులు ఏర్పడాలని, రాజ్యాంగం కూడా ఇదే చెప్తోందని పేర్కొన్నారు. న్యాయస్థానాల లిటిగేషన్‌లకు తావు లేకుండా గ్రామ పంచాయతీలు ఏర్పాటు కావాలని, శాసనప్రక్రియ ద్వారానే ఏర్పాటు చేయబోతున్నామని, ప్రస్తుతం ఉన్న 8684 గ్రామ పంచాయతీలకు తోడు మరో నాలుగు వేల కొత్త పంచాయతీలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కొత్త గ్రామ పంచాయితీల భౌగోళిక సరిహద్దులు (పరిధి) నిర్ణయించి ప్రభుత్వానికి ఆయా జిల్లాల కలెక్టర్లు జనవరి 25వ తేదీకల్లా నివేదిక పంపాలని సిఎం స్పష్టం చేశారు. కొత్త పంచాయతీ ఏర్పాటుకు కనీస జనాభా 500 ఉండాలని, విడిపోతున్న గ్రామ పంచాయితీకి, కొత్తగా ఏర్పడుతున్న పంచాయతీకి మధ్య దూరం కనీసంగా ఒకటిన్నర కి.మీ. లేదా రెండు కి.మీ. ఉండాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లకు వారు పదవీ బాధ్యతలు చేపట్టేలోపలే శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో సక్రమంగా పని జరగకపోతే అభివృద్ధి ఆశించినతీరులో ఉండదని నొక్కిచెప్పారు. చిన్న గ్రామ పంచాయతీ (500 జనాభా ఉన్నచోట) ఐదు లక్షల రూపాయలు, ఆ తర్వాత స్థాయికి పది లక్షలు... ఇలా గరిష్టంగా రూ. 25 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. పంచాయతీలు వంద శాతం పన్నుల వసూలు చేస్తాయని తెలిపారు. అవసరమైతే జాతీయ స్థాయి ఆర్థిక సంఘం ఇచ్చే నిధుల్ని పంచాయతీలకు వినియోగిస్తామని, గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో ఆస్తులను సమకూర్చుకునే విధానాన్ని ప్రవేశపెడతామని తెలిపారు. వీటికి తోడు ఎమ్మెల్యే, ఎంపి నిధుల్ని కూడా గ్రామాభివృద్ధికి ఖర్చు చేసేలా ఆలోచిస్తామని తెలిపారు. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే పరిశుభ్రత, అభివృద్ధికరమైన గ్రామీణ తెలంగాణను సాధించుకోగలమని అన్నారు. రాష్ట్రస్థాయి ఆర్థిక కమిషన్‌ను ఏర్పాటు చేశామని, బడ్జెట్‌లో రెండు వేల కోట్ల రూపాయలను కేటాయిస్తామని తెలిపారు. మనం చాలా విషయాల్లో విజయం సాధించినా గ్రామాలను మాత్రం పరిశుభ్రంగా ఉంచుకోలేకపోతున్నామని, దీనిపై చాలా విమర్శలు వచ్చాయని, అందువల్ల 'పనిచేసే పంచాయతీ రాజ్ వ్యవస్థ' ఏర్పడాల్సిన అవసరం ఉందని అన్నారు. పంచాయతీలకు ప్రత్యక్ష ఎన్నిక జరపాలా లేక పరోక్ష ఎన్నిక జరపాలా అనేదానిపై కూడా చర్చ జరుగుతోందని, సర్పంచ్‌ను 'పనిచేసే సర్పంచ్'గా ఎలా చేయడం అనేది ప్రధానమని కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పంచాయతీల మీద జిల్లా కలెక్టర్‌కు ఎన్నో అధికారాలు ఉండేవని, ఇప్పుడు నియంత్రణ లేకుండా పోయిందని అన్నారు. ఈ నిస్సహాయ స్థితి నుంచి బైటపడాలని, ఎంతో గొప్పగా రూపొందించిన మహత్తరమైన పంచాయతీరాజ్ వ్యవస్థ ఇప్పుడు అంతరించిపోయిందని, గ్రామాలు పెంటకుప్పలుగా మారిపోయాయని అన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీకి ఏమేమి పనులు అప్పజెప్పాలో ఆలోచన చేయాల్సి ఉన్నదని, అందువల్ల మున్సిపల్ చట్టానికి కూడా సవరణలు చేయాలన్న ఆలోచన వచ్చిందని, ఆ దిశగా పరిశీలన జరుగుతోందన్నారు.



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సద్వినియోగం కావాలి : చాలా జిల్లాలకు నాలుగు లక్షల లోపే జనాభా ఉన్నదని, ఎస్సీ ఎస్టీ కుటుంబాల స్థితిగతుల్ని కంప్యూటరీకరణ చేయాలని, ఆ వివరాల ఆధారంగా వీరికి కేటాయించిన సబ్ ప్లాన్ నిధులు వృథా కాకుండా సద్వినియోగం కావాలని సిఎం వ్యాఖ్యానించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు పోతున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనకబడిన ఇతర వర్గాల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను రూపొందిస్తుందని, ముఖ్యంగా విద్య, వైద్య, ఆరోగ్య రంగంలో ఉంటాయని సూచించారు. గొర్రెల పంపిణీ పథకం పగడ్బందీగా అమలవుతోందని, ఇప్పటికే 38.28 లక్షల గొర్రెల పంపిణీ జరగ్గా అదనంగా 14.56 లక్షల గొర్రె పిల్లలు పుట్టాయని సిఎం పేర్కొన్నారు. ఇది పెద్ద కార్యక్రమమని, సంచార బ్యాంకుగా మారిందని, రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాలకు కూడా మాంసాన్ని ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతుందని అన్నారు. గొర్రెల పెరుగుదలకు అవసరమైన గడ్డిని పండ్ల తోటల్లో పెంచడానికి ఆలోచన జరుగుతూ ఉందని, జిల్లాల్లో ఉన్న పండ్ల తోటల వివరాలను సేకరించి అక్కడ గడ్డిని పెంచడానికి గల సాధ్యాసాధ్యాలపై త్వరలో అధికారుల నుంచి స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. మరోవైపు రానున్న మూడేళ్ళలో రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఈ సంవత్సరం డిసెంబరు చివరి నాటికే కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ళు అందుతాయని తెలిపారు.

నేటి నుంచి 102 సేవలు

- అందుబాటులోకి బైక్ అంబులెన్స్‌లు
- నేడు ప్రారంభించనున్న సిఎం కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న '108' సేవల తరహాలోనే బుధవారం నుంచి గర్భిణీలు, బాలింతలకు '102' సేవలు, బైక్ అంబులెన్స్‌లు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్, రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి బుధవారం ఈ సేవలను నగరంలోని పీపుల్స్ ప్లాజాలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ సేవల కోసం ప్రభుత్వం ఏటా రూ. 23.94 కోట్లను ఖర్చు చేయ నుంది. అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందించాలని భావిస్తున్న ప్రభుత్వం తొలి దశలో 200 అంబులెన్స్ వాహనాలను సమకూర్చు కుంటోంది. సంవత్సరం పొడవునా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. గర్భిణీలు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సమస్యల కోసం సమీపంలోని ఆసుపత్రులకు వెళ్ళేందుకు వీలుగా ప్రభుత్వం ఈ సేవలను అందుబాటులోకి తెస్తోంది. 102 నెంబర్‌కు ఫోన్ చేస్తే కంట్రోల్‌రూమ్‌కు ఈ సమాచారం వెళ్తుందని, అన్ని జిల్లా కేంద్రాల్లో సైతం ఇదే తీరులో వ్యవస్థ పనిచేస్తుందని వైద్య ఆరోగ్య విభాగం పేర్కొనింది. ఇంటి నుంచి వీరిని సమీప ఆసుపత్రులకు తరలించడంతో పాటు తిరిగి ఇంటికి కూడా ఉచితంగా చేర్చే ఈ సదుపాయం పగడ్బందీగా అమలయ్యేందుకు ప్రతి ఆంబులెన్స్‌కు జిపిఎస్ సౌకర్యాన్నికల్పిస్తున్నట్లు ఆ శాఖ పేర్కొనింది.



బైక్ అంబులెన్స్‌లు : ప్రస్తుతం రోడ్లపై కనిపిస్తున్న '108' ఆంబులెన్స్‌ల తరహాలోనే నగరంలో ఇకపైన బైక్ అంబులెన్స్‌లు కూడా దర్శనమివ్వనున్నాయి. ప్రస్తుతానికి హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితమయ్యే ఈ సేసలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతిరోజూ అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతానికి జిహెచ్‌ఎంసి పరిధిలో 50 బైక్ ఆంబులెన్స్‌లను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం రూ. 69 లక్షలను కేటాయించనుంది. ప్రతి బైక్ ఆంబులెన్స్‌లో అత్యవసర చికిత్స కిట్, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర ఔషధాలు, సెర్వికల్ కాలర్, ప్రథమ చికిత్స కిట్ తదితరాలు ఉంటాయి. కీలకమైన కూడళ్ళలో, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ బైక్ ఆంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయని వైద్యారోగ్య శాఖ తెలిపింది.

మార్చి 12 నుంచి బడ్జెట్ సమావేశాలు

- 13న బడ్జెట్ సమర్పణ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర వార్షిక బడ్జెట్ సమావేశాలు మార్చి 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కలెక్టర్ల సమావేశం సందర్భంగా సిఎం కెసిఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. శాసనసభ, శాసనమండలి సభ్యులను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసే ప్రసంగంతో ప్రారంభమయ్యే ఈ సమావేశాలు సుమారు ఇరవై రోజుల పాటు జరిగే అవకాశం ఉంది. గవర్నర్ ప్రసంగం మరుసటి రోజైన మార్చి 13వ తేదీన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వార్షిక బడ్జెట్‌ను సమర్పిస్తారు. ఈసారి సాధారణ బడ్జెట్‌తో పాటు వ్యవసాయ, మహిళా బడ్జెట్‌లకు వేర్వేరు పద్దులను రూపొందించే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు సూచనప్రాయంగా తెలిపారు. బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహించాలని తొలుత ప్రభుత్వం భావించింది. అయితే మార్చి 11వ తేదీన పట్టాదారు పాసుపుస్తకాలను ఒకేరోజున రాష్ట్రమంతటా అన్ని గ్రామాల్లో పంపిణీ చేయాలని నిర్ణయించడంతో ఆ మరుసటి రోజు నుంచి బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనప్రాయంగా తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్ల సమావేశం సందర్భంగా ప్రగతి భవన్‌లో వివిధ అంశాల గురించి వివరిస్తున్న సమయంలో మార్చి 12 నుంచి బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలన్న నిర్ణయాన్ని వ్యక్తం చేశారు. సాధారణ ఎన్నికలు నిర్దిష్ట గడువు ప్రకారం జరిగినా లేక ముందస్తుగా జరిగినా ఈసారికి ఇదే పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. ఆ తర్వాత బడ్జెట్ 'ఓట్ ఆన్ ఎకౌంట్' స్వభావంతో ఉంటుంది. ఈసారి బడ్జెట్ 'సంక్షేమ బడ్జెట్'గా ఉండబోతుందని స్వయంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించగా, 'ఎన్నికల బడ్జెట్'గా ఉంటుందని రాజకీయ పార్టీలు వ్యాఖ్యానిస్తున్నాయి. దాదాపు ఎన్నికల మేనిఫెస్టోలో అధికార పార్టీ ఇవ్వబోయే హామీలు పరోక్షంగా ఈ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తాయని విపక్షాలు, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కొత్తగా కొన్ని గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నందున వాటికి అవసరమైన నిధుల్ని కూడా ఈ బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉంది.

హజ్ సబ్సిడీ ఎత్తివేత తొందరపాటు చర్య

- కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ అక్బరుద్దీన్ ఒవైసీ గుస్సా

మన తెలంగాణ / హైదరాబాద్ : హజ్ యాత్రికులకు సబ్సిడీని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి ఘాటుగా స్పందించారు. హిందూ, ఇతర మతస్తుల తీర్థయాత్రలకు అందిస్తోన్న సబ్సిడీలపై కేంద్రం ఇలాంటి నిర్ణయాలే తీసుకుంటుందా అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం కింగ్స్‌కాలనీలోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాము కూడా మొదటి నుంచి హజ్ సబ్సిడీని వ్యతిరేకిస్తునే ఉన్నామని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2022వ సంవత్సరంకల్లా హజ్ యాత్ర సబ్సిడీ విధానం పూర్తిగా అంతంకావాల్సి ఉందన్నారు. కానీ ఈ లోపే ప్రభుత్వం సబ్సిడీ రద్దు నిర్ణయాన్ని ప్రకటించదన్నారు. ఈ ఏడాది సబ్సిడీ విలువ రూ.200 కోట్లు మాత్రమే



అని తెలిపారు. హిందూ తీర్థయాత్రలకు నేటికీ అందుతోన్న సబ్సిడీలు ఓటు బ్యాంకు రాజకీయల కిందికి రావా అని ప్రశ్నించారు. కుంభమేళా, అయోధ్య, కాశీ, మథుర, మానససరోవర యాత్రికులకు బిజెపి ప్రభుత్వాలు ఇస్తోన్న సబ్సిడీల మాటేమిటి అని నిలదీశారు. ఆయా యాత్రలకు సబ్సిడీల కింద రూ.800 కోట్లు ఖర్చు చేస్తోన్న ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్‌ను బిజెపి నిలువరించగలదా అని ప్రశ్నించారు. ఆలయాల పునరుద్ధరణకు, అర్చకులకు నిధులివ్వడం ఆపేస్తారా అన్ని అడిగారు. అసలీ విషయంలో కాషాయపార్టీకి స్పష్టత ఉందా..ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 290ఎ అర్టికల్ రద్దు చేసేలా పార్లమెంట్‌లో బిల్లు పెట్టే దమ్ము బిజెపికి ప్రభుత్వానికి ఉందా అని అన్నారు. ఈ సారి బడ్జెట్‌లో ముస్లింల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒవైసి డిమాండ్ చేశారు.ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే 1.75 లక్షల మంది యాత్రికులకు సబ్సిడీని ఎత్తివేస్తున్నట్లు కేంద్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

నెతన్యాహును సంతృప్తి పరిచేందుకే సబ్సిడీ ఎత్తివేత : షబ్బీర్


మన తెలంగాణ/ హైదరాబాద్ : భారత్‌లో పర్యటిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహును సంతృప్తి పరిచేందుకే కేంద్ర ప్రభుత్వం హజ్ సబ్సిడీని రద్దు చేసిందని కాంగ్రెస్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్ అలీ షబ్బీర్ ఆరోపించారు. హజ్ సబ్సిడీని రద్దు చేస్తున్నట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ చేసిన ప్రకటన ఇప్పటికే హజ్ యాత్ర కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 1.75 లక్షల హజ్ యాత్రికులకు అశనిపాతంలా మారిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మహిళల సాధికరత కోసమే హజ్ సబ్సిడీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా ఎన్‌డిఎ ప్రభుత్వానికి మైనారిటీల పట్ల ఆసక్తి లేదని అర్థమవుతోందన్నారు. కనీసం జెద్దా, మదీనా, మక్కాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలనైనా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.

ప్రశ్నిస్తే జైళ్లో పెడుతారా?

- చంచల్‌గూడ జైల్‌లో మందకృష్ణ మాదిగ, ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన ఉత్తమ్



మన తెలంగాణ/హైదరాబాద్ : చంచల్‌గూడ జైళ్ళో ఉన్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, టిడిపి నాయకులు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. చంచల్‌గూడకు వెళ్ళిన ఉత్తమ్‌తో పాటు మాజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎంఎల్‌ఎ ఎస్.ఎ. సంపత్ కుమార్, మాజీ ఎంపి డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంఎల్‌సి మాగం రంగారెడ్డి తదితరులు ఉన్నారు. దాదాపు గంటన్నర పాటు మందకృష్ణ, ప్రతాప్ రెడ్డిలతో మాట్లాడిన అనంతరం జైలు వెలుపల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజన, బిసి వర్గాలపై పోలీసుల దమనకాండ, నిర్బంధం రోజుకు రోజుకు పెరిగిపోతున్నదని, ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైళ్ళలో పెడుతున్నారని విమర్శించారు. మంద కృష్ణ, ప్రతాప్‌రెడ్డిల అరెస్టు పాలకుల దమనకాండకు పరాకాష్ఠ అన్నారు. మందకృష్ణపై అనేక రకాల కేసులు నమోదు చేసి దాదాపు రెండు వారాల పాటు జైల్లో పెట్టి బెయిల్ రాకుండా అడ్డుకొని నానా రకాలుగా వేధిస్తున్నారని ఆయన అన్నారు. కెసిఆర్ నియోజకవర్గమైన గజ్వేల్‌లో ఆయనపై పోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓటమి పాలైన ప్రజా నాయకులు ప్రతాప్ రెడ్డిపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు.



"వివేక శూన్యుడైన మిత్రుడు వివేకవంతుడైన శత్రువు కంటే ప్రమాదం. – షేక్స్పియర్"

వ్యవసాయ రంగానికి బడ్జెట్ ప్రాధాన్యత

సంపాదకీయం

కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పక్షం రోజుల్లో, వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి, పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనుంది. జిడిపి వృద్ధిరేటు తగ్గుదల, వ్యవసాయరంగం దుస్థితి, ఉపాధి కల్పన వెనుకపట్టు వంటి సమస్యల నేపథ్యంలో ప్రభుత్వ 'థింక్‌టాంక్'లు బడ్జెట్ ప్రాధాన్యతలపై కసరత్తు చేస్తున్నాయి. ఆర్థికవ్యవస్థ పనితీరుతో సంతృప్తికరంగాలేని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గతవారం తన బృందం తోపాటు ఆర్థికవేత్తలతో సమావేశం జరిపారు. ప్రైవేటు పెట్టుబడి మందకొడిగా ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం విరివిగా వెచ్చించాలన్న అభి ప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. 2022 నాటికి వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేయటం అన్న ప్రధాని హామీ నెరవేరే దిశగా ఈ బడ్జెట్‌లో కొన్ని ప్రకటనలు వెలువడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జిడిపి వృద్ధి ఫలి తాలు రైతులకు చేరకపోతే ఆ వృద్ధికి అర్థంలేదని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆదివారంనాడు చేసిన వ్యాఖ్యను ఇందుకు సూచికగా భావించవచ్చు.

ప్రభుత్వ కేంద్ర గణాంకాలశాఖ (సిఎస్‌ఒ) ప్రకారం వ్యవసాయరంగం వృద్ధిరేటు 2016–17లో 4.9శాతం కాగా 2017–18 వృద్ధి అంచనా 2.1శాతమే. వ్యవసాయ రంగం దుస్థితికి, పలు రాష్ట్రాల్లో రైతాంగ అయత్నకృత ఆందోళనలకు ఇదే మూలం. 2017–18లో జిడిపి వృద్ధిరేటు గత నాలుగేళ్లలో కెల్లా తక్కువగా 6.5శాతమే ఉంటుం దన్న సిఎస్‌ఒ అంచనాకు వ్యవసాయరంగంలో వృద్ధి వెనకపట్టుపట్టటమే మూలం. 2016లో ప్రకటించిన పెద్దనోట్ల రద్దువల్ల ఏర్పడ్డ అవాంతరాలు తదుపరి ఆర్థిక సంవత్స రంలోకి రావని ప్రభుత్వం చెప్పినప్పటికీ, అది గ్రామీణ ఉపాధుల తగ్గుదలను, ఆదా యాల క్షీణింపును కొనసాగించింది. ప్రభుత్వం తప్పు ఒప్పుకోకపోయినా, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టిపెట్టి వ్యవసాయ వ్యూహాన్ని రూపొందిస్తున్నారు.

వ్యవసాయాదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపుచేసేందుకు అవసరమైన కార్యసరళిని సూచించేందుకు నియమించిన ఉన్నతాధికార కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందింది. యుపిఎ ప్రభుత్వం సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామి నాథన్ నేతృత్వంలో నియమించిన 'జాతీయ రైతు కమిషన్' నివేదికను అటకెక్కించిన ఈ ప్రభుత్వం అధికా రుల కమిటీ నివేదికను ఏ మేరకు అమలు జరుపుతుందన్న సంశయం ఎవరికైనా రావటం సహజం. అమలు సంగతి తర్వాత – అది ఏమి చెప్పిందో సూక్ష్మంగా చూదాం. వ్యవసాయ భూముల లీజింగ్ విధానాన్ని సరళీకరిస్తూ, కౌలురైతులను, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని గుర్తించాలి. వ్యవసాయ మార్కెట్లను సరళీకరించాలి, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలు కొనుగోలు చేసే వికేంద్రీకృత విధానాన్ని పటిష్టం చేయాలి. మార్కె టింగ్ వ్యవస్థను విస్తృతపరచాలి. వ్యవసాయోత్పత్తి, ఉత్పత్తి అనంతర సదుపాయాలకు పెట్టుబడులు పెంచాలి. రైతు అనే నిర్వచనం కిందకు సాగుదార్లను, కౌలురైతులను, పాలికాపులను తీసుకురావాలి. అలాచేస్తేనే వారికి వ్యవస్థాగత పెట్టుబడులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభ్యమవుతాయి. వ్యవసాయ నిజ ఆదాయంలో వార్షికవృద్ధి 10.4 సాధించాలంటే ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడులు వరుసగా 12.5శాతం, 16.5శాతం చొప్పున వచ్చే ఐదేళ్లపాటు పెరగాలి. అంటే 2015–16 లో రూ.1లక్ష 78వేల కోట్లుగా ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడి 2022–23నాటికి రూ.4లక్షల 86వేల కోట్లకు పెరగాలి.

ఇదొక బృహత్తర కర్తవ్యం. కార్పొరేట్ రంగానికి ఇచ్చే రాయితీలతో పోల్చితే పైన సూచించిన పెట్టుబడి అసాధ్యం కాదు. అరకొర వాగ్దానాలు కాదు, రాజకీయ–పరిపా లనా సంకల్పం ఎంతో ముఖ్యం. అందువల్ల, ప్రభుత్వ సంకల్పం ఏ పాటిదో వచ్చే బడ్జెట్ గీటురాయి కానుంది. ఇప్పటికే రైతులకు ఎన్నో చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం వాటి ఫలితాలను బేరీజు వేయాలి, దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

ఆధార్‌పై ఉష్ట్రపక్షి ధోరణి


చూపు

ఆధార్ విషయంలో సేకరించిన వ్యక్తిగత సమాచారం సురక్షితం కాదు అన్నవాదన లేవనెత్తినప్పుడల్లా భారత విశిష్ట గుర్తింపు వ్యవస్థ (యు.ఐ.డి.ఎ.ఐ.) ఇసకలో తల దూర్చేస్తూ ఉంటుంది. చండీగఢ్ నుంచి వెలువడే ట్రిబ్యూన్ పత్రిక విలేకరి కేవలం రూ.500 చెల్లించి ఆధార్ సమాచారం సేకరించిన వైనాన్ని ప్రచురిస్తే ఆధార్ వ్యవస్థ ఆ విలేకరిపై కేసు నమోదు చేయించింది. ఈ సమాచారం సేకరించినందువల్ల ప్రమాదం ఏమీ జరగలేదని చెప్పింది. కాని జనం తమ వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించుకోవా లని సలహా పారేసింది. ఆధార్ గురించిన అసత్య ప్రచారానికి తెరదిం చవలసిన సమయం ఆసన్నమైంది.

ఆధార్ చాలా విస్తృతమైన, సర్వవ్యాప్తమైన వ్యవస్థ కనక ఇబ్బం దులకు ఆస్కారం ఉంటుంది. అనేక సందర్భాలలో అనధికారికంగా ఈ సమాచారాన్ని సేకరించి, ప్రచురించి, దుర్వినియోగం చేసిన ఉదంతాలు ఉన్నాయి. ట్రిబ్యూన్ ప్రచురించిన వార్తను బట్టి అనధికా రికంగా ఈ సమాచారాన్ని ఎలా అంగడి సరుకు చేస్తున్నారో రుజువు అయింది. జనాభాకు సంబంధించిన సమాచారాన్ని అప్పనంగా అమ్మేస్తున్నారు. ఇంతకు ముందు ఏర్‌టెల్ పేమెంట్ బ్యాంకు తమ వినియోగదార్ల ఖాతాలు సృష్టించి వారి అనుమతి లేకుండానే ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద ఇచ్చిన డబ్బును పేమెంట్ బ్యాంకు ఖాతా ల్లోకి మళ్లించిన విషయం గురించి విన్నాం. అనేక ప్రభుత్వ వెబ్‌సైట్ల లాగే జార్ఖండ్ ప్రభుత్వ వెబ్‌సైట్ ఆధార్ నెంబర్లను, బ్యాంకు ఖాతాల వివరాలను, దాదాపు పదిలక్షల మంది పింఛన్ దార్ల ఖాతాదార్ల పేర్లను, చిరునామాలను వెల్లడించింది.

ఇలాంటి అవకతవకలు బయట పడ్డప్పుడల్లా యు.ఐ.డి.ఎ.ఐ. బయో మెట్రిక్ (జీవ పరిణామ సంబంధ) సమాచారం సురక్షితంగా ఉందని, వెల్లడి అయిన ఆధార్ నెంబర్ల వల్ల ఆ వెబ్‌సైట్ల వల్ల ముప్పేమీ లేదని చెప్తూ వస్తోంది. జీవ పరిణామ సంబంధ సమా చారం లేనిదే ఈ సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశం లేద ని బుకాయిస్తూ వచ్చింది. (2017 నవంబర్ 20 నాటి యు.ఐ. డి.ఎ.ఐ. పత్రికా ప్రకటన). ఈ సమాచారం వెల్లడి కాలేదనే చెప్తోంది. వెల్లడైన సమాచారం నామమాత్రం అయిందని వాదిస్తోంది. తమ వ్యవస్థకు సంబంధించిన సకల అంశాలు తమ దగ్గర ఉంటాయని, ఏ మాత్రం దుర్వినియోగం జరిగినా కనుక్కోవచ్చునని కూడా యు.ఐ. డి.ఎ.ఐ. చెప్తూ వస్తోంది.

ఈ ఉదంతాలు బయట పడ్డ తర్వాత 5000మంది అధికారు లకు ఈ సమాచారం అందుబాటులో లేకుండా చేసింది. రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీన్నే వాస్తవిక గుర్తింపు, కె.వై.సి. అంటారు. ఇప్పటికే లక్షలాది మంది దరఖాస్తుదార్ల సమాచారం ప్రైవేటు ఆపరేటర్లకు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇప్పుడు బ్యాంకులు, తపాల కార్యాలయాల వంటి ప్రభుత్వ కేంద్రాలకు ఈ బాధ్యత అప్పగించారు. వాస్తవాలు బయటికి వచ్చిన తర్వాతే చర్య తీసుకోవడం మొదటి నుంచి యు.ఐ.డి.ఎ.ఐ.కి అలవాటుగా మారింది. ప్రతి అడుగులోనూ నష్టం జరిగిపోయిన తర్వాత నివారణ చర్యలు తీసుకుంటున్నామని చెప్తోంది. ఆధార్‌కు కావాల్సిన చట్టం చేయక ముందే యు.ఐ.డి.ఎ.ఐ. వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఆధార్ సంఖ్యలను



నమోదు చేయడం, అనుసంధానం చేయడం ప్రారంభించారు. ఏ చట్టమూ, భద్రత లేకుండానే సకల జీవన రంగాలకు ఆధార్ నమోదు తప్పని సరి చేశారు. వ్యక్తిగత సమాచారానికి రక్షణే లేకుండా మొత్తం వ్యవహారం సాగిపోయింది.

జనన ధృవీకరణ సర్టిఫికేట్ నుంచి మరణ ధృవీకరణ సర్టిఫికేట్ దాకా సకల విషయాలకు ఆధార్ సంఖ్య నమోదు తప్పనిసరి చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిరాశ్రయులు శరణాలయాల్లో చేరా లంటే ఆధార్ సంఖ్య అందజేయాలని కోరడం ఈ అస్తవ్యస్తతకు పరా కాష్ఠ. దీనితో 'ఆధార్ కార్డు లేని వారు కేంద్రప్రభుత్వం దృష్టిలో, ఉత్త ర ప్రదేశ్ ప్రభుత్వం దృష్టిలో మనుగడలో లేనట్టేనా' అని సుప్రీంకోర్టు కటువుగా ప్రశ్నించవలసి వచ్చింది.

ప్రభుత్వం చెప్పిన దానికి అతీతంగా ఆధార్‌ను తప్పని సరి చేయ డాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసు 2015 నుంచి సుప్రీంకోర్టు పరిశీ లనలో ఉంది. ఈ కేసులో జనవరి 17 నుంచి మళ్లీ విచారణ జరగబో తోంది. ఆధార్ వ్యవస్థను ఎందుకు, ఎలా ప్రారంభించారు, అది ఎలా సర్వవ్యాప్తమైందో అడగవలసిన అగత్యం అత్యున్నత న్యాయస్థానా నికి ఉంది. ఆధార్ సమాచారానికి భద్రతలేని వైనాన్ని, ప్రభుత్వం అందించే సేవలు ఆధార్ కార్డు లేకపోతే అందుబాటులో లేని పరిస్థితి ని, ఆధార్ సంబంధిత అంశాలలో పౌరుల హక్కులను, అన్నింటి కన్నా ముఖ్యంగా ఈ విషయాలలో యు.ఐ.డి.ఎ.ఐ. వైఫల్యాలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. కీలక మైన సమాచారంపై నియంత్రణ ఉన్న యు.ఐ.డి.ఎ.ఐ. సరైన భద్రత లేకుండా ఎలా నిర్వహించగలదో కూడా పరిశీలించాలి.

దేశంలో సమాచార భద్రత విషయంలో బి.ఎన్. శ్రీకృష్ణ కమిటీ విడుదల చేసిన శ్వేతపత్రంలో 'సమాచార భద్రతను అమలు చేయడా నికి ఉన్నత స్థాయి చట్టబద్ధమైన వ్యవస్థ ఉండాలి' అని చెప్పింది. ఇలాంటి వ్యవస్థలకు అనేక అంతర్జాతీయ ఉదాహరణలు, పూర్వోదం తాలు ఉన్నాయని కూడా ఈ శ్వేతపత్రంలో తెలియజేశారు. అంటే ఈ వ్యవస్థ యు.ఐ.డి.ఎ.ఐ.కి సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉండాల్సిందే.

మనం సమాచార యుగంలోకి ప్రవేశిస్తున్నాం. ఒక వ్యక్తి గుర్తిం పు సమాచారాన్ని సృజిస్తుంది. అది రాజ్యవ్యవస్థకు మాత్రమే కాకుం డా ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు కూడా అందుబాటులో ఉంటుంది. మన దేశంలో ఆధార్ పథకాన్ని ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ప్రారం భించారు. వ్యక్తుల గోప్యతకు అవకాశం లేకుండా చేశారు. ఈ గోప్య తను ఇటీవలే అత్యున్నత న్యాయస్థానం ధ్రువీకరించింది. సుప్రీం కోర్టు ఈ గోప్యత హక్కును పునరుద్ఘాటిస్తుందని ఆశిద్దాం. ఎందు కంటే దాన్ని చిందరవందర చేస్తున్నారు.

(ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)

అసోంలో ఎన్‌ఆర్‌సి ప్రకంపనలు

అసోంలో జాతీయ పౌరుల రిజిస్టర్‌లో మార్పులు, చేర్పులు చేయడానికి కేంద్రప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకించడం ద్వారా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముస్లిం ఓటు బ్యాంకుపై కన్నేసి పావులు కదుపుతు న్నారని అర్థమౌతోంది. సుప్రీంకోర్టు ఉత్తర్వులపై అసోం లో ఆ జాబితా ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. బెంగాల్ భారతీయ జనతాపార్టీ (బిజెపి)నాయకులు మమత వ్యతిరేకతను ముస్లిం ఓటుబ్యాంకుపై కన్నేసినట్టు గానే భావిస్తున్నారు. మమత ప్రయత్నాల వల్ల అసోంలో, ఇరుగుపొరుగున ఉన్న రాష్ట్రాల్లో తమ పార్టీ అవకాశాలు దెబ్బతింటాయన్న భయం కూడా వారికి ఉంది. ఎన్‌ఆర్‌సి అప్‌డేటింగ్ వల్ల రాజకీయ పర్యవసానాలు ఎలా ఉంటా యన్న దానిపై బెంగాల్‌లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అధికారంలోగల తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి)ఆ అప్‌డే టింగ్ యత్నాలనుఅడ్డుకోవడంవల్ల ఈశాన్యప్రాంతంలో కీలక రాజకీయ రంగంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఎన్‌ఆర్‌సి అప్‌డేటింగ్‌పై సహజంగానే అసోంలో ప్రజాభి ప్రాయం నిలువునా చీలిపోయి ఉంది. ఈ నేపథ్యంలో టిఎంసి విమర్శలు కూడా తోడయ్యాయి.

తూర్పు బెంగాల్(బంగ్లాదేశ్) నుంచి వలస వచ్చి న హిందువులను పౌరులుగా బిజెపి ప్రభుత్వం అనుమతింప చేస్తుందన్న భయాలు సర్వసాధారణంగా అస్సామీలలో ఉన్నాయి. అదే జరిగితే తమ సొంత రాష్ట్రంలో తాము మైనారిటీలుగా మిగులుతామని వారు భయపడుతున్నారు. ముస్లింలైనా, హిందువులైనా కొన్ని ప్రాంతాలలో తూర్పు బెంగాల్ సంతతివారు అస్సామీలుగానే చలామణి అవుతు న్నారు. వారి మాతృభాష అస్సామియా. దశాబ్దాల జనాభా లెక్కల చరిత్రలో వారంతా అస్సామియా ప్రజలు గానే రికార్డులకెక్కారు. బారక్ లోయలోని హిందూ ఓటర్ల గుర్తింపు అలా లేదు. పౌరసత్వం హిందువులకు లభిం చిన వెంటనే ఇంతకాలం వారు వద్దనుకున్న సాధారణ హక్కులను ధృవపరచుకోవడానికి ప్రయత్నిస్తారు. భద్రత కోసం వారు దశాబ్దాలుగా తమ అసలు మాతృభాషను వెల్లడించటం లేదు, తమ హక్కులను పట్టించుకోవడం లేదు. ఇప్పుడు వారి పౌరసత్వం అస్సామీయుల ప్రయో జనాలకు సమస్యలు సృష్టిస్తుంది.

మూడు జిల్లాలు బిజెపికి కీలకం

అనేక దశాబ్దాలుగా అసోంలో మతపరమైన, భాషాపరమైన మైనారిటీలు కాంగ్రెస్‌ను బలపరుస్తూ వచ్చారు. బెంగాలీలు మెజారిటీలోగల మూడు కచార్ జిల్లాలలో హిందువులు బిజెపిని బలపరచడం ప్రారంభిం చాక ఆ ఆనవాయితీకి తెరపడింది.

బిజెపిని తమ రక్షక సంస్థగా ఆ మూడు జిల్లాల హిందువులు భావిస్తున్నారు. ఈ జిల్లాలలో బెంగాలీ హిందువులు బెంగాలీనే తమ మాతృభాష గా ప్రకటిస్తూ వస్తున్నారు. అయితే బెంగాల్ మాట్లాడే ముస్లింలు మాత్రం అలా ప్రకటించరు. వారు అస్సామియానే తమ మాతృభాషగా చాలా ఏళ్ళనుండి ప్రకటిస్తున్నారు. కచార్ జిల్లాలతో సహా ఎక్కడైనా అదే జరుగుతోంది. అసోంలో బిజెపిని బలపరుస్తున్న అసోం గణపరిషత్(ఎజిపి), అఖిల అస్సాం విద్యార్థిసంఘం (ఎఎఎస్‌యు)వంటి చిన్న సంస్థలు తూర్పు బెంగాల్ హిందూ శరణార్థులను పౌరు లుగా నమోదు చేయవద్దని చాలా హెచ్చరికలు చేశాయి. బిజెపికి, కేంద్రప్రభుత్వానికి ఈ మేరకు అనేక విజ్ఞప్తులు వెళ్లాయి.

అందుచేతనే ఎన్‌ఆర్‌సి మొదటి జాబితానుండి ఆరు గురు మంత్రులతో సహా అనేకమంది బెంగాలీ ఓటర్లను మినహాయించడం జరిగింది. అసలైన పౌరులను జాబితా నుండి మినహాయించడం జరగదని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు రెండూ హామీ ఇస్తున్నాయి. అసోంలోకి, మొత్తం ఈశాన్య రాష్ట్రాలలోకి బంగ్లాదేశ్‌నుండి వలసల అంశాన్ని పట్టించుకోకుండా వదిలేసే సమస్య లేదని రాష్ట్ర, కేంద్రస్థా యిలో బిజెపి స్పష్టం చేస్తూనే ఉంది. 'హిందువులు ఉండి పోవచ్చు, కానీ ముస్లింలను బంగ్లాదేశ్‌కు తిప్పిపంపిస్తాం' అని చాటడం మానలేదు. ఈ నినాదంపై ఆధారపడే 2014లో బిజెపి అసోంలో లోక్‌సభ ఎన్నికలలో అఖండ విజయం సాధించింది. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ చాలా పరుష పదజాలంతో బిజెపి వైఖరిని చాటారు. 'అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను విసిరేస్తాం' అన్నారు. అసామియా హిందువులలో ఈ చాటింపు ప్రతిధ్వనులు సృష్టిస్తూనే ఉంది.

ఎన్‌ఆర్‌సి అప్‌డేట్ రూపేణా అసోంలోని వివిధ తెగ లవారీ, మతంవారీ, భాషలవారీ జనసమూహాల లెక్కల సేకరణ చాలా కీలకమైన అంశం. అటు అధికార బిజె పికి, ఇటు కేంద్రప్రభుత్వ నేతలకు ఆ జాబితా అప్‌డేట్ కావడం ముఖ్యమైన పరిణామం. కచార్ తదితర జిల్లా లలో బెంగాలీల మద్దతును దీనివల్ల బిజెపి కోల్పోవచ్చు. అసామియాలు ఆ రాష్ట్రంలో ఆధిక్యంలో ఉండడంవల్ల ఆ రాష్ట్రంలో బిజెపి బలం చాలా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ప్రాంతీయ పార్టీకి జూనియర్ స్థాయి భాగస్వామిగానే జాతీయ పార్టీలు రాష్ట్రాలలో అధికారాన్ని పంచుకునే పాత ఆచారం మళ్లీ పునరావృతం కావచ్చు.

ఇతర చోట్ల కూడా ఈ ఎన్‌ఆర్‌సి అప్‌డేటింగ్ ప్రభావం ఉంటుంది. ముఖ్యం గా పొరుగున ఉన్న బెంగా ల్‌లో ఇది బిజెపికి ఆందోళనకరమైన అంశం.గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలు గెలుచుకున్నాక బెంగాల్, ఒరిస్సా తమ తదుపరి లక్ష్యంగా బిజెపి ప్రకటించింది. భారతదేశపు తూర్పు ప్రాంతంలో బిజెపి పట్టు నిలవాలం టే ఆ రాష్ట్రాలను గెలుచుకోక ఆ పార్టీకి తప్పదు.

అసోం గెలుపు బిజెపికి నిలిచేనా?

అసోం రాష్ట్రాన్ని బిజెపి ఇటీవలే గెలుచుకుంది. జార్ఖండ్‌లో గెలుపు, బీహార్‌లో ప్రస్తుత పాగా అవిభక్త బీహార్ రాష్ట్రం విభజన తర్వాతే సంభవించాయి. పశ్చిమ బెంగాల్‌లోకి అసోం పరిణామాల దృష్ట్యా బెంగాలీ హిందువులు గానీ, ముస్లింలుగానీ వలస వస్తే బెంగాల్‌లో గెలుపు ఆశలు బిజెపి శాశ్వతంగా వదులుకోవలసిందే. మమతాబెనర్జీ ఆ వలసల కోసమే ఆశతో ఎదురుచూస్తు న్నారనడం నిజం.

బిజెపికి ప్రస్తుతం ఆలోచనల కొరత లేనేలేదు. ముఖ్యంగా కేంద్రంస్థాయిలో పాచికలు వేయడం ఆ పార్టీకి సునాయాసం. అందుచేత అసోంలో అక్రమ వలస దారులుగా గుర్తించినవారికి వర్క్ పర్మిట్లను జారీచేసే పాత ఉపాయాన్ని కేంద్రస్థాయిలో బిజెపి అమలు పరచ వచ్చు. అనేక యూరప్ దేశాలలో ఇదే వ్యూహాన్ని శరణా ర్థులకు, వలస సెటిలర్లకు అమలు పరుస్తున్నారు. అటు వంటి వారికి ఓటింగ్ వంటి సాధారణ హక్కులు కొంతకా లంపాటు ఉండవు. అప్పుడు సెటిలర్లు ఎక్కడికక్కడే తాత్కాలిక ఉద్యోగంలో కుదురుకుని వలస ఊసు ఎత్త కుండా ఉంటారు. అదే జరిగితే మమతాబెనర్జీ కల చెదరడం ఖాయం.

సెటిలర్ల ఆధిక్యతను అడ్డుకోవడానికి ఫిజీలో ప్రస్తుతం అమలులో ఉన్న రాజకీయ వ్యవస్థ వ్యూహాన్ని కేంద్రం అసోంలో ప్రయత్నించే అవకాశం కూడా ఉంది. ఆ వ్యూహం కింద ఆ ప్రాంతపు జాతీయత గల పౌరులు అధికంగా రాజకీయ ప్రాధాన్యత కలిగి ఉంటారు. వారికి హక్కుల రక్షణ కూడా ప్రత్యేకంగా ఉంటుంది. అసోం నుంచి తరిమివేసిన అక్రమ వలస దారులకు బంగ్లాదేశ్ తలుపులు తెరవదని అసామియా నాయకులకు తెలుసు. వారే ఈ డిమాండ్‌ను తెరమీదకు తెస్తున్నారు.

బెంగాల్‌కు బీహార్ తరహా పరిష్కారం కూడా ప్రస్తావ నలోకి వచ్చింది. ఆ రాష్ట్రాన్ని ఉత్తర, దక్షిణ బెంగాల్ పాల నా ప్రాంతాలుగా చీల్చడం ఇందులోని విశేషం. అపుడు ఉత్తర బెంగాల్‌లో బిజెపి ఓట్లు అధికంగా ఉంటాయి. ఇటువంటి ఏర్పాటుకు టిఎంసి, ఇతర పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది ఊహించలేం.

మొత్తానికి జాతీయ పౌరుల రిజిస్టర్‌ను అసోంలో అప్‌డేట్ చేయడం రాజకీయ డొంకను కదిలిస్తోంది.

> ఎన్‌ఆర్‌సి మొదటి జాబితానుండి ఆరుగురు మంత్రులతో సహా అనేకమంది బెంగాలీ ఓటర్లను మినహాయించడం జరిగింది. అసలైన పౌరులను జాబితానుండి మినహాయించడం జరగదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ హామీ ఇస్తున్నాయి. అసోంలోకి, మొత్తం ఈశాన్య రాష్ట్రాలలోకి బంగ్లాదేశ్‌నుండి వలసల అంశాన్ని పట్టించుకోకుండా వదిలేసే సమస్య లేదని రాష్ట్ర, కేంద్ర స్థాయిలో బిజెపి స్పష్టం చేస్తూనే ఉంది. 'హిందువులు ఉండిపో వచ్చు, కానీ ముస్లింలను బంగ్లాదేశ్‌కు తిప్పిపంపిస్తాం' అని చాటడం మానలేదు. ఈ నినా దంపై ఆధారపడే 2014లో బిజెపి అసోంలో లోక్‌సభ ఎన్నికలలో అఖండ విజయం సాధిం చింది. ఈ అంశంపై ప్రధాని నరేంద్రమోడీ చాలా పరుష పదజాలంతో బిజెపి వైఖరిని చాటారు. 'అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను విసిరేస్తాం' అన్నారు. అసామియా హిందువు లలో ఈ చాటింపు ప్రతిధ్వనులు సృష్టిస్తూనే ఉంది.

✻ ఆషిన్ బిశ్వాస్

న్యాయమూర్తులూ... రోడ్డు కెక్కాలా?



చెన్నూరి గణేశ్
8897300975

దేశ న్యాయచరిత్రలోనే అసాధారణ పరిణామం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా తీరును ఆక్షేపిస్తూ నలుగురు సీనియర్ న్యాయమూర్తు లు బహిరంగ ప్రకటన చేయడం. ప్రధాన న్యాయమూర్తి పని తీరును తప్పు పడుతూ బహిరంగ లేఖ విడుదల చేయడమే కాకుండా విధిలేని పరిస్థితుల్లో తాము ఆయన పనితీరుపై బాహాటంగా విమర్శలు చేయాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. న్యాయమూర్తుల బృందా నికి మన రాష్ట్రానికి చెందిన సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వం వహించడం విశేషం.

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై విమర్శలు గుప్పిం చిన నలుగురు న్యాయమూర్తుల్లో జస్టిస్ చలమేశ్వర్‌తో పాటు జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ తరుణ్ గొగోయ్, జస్టిస్ ఎం.బి.లోకూర్ ఉన్నారు. వీరిలో జస్టిస్ గొగోయ్ వచ్చే అక్టోబర్‌లో పదవీ విరమణ చేయనున్న మిశ్రా స్థానంలో ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రధాన న్యాయమూర్తిపై సీనియర్ న్యాయమూర్తులు చేసిన ప్రధాన ఆరోపణ ఏమిటంటే కేసుల కేటాయింపులో ఆయన ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా రోస్టర్ విధానాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని. అలాగే సీనియర్లకు ఇవ్వాల్సినంత గౌరవం కూడా ఇవ్వడం లేదని. నిజానికి ప్రధాన న్యాయమూర్తితోపాటు ఆయనకు వ్యతిరే కంగా గళం విప్పిన నలుగురు న్యాయమూర్తుల చిత్తశుద్ధిని ఏ మాత్రం శంకించడానికి వీలులేదు. ఎవరికి వారు ఎన్నో కీలకమైన కేసుల్లో నిష్పక్షపాతంగా తీర్పులు ఇచ్చి వారి నిబద్ధతను చాటుకున్నారు.

దేశంలోని పలు వ్యవస్థలకు స్వయం ప్రతిపత్తి కల్పిం చడంతోపాటు క్రమశిక్షణ, జవాబుదారీతనం కల్పించి మన రాజ్యాంగకర్తలు ఎంతో దూరదృష్టితో వ్యవహరిం చారు. ఇందు లో ప్రధానమైనది మన న్యాయవ్యవస్థ. ఎన్నో లోపాలు ఉన్నప్పటికీ మన ప్రజాస్వామ్యం ఈ మాత్రం పచ్చగా ఉన్నదంటే ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న అచం చల విశ్వాసమే.

కిందిస్థాయిలోని అవలక్షణాలకు దూరం గా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలు ఉండేలా మార్గదర్శకాలు రూపొందించారు. అయితే రానురాను న్యాయమూర్తుల నియామకాలు వారి ప్రతిభ ఆధారంగా కాకుండా పలుకుబడి ప్రామాణికంగా జరుగుతూ వస్తు న్నాయి. రాజకీయ వ్యవస్థకు దూరంగా ఉండాల్సిన ఈ పవిత్ర దేవాలయం కాస్త ఇప్పుడు వారి కనుసన్నలకు చేరింది.

ఒక్క న్యాయవ్యవస్థనే కాదు రక్షణ, నేర విచారణ, అంతర్గత తనిఖీ, ఎన్నికల సంఘం వంటి అనేక వ్యవస్థలు ఎదురొడ్డి ఇంతకాలం క్షేమంగా ఉన్నాయంటే వాటిలోని క్రమశిక్షణే. ఇప్పుడు అత్యున్నత స్థాయిలోనే న్యాయమూ ర్తులే గిరి దాటి బరిలోకి రావడం ఆందోళన కలిగించే అంశం. ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు న్యాయమూ ర్తులు చేసిన విమర్శల తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద చర్చ మొదలైంది. వారికి అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు విడిపోయి సోషల్ మీడియాతోపాటు అన్ని మాధ్యమాలలో దుమ్మెత్తిపోసుకుంటున్నారు. వాదప్రతివా దనలు పక్కన పెడితే న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు అంత తీవ్రమైనవి కావని, పరిపాలనాపరమైన చిన్న విష యాలకు ఇంత రచ్చ అవసరం లేదనేది సర్వత్రా వినిపిస్తున్న మాట.

న్యాయమూర్తుల మధ్య అక్కడక్కడ విభేదాలు చోటుచే సుకున్న సందర్భాలు గతంలో అనేకమున్నాయి. మద్రాస్ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తికి అక్కడే ఉన్న మరో న్యాయమూర్తి కన్నన్‌కు మధ్య రగులుకున్న వివాదం చిలికి చిలికి గాలివానై చివరకు పశ్చిమ బెంగాల్‌కు బదిలీపై వెళ్ళినా ఆయనను వదలలేదు. సుప్రీం ధర్మాసనంపై తీవ్ర విమర్శలు చేసినందుకు ఆయనపై కోర్టు ధిక్కార అభి యోగం మోపి జైలుకు పంపారు. దళితుడైన కన్నన్ చేసిన విమర్శలు కోర్టు ధిక్కారం కిందికి వచ్చినప్పుడు ప్రధాన న్యాయమూర్తిపై చేసిన విమర్శలు ఆ పరిధిలోకి రావా అని ప్రశ్నించే వారు లేకపోలేదు.న్యాయమూర్తుల మధ్య పేచీలు అన్ని చోట్లా ఉంటాయి. జిల్లా కోర్టు నుంచి మొదలుపెడితే సుప్రీం వరకు అన్ని చోట్లా ఇది సహజం. అయితే బహి రంగ విమర్శలు చేసిన సంఘటనలు గతంలో ఎన్నడూ లేవు. న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు వచ్చిన ప్పుడు వారిని ఉభయ సభల్లో తీర్మానాల ద్వారా అభిశం సించడం రాజ్యాంగం పేర్కొన్న విధానం. గతంలో ఇద్దరు, ముగ్గురు న్యాయమూర్తులపై ఇలా తీర్మానాలు ప్రతిపాదిం చినా అవేవీ అమలు కాకమునుపే వారు విధులనుంచి తప్పుకున్నారు.

న్యాయమూర్తుల వివాదం అనంతరం కేంద్రం అటార్నీ జనరల్ ద్వారా రంగంలోకి దిగి సయోధ్య ప్రయ త్నాలు ప్రారంభించింది. సుప్రీం బార్ అసోసియేషన్ కూడా రంగంలోకి దిగి తన వంతు ప్రయత్నాలు మొదలు పెట్టింది. తనపై వచ్చిన విమర్శలు దృష్టిలో పెట్టుకుని ప్రధాన న్యాయమూర్తి స్వయంగా ఆ నలుగురిని పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటే మరింత హుందాగా ఉంటుంది.

మన తెలంగాణ
5
హైదరాబాద్
బుధవారం
17 జనవరి, 2018
www.manatelangana.news



పల్స్

మీ బరువు నిర్వహణలో విఫలం అవుతున్నారని తెలిపేది పొట్ట చుట్టూ ఏర్పడే కొవ్వు. పొట్టను తగ్గించుకోవటానికి చాలా రకాల వ్యాయామాలను, ఆహార ప్రణాళికలను మార్చినప్పటికీ, పొట్ట తగ్గటం లేదా! దీనికి కారణం మీ అలవాట్లు అని చెప్పవచ్చు. పొట్ట పెరగానికి సాధారణ కారణాలు..



పొట్ట పెరగడానికి కారణాలివే..

ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మాత్రమే కాకుండా కొన్ని రకాల చెడు అలవాట్లు కూడా శరీర బరువు పెరగడానికి కారణమౌతాయి. కొన్ని అలవాట్లు శరీర బరువును పెంచి, నడుము చుట్టూ కొవ్వు పదార్థాలు పేరుకుపోయేలా చేస్తాయి. అలాంటి అలవాట్లేమిటో చూద్దాం..



*** రాత్రి ఆలస్యంగా తినటం** నిద్రపోయిన సమయంలో మన శరీరంలో కొవ్వు పదార్థాలు వినియోగించబడతాయి. రాత్రి సమయంలో ఆలస్యంగా తినటం వల్ల ఈ ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడటమే కాకుండా, కొవ్వు పదార్థాల వినియోగానికి సమస్యలు కలుగుతాయి. అంతేకాకుండా ఆలస్యంగా కడుపునిండా తినటం వల్ల ఆసిడ్‌లు ఎక్కువ విడుదల అవటం లేదా అజీర్ణానికి దారి తీయవచ్చు.

*** అల్పాహారం తినకపోవటం** మన శరీరానికి అల్పాహారం చాలా ముఖ్యం అని చెప్పవచ్చు. అల్పాహారాన్ని మరచినట్లయితే, మధ్యాన్న భోజనంలో ఆహారం ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పదార్థాలు అధికమై, పొట్ట చుట్టూ పేరుకుపోయే అవకాశం ఉంది. ఎప్పటి ఆహారాన్ని అప్పుడే తినటానికి ప్రయత్నించండి.

*** ఆల్కహాల్ సేవించడం** అధికంగా ఆల్కహాల్ తాగటం వల్ల కూడా పొట్ట పెరిగే అవకాశం ఉంది. ఆల్కహాల్ నుండి శరీరానికి అధిక మొత్తంలో క్యాలోరీలు అందించబడి, కొవ్వు పదార్థాలు పేరుకుపోయి, శరీర బరువును పెంచుతాయి. అందువల్ల తగిన స్థాయిలో మాత్రమే తాగటం మంచిది. మానేస్తేనే ఆరోగ్యం బాగుంటుంది.

*** చక్కెర ద్రావణాలను, సోడాను మానేయాలి** చాలా మంది దాహంగా అనిపించినపుడు ఎక్కువ శాతం, చక్కెర ద్రావణాలను లేదా సోడా వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తారు. ఈ అలవాటు వల్ల నడుము చుట్టూ కొవ్వు అలాగే ఉంటుంది. చాలా వరకు ఈ ద్రావణాలు చక్కెరలను కలిగి ఉండి, ఆకలిని పెంచి, అధిక ఆహార సేకరణను ప్రోత్సహిస్తాయి. దాహంగా అనిపించినపుడు పోషకాలు ఎక్కువగా ఉన్న ద్రావణాలను లేదా నీటిని తాగండి.

*** ప్లేట్ నిండా తినటం** పొట్ట తగ్గకపోవటానికి మరో ముఖ్య కారణం ప్లేట్ నిండా ఆహారం అని చెప్పవచ్చు. ఇలా అధికంగా ఆహారం మీ ముందు ఉండటం వల్ల శరీరానికి కావలసిన దాని కంటే ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. ఫలితంగా, శరీరంలో కొవ్వు పదార్థాల నిల్వ అధికం అవుతుంది. చిన్న ప్లేట్ లో మీకు కావలసిన మేరకు మాత్రమే ఆహారాన్ని పెట్టుకుని తినడం అలవాటు చేసుకోవాలి.

*** భావోద్వేగాల సమయం** బాధ, సంతోషం లేదా కోపానికి గురైన సమయంలో ఎక్కువ ఆహారం తీసుకుంటాం. అందువల్ల భావోద్వేగాల నుండి బయటకు వచ్చే అవకాశం ఉంది. కానీ దీని వల్ల కొవ్వు పేరుకుపోవడం ఖాయం. ఇలాంటి సమయంలో స్నేహితులతో మాట్లాడటం లేదా గ్లాసు నీటిని తాగటం వంటి వాటిని చేయండి.

*** ఆలస్యంగా పడుకోవటం** నిద్రలోపం వల్ల శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. నిద్ర సరిపోకపోవటానికి కారణం, రోజూ రాత్రి ఆలస్యంగా పడుకోవటం. నిద్రాలోపాల వల్ల శరీరంలో 'కార్టిసాల్' హార్మోన్ విడుదల అధికమై, ఆకలిని పెంచటం మూలంగా ఎక్కువగా ఆహారాన్ని తీసుకుంటారు. 7 నుండి 9గంటల పాటూ నిద్ర తప్పని సరి.



- * బీట్‌రూట్ లివర్‌కి, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులు రాకుండా అరికడుతుంది.
- * శరీరానికి మంచి బలం కోసం తరచు బీట్‌రూట్ తినాలి.
- * బీట్‌రూట్ తినడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది.
- * ఆరోగ్యకరమైన దుంపకూర ఇది.

సన్నగా ఉన్నారా?



పాలు శరీర బరువును పెంచే ఆహార పదార్థాలలో ముఖ్యమైనవి అని చెప్పవచ్చు. ఒక పిడికెడు నట్స్ నుండి కొన్ని వందల కెలోరీలను పొందవచ్చు.ఆవాల నూనె, కొబ్బరి నూనెలతో తయారు చేసిన ఆహారాన్ని తినాలి . ప్రతి రోజు జ్యూస్‌లను తాగాలి. శరీర బరువు పెరగాలంటే అధికంగా ఆహార పదార్థాలను తీసుకోవాలి కానీ, ఎంచుకునే ఆహార పదార్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఎలాంటి కెలోరీలను అందించని ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవటం వల్ల ఆరోగ్యం పాడవుతుంది.

పోషక విలువలు అధికంగా ఉండి, క్యాలరీలను కలిగి ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలి. రోజు తీసుకునే దాని కన్నా 500 నుండి 1000 కేలరీలు గల ఆహార పదార్థాలను అదనంగా తీసుకోవటం వల్ల ఆరోగ్యకర బరువు పెరుగుతుంది. మీరు తీసుకునే ఆహార పదార్థాలు ఆరోగ్యకర కొవ్వు, నాణ్యత గల ప్రోటీన్‌లను కలిగి ఉండాలి.

*** పాల ఉత్పతులు:** బరువు పెరగటానికి అందుబాటులో ఉన్న ఆరోగ్యకర ఆహార పదార్థాలు పాలు. పాల నుండి ప్రోటీన్, కాల్షియంలను పొందవచ్చు. చీస్, పెరుగు వంటి పాల ఉత్పత్తులు ఆరోగ్యకర శరీర బరువును పెంచుతాయి.

*** నట్స్:** ఒక పిడికెడు నట్స్ నుండి కొన్ని వందల ఆరోగ్యకరమైన క్యాలరీలను పొందుతారు. ప్రోటీన్, విటమిన్ ఇ, ఫైబర్‌లను అధిక మొత్తంలో కలిగి వుంటాయి. వీటిని సలాడ్‌లతో, భోజనంలో లేదా స్నాక్స్‌గా కూడా తినవచ్చు. పీ నట్ బటర్ కూడా అధిక మొత్తంలో కేలోరీలను కలిగి ఉంటుంది. సలాడ్, సాండ్విచ్, టోస్ట్ వంటి వాటితో కలిపి తీసుకుంటే మంచిది.

*** డ్రై ఫ్రూట్స్:** డ్రై ఫ్రూట్స్ లను నట్స్ తో కలిపి తీసుకోవటం వల్ల బ్రేక్‌ఫాస్ట్‌లో మంచి పోషకాలను పొందినవారవుతారు. సగం కప్పు నట్స్ 200 కేలోరీలతో పాటూ విటమిన్, మినరల్, ఫైబర్ లను కలిగి ఉంటాయి. వీటిని సాయంత్రపు సమయంలో స్నాక్స్‌గా తీసుకోవచ్చు.

*** ఆరోగ్యకర కొవ్వు పదార్థాలు:** ఆలివ్ ఆయిల్, సోయా నూనె, ఆవాల నూనె, కొబ్బరి నూనె లలో కొవ్వు పదార్థాలను కలిగి ఉండే ఆహార పదార్థాలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఇవి గుండెకు ఆరోగ్యకరం, ఒక చెంచా నూనెలో 45 కేలోరీలను కలిగి ఉంటాయి. హోల్ వీట్ బ్రెడ్‌లను వీటిలో ముంచుకొని తినవచ్చు లేదా సలాడ్‌లలో కలుపుకొని తినటం వల్ల అదనపు క్యాలోరీలను పొందినవారవుతారు.

*** పండ్ల రసాలు:** ఆహారం తీసుకోవటం కన్నా ద్రావణాల ద్వారా అదనపు క్యాలరీల ద్వారా అదనపు కొవ్వు పదార్థాలను పొందవచ్చు. తాజా స్వచ్ఛమైన పండ్ల రసాలను తాగటం వల్ల ఆరోగ్యకర బరువు పెరుగుతారు. ఒక గ్లాసు పండ్ల రసం 100 కంటే అధిక క్యాలరీలను కలిగి ఉంటుంది. వీటి నుండి శరీరానికి మంచి విటమిన్‌లు అందటమే కాకుండా, అధిక మొత్తంలో క్యాలరీలు కూడా అందుతాయి.

ప్రశాంతమైన నిద్రకు జాజికాయ



జాజికాయ అనేది చాలా మందికి తెలిసినదే. సాధారణంగా వంటలలో రుచి కోసం వాడే పదార్థంగా చెప్పవచ్చు. కారపు రుచిని కలిగి ఉండే ఈ రకమైన సుగంధద్రవ్యం వివిధ రకాల వైద్య గుణాలను కలిగి ఉండటమే కాకుండా, చాలా రకాల వ్యాధులను తగ్గిస్తుంది. అంతేకాకుండా జాజికాయ వాడకం ద్వారా ప్రశాంతమైన నిద్రను పొందవచ్చు. వాటి గురించిన వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.

జాజికాయ, తేనె: ఒక చెంచా తేనె, చిటికెడు జాజికాయ పొడిని కలపండి. ఈ మిశ్రమాన్ని పడుకునే 15 నిమిషాల ముందు తాగి పడుకోండి.

జాజికాయ టీ : ఇన్సోమ్నియా వ్యాధి నుండి ఉపశమనం కలిగించే, సాధారణంగా వాడే ఇంట్లో ఉండే ఔషధం జాజికాయ. ఒక జాజికాయను తీసుకొని దంచి, ఒక గిన్నె నీటిలో కలిపి వేడి చేయండి. నీరు వేడెక్కిన తరువాత, స్టవ్ పై నుండి గిన్నెను తొలగించి, చల్లారే వరకు వేచి ఉండండి. భోజనం తరువాత ఈ నీటిని తాగటం వల్ల రాత్రి సమయంలో మంచి నిద్ర మీ సొంతం అవుతుంది.

ప్రయాణికులకు నాణ్యమైన ఆహార పదార్థాలు : రైల్వే జిఎం



మన తెలంగాణ/హైదరాబాద్: రైళ్లు, రైల్వే స్టేషన్లు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతపై తగిన దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందే విధంగా చూడాలని, స్టాల్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆయన సూచించారు. రైల్ నిలయంలో మంగళవారం జరిగిన వివిధ విభాగాల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో జనరల్ మేనేజర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన మేరకు కాపలా లేని రైల్వే లెవెల్ క్రాసింగ్‌లను తొలగించేందుకు నిర్మించతలపెట్టిన ఆర్‌ఓబి, ఆర్‌యుబి, ఎల్‌హెచ్‌ఎస్ పనులను ఇంజినీరింగ్, ఆపరేషన్స్ విభాగాల అధికారులు సమన్వయంతో మొదలు పెట్టాలని ఆయన ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు రైలు పట్టాల పునరుద్దరణ పనులు, నిర్వహణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిఎం సూచించారు. జోన్ పరిధిలో రైళ్ళ సమయ పాలనపై జిఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని దానిని మరింత మెరుగుపర్చాలని కోరారు. సమావేశంలో ఎస్‌సిఆర్ అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

మన తెలంగాణ/అలంపూర్(ఉండవెల్లి): గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడలో రాణించి గ్రామ ఖ్యాతిని చాటాలని సిపిఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్యర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా జోగులాంబ జిల్లా అలంపూర్‌లో మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. యువత సామాజిక బాధ్యతలను గుర్తించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కపిల్ అధ్యక్షతన జరిగిన ఈ క్రీడా పోటీల కార్యక్రమంలో స్వామి రామానందతీర్థ డైరెక్టర్ కిశోర్‌రెడ్డి, అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి పుష్పలత, రాము తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్‌తో గుర్నాథరెడ్డి భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎంఎల్‌ఎ గుర్నాథరెడ్డి ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్‌తో మంగళవారం భేటీ అయ్యారు. కోసిగి మండలకేంద్రంలో బస్ డిపోను నిర్మించాలని, ఒక పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, కోసిగి నియోజకవర్గంలో ఒక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటికి సానుకూలంగా స్పందించిన సిఎం కెసిఆర్ వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రాయపల్లె గ్రామానికి చెందిన యువరైతు అప్పుల బాధతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. దాట్ల నరేశ్(25) అనే రైతు తనకున్న 30 గుంటల భూమితో పాటు అదనంగా మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో పంటల కోసం తెచ్చిన పెట్టుబడి రాకపోయే సరికి అప్పులు ఎలా తీర్చాలో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం పరకాల ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నరేశ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పర్యాటకులపై దాడి

(మొదటిపేజీ తరువాయి)


మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.... హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన తాము ఈనెల 14వ తేదిన పాపికొండల విహార యాత్ర, కొల్లూరులో రాత్రి బస చేసే విధంగా భద్రాచలంలో టిక్కెట్లు కొనుగోలు చేశామని బాధితులు వెల్లడించారు. 14వ తేదిన రాత్రి కొల్లూరులో బస చేసిన తర్వాత 15 నాడు భోజన విషయంలో గొడవ చోటు చేసుకుంది. సరైన భోజనాన్ని అందించకపోవడంతో కొందరు ఇదేమి భోజనం అని ప్రశ్నించారని, భోజనాలకు డబ్బులు కట్టినప్పుడు ఇలాగేనా పెట్టేది అంటూ నిలదీశామని, దీంతో కోపోద్రోక్తులైన నిర్వాహకుల అనుచరులు పర్యాటకులతో వాగ్వాదానికి దిగారని తెలిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటలు పెరగడంతో నిర్వాహకుల మనుష్యులుదాడికి పాల్పడ్డారని, కాగా భోజనం సరిగా లేదని అన్నది ఒకరు అయితే దాడి తమపై చేశారని బాధితులు బోరుమంటూ విలపించారు. భోజనం బాగో లేదని అడిగింది ఒకరైతే తమపైదాడి చేశారని ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ డెంటల్ డాక్టర్‌తో పాటు, హైదరాబాద్ నగ రానికి చెందిన సంతోష్, పుష్పమ్మలు చెబుతున్నారు. సుమారు 20 నుండి 30 మంది వరకు ఉన్న నిర్వాహకుల మనుష్యులు చేతికందిన కర్రలను తీసుకుని దొరికినవారిని దొరికినట్లు గొడ్లను బాధినట్లు బాదారని, తాముకాదనిచెబుతున్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోలేదని అంటున్నారు. తమపైదాడి జరుగుతుంటే అడ్డుతగిలిన మహిళలను సైతం మద్యం మత్తులో విచక్షణా రహితంగా కొట్టారని, పిల్లలను సైతం నెట్టేశారని తెలిపారు. అక్క చోటుచేసుకున్న పెనుగులాటలో మెడల్లో ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కున్నారని, జేబుల్లో ఉన్న నగదును గుంజేసుకున్నారని తెలిపారు. పెద్దపెద్దకర్రలతో వీపులపై, తలలపై బలంగా బాదడంతో బొడిపెలు కట్టడంతో పాటు, వీపులు ఎర్రగా కమిలిపోయాయని తగిలిన దెబ్బలను మీడియాకు చూపారు. తమ బిడ్డలను కొట్టకండీ అంటూ కాళ్లావేళ్లాపడ్డా కనీసం కనికరం లేకుండా విచక్షణా రహితంగా చితకబాదారని, ఇక్కడే మిమ్మల్నందరినీ చెంపేస్తాం.... ఏం చేస్తారో చూస్తాం... ఎవరు అడ్డొస్తారో చూద్దాం... అంటూ బెదించారని తెలిపారు. బతుకు జీవుడా అంటూ పిల్లలను, మహిళలను గట్టిగా పట్టుకుని పరుపరుగున లాంచీ వద్దకు చేరుకుని అక్క డ్నుంచి వచ్చేసినట్లు బాధితులు వివరించారు.

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు : పుష్పమ్మ , హైదరాబాద్



తమ కుమారుడిని అకారణంగా కొడుతుంటే తాను అడ్డుపోయానని, వదిలేయండి అంటూ ప్రాదేయపడ్డాను, కాళ్లా వేళ్లా మొక్కినా కసాయి వారిలా మారి విచక్షణా రహితంగా దాడి చేశారని, హైదరాబాద్ ప్రాంతం నుండి వచ్చాం. ఈ అడవిలో, కనీసం సమాచారం అందించలేని ప్రదేశంలో తమ బిడ్డలకు ఏమైనా జరిగితే మాకు దిక్కెవ్వరూ వాళ్ల బిడ్డలకు దిక్కెవ్వరంటూ కంటతడిపెట్టుకున్నారు.

అకారణంగా దాడి చేశారు: డా. కిషోర్ (డెన్టిస్ట్), ఖమ్మం



భోజనం సరిగాలేదని ప్రశ్నించింది వేరే వారు... కానీ దాడి తమపై చేశారని, మా తప్పేమిలేదని బతిమాలాడామని.. ఏది పెడితే అదే తింటాం... పె ట్టకున్నా పర్వాలేదని చెప్పాం. అయినా తమకే ఎదురు తిరుగుతార్రా... అంటూ కర్రలతో తలపై కొట్టారని వీపుపై బలంగా బాదారని, ఆదెబ్బల తాలుకూ అచ్చులు ఇంకా శరీరంపై కనిపిస్తూనే ఉన్నాయని తెలిపారు.

కర్రలతో చావ బాదారు: సంతోష్, హైదరాబాద్



చేతికందిన కర్రలను పట్టుకుని తమపైకి ఉరుకులు పెట్టారని, వద్దూ వదిలేయండీ అంటూ వేడుకున్నా . చిన్న పిల్లలు, మహిళలు భయపడి ఏడుస్తు న్నా వారు తమను కసితీరా చావబాదారని తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు

- డబుల్ బెడ్‌రూం నిర్మాణాల పేరిట ఇసుక రవాణాకు అనుమతులు
- సిద్దిపేట జిల్లా అక్కెనపల్లి పెద్దవాగు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత





మన తెలంగాణ/నంగునూరు: డబుల్‌బెడ్ రూం నిర్మాణాల పేరిట సిద్దిపేట జిల్లా అక్కెనపల్లి పెద్ద వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న లారీలను గ్రామస్థులు, ఆయకట్టుదారులు అడ్డుకోవడంతో మంగళవారం రోజున ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని పాలమాకుల, కొనాయిపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం ఇసుకను తరలించేందుకు ఘనపూర్ చెక్‌డ్యాం సమీపంలో ఇటాచీ, టిప్పర్లు చేరుకున్నాయి. దీంతో సంఘటన ప్రదేశానికి వాగు పరిసర ప్రాంతాల ఆయకట్టుదారులు, రైతులు చేరుకొని ఇటాచీ, టిప్పర్లపై దాడి చేసే క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. డబుల్‌బెడ్ రూం నిర్మాణాల పేరిట ఇసుకను తరలించేందుకు పర్మిషన్ ఉమదని టిప్పర్ యజమానులు రైతులకు చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటుతాయని, అనుమతి ఎవరిచ్చారని టిప్పర్ యజమానులను రైతులు ప్రశ్నించారు. ఒకరినొకరు దాడి చేసుకునే క్రమంలో అక్కడి ఉద్రిక్తత విషయాన్ని తహసీల్దార్ విజయ భాస్కర్‌జీకి ఫోన్‌లో వివరించగా, వెంటనే విఆర్‌ఓ సర్వర్, విఆర్‌ఎలు సంఘటనా స్థలానికి చేరుకొని అభివృద్ధి పనుల పేరిట అనుమతి ఇవ్వడం జరిగిందని, 5 టిప్పర్లు తీసుకుపోగానే బంద్ చేస్తామని రైతులకు నచ్చజేప్పారు. ఈ ప్రదేశం నుంచి ఇసుక రవాణాకు అనుమతించేది లేదని నంగునూరు సర్పంచ్ దేవులపల్లి యాదగిరి సంఘటనా స్థలానికి చేరుకొని ఇటాచీని, టిప్పర్లను వెనక్కి పంపడంతో సమస్య సద్దుమణిగింది.

అధిక కమీషన్లపై కొరడా

- ఆరుగురు వ్యాపారుల లైసెన్సులు రద్దు

మన తెలంగాణ/ ఖమ్మం వ్యవసాయం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించిన ఆరుగురు కమీషన్ వ్యాపారుల లైసెన్సులను రద్దు చేసి మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి జెసి వినయ్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల జరిగిన దాడుల్లో రైతుల వద్ద నుంచి అధిక కమిషన్లు వసూలు చేస్తున్నారని నిర్ధారణ కావడంతో (బి.బాప్ సింగ్) చరిత్ లోడ్ కమిషన్ మర్చంట్, ఎం.కొల్లయ్య ముత్యాల ఉదయ్‌కృష్ణా కమీషన్ మర్చంట్, డి.నాగరాజు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కమీషన్ మర్చంట్, దిరిశాల వెంకటేశ్వరరావు వెంకటసాయి కృష్ణ కమిషన్ మర్చంట్, బి.రామ్మూర్తి బండి రామ్మూర్తి కమీషన్ మర్చంట్, రమా పద్మ నయనకు మారి మణికంఠ కమీషన్ మర్చంట్‌ల లైసెన్సులను రద్దు చేశారు. అధిక కమిషన్లపై మార్కెటింగ్ శాఖ కొరడా ఝూళిపించడంతో కమీషన్ వ్యాపారుల ఆందోళన మొదలైంది. మరికొంత మంది లైసెన్సులు కూడా రద్దయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

భవన అనుమతుల జాప్యానికి చెక్

- 10 నుంచి 15 రోజుల్లో అనుమతులు
- సులభతర పద్ధతులపై మున్సిపల్ శాఖ కసరత్తు

మన తెలంగాణ/హైదరాబాద్: భవన నిర్మాణ అనుమతుల జాప్యానికి మున్సిపల్ శాఖ చెక్ పెట్టనుంది. పది నుంచి15 రోజుల్లోపు అనుమతులు ఇచ్చేలా నిబంధనల రూపకల్పన చేయనున్నారు. టిఎస్‌–ఐపాస్ తరహాలో నిర్దేశించిన కాలపరిమితిలోపు అనుమతి ఇవ్వకపోతే అనుమతి ఇచ్చినట్టుగానే భావించేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనుంది. వారం నుంచి పది రోజుల్లోపు అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు ఆదేశించినట్టు తెలిసింది. అయితే వారం రోజుల్లో అనుమతులు ఇవ్వడం కొంత కష్ట సాధ్యమని, దీనిని 15 రోజులకు నిర్ణయిస్తే బాగుంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇదే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నాయి. అలాగే అనుమతుల ఆలస్యానికి కారణమైన సదరు అధికారులకు జరిమానా కూడా విధించే విధి విధానాలపై మున్సిపల్ శాఖ కసరత్తు మొదలు పెట్టింది.

30రోజుల అనుమతిపై ఫిర్యాదులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల పరిధిలో ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం ద్వారానే భవన నిర్మాణ అనుమతులను మంజూరు చేస్తున్నారు. దరఖాస్తు పెట్టుకున్న 30 రోజుల్లోపు అనుమతులు ఇవ్వాలని ఒక కాలపరిమితిని నిర్దేశించుకున్నప్పటికీ ఆ కాలపరిమితిలోపు అనుమతులు లభించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. అనేక మున్సిపాలిటీలలో పలు సాంకేతిక కారణాలు, పలు ధ్రువీకరణ పత్రాలలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతూ భవన నిర్మాణా అనుమతుల దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు మున్సిపల్ శాఖ దృష్టికి వచ్చింది. ఏదో ఒక పత్రం లేదంటూ యజమానులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, అధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భవన అనుమతుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని మంత్రి కెటిఆర్ నిర్ణయించారు. ఇదే విషయమై ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కెటిఆర్ అధికారులతో చర్చించి, 30 రోజులు కాకుండా కేవలం వారం నుంచి పది రోజుల గడువులోపే అనుమతులు లభించేలా నిబంధలను విధించాలని ఆదేశించినట్లు తెలిసింది.

సిబ్బందితోనే ఇబ్బంది..

ప్రస్తుతం 30రోజుల గడువులోపు భవన నిర్మాణ అనుమతులు లభించడం లేదంటే ఆ గడువును మరింత తగ్గించి కేవలం 10 రోజుల లోపే కుదించడం, పైగా జాప్యానికి కారణమైన అధికారిపై జరిమానా విధిస్తున్న నేపథ్యంలో గడవు కాలాన్ని పెంచాలని కొందరు మున్సిపల్ కమిషనర్లు అభిప్రాయపడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటే కేవలం రెండున్నర రోజుల్లోనే అనుమతులను మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని, కాని అనేక మున్సిపాలిటీల్లో ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో దరఖాస్తుకు సంబంధించి కొన్ని పత్రాలను సులభతరం చేయడంతో పాటు 15 రోజులకు నిర్ణయిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమతుల విషయమై అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకుని అనుమతుల గడువు, జరిమానాలకు సంబంధించి విధానాలను ఖరారు చేయనున్నారు.

నూతనాధ్యాయం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయాలు ఇకపైన రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూసుకుంటాయని, ప్రతి మండల కార్యాలయంలో ఇకపైన రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, మ్యుటేషన్‌కు ఇప్పుడు పడుతున్నంత ఎక్కువ సమయం ఇకపైన పట్టదని అన్నారు. కొత్తగా సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టే 443 మంది తహసీల్దార్‌లకు, ప్రస్తుతం పని చేస్తున్న 141 మంది సబ్ రిజిస్ట్రార్‌లకు కొత్త విధానంపైనా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అప్లికేషన్ వినియోగంపైనా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్ బ్యాంకింగ్ నెట్‌వర్క్ విధానాన్ని ప్రవేశపెడుతున్నందువల్ల కొనుగోలుదారులు, అమ్మకందారులు పాస్ బుక్‌లలో తక్షణమే మార్పులు చేర్పులు జరుగుతాయని, ఇందుకోసం ఎక్కువ సామర్థ్యం కలిగిన కంప్యూటర్ సర్వర్‌లను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ మార్పులన్నీ వెంటవెంటనే ‘ధరణి’ వెబ్ సైట్‌లో నమోదవుతాయని, పాస్‌బుక్‌లు కొరియర్‌లో వారి ఇండ్లకు చేరుతాయని తెలిపారు. ప్రస్తుతం భూ పహాణీలలో వినియోగంలో ఉన్న మరాఠీ పదాల స్థానంలో సరళమైన తెలుగు పదాలు వస్తాయని తెలిపారు. ఇప్పటివరకు ప్లెయిన్, షెడ్యూల్డు ఏరియాల్లో వచ్చిన సాదా బైనామా దరఖాస్తుల పనుల్ని పూర్తి చేయాలని సూచించారు. ఆర్వోఎఫ్ఆర్ ప్రతిపాదనలను జిల్లాల వారీగా పంపిస్తే ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

అసైన్డ్ భూములకు రెవిన్యూ మార్గదర్శకాలు.. భూ వివాదాలు చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, ఇకపైన ఆ చిక్కులన్నీ తొలగిపోవాలని, ముఖ్యంగా అసైన్డ్ భూముల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కెసిఆర్ వ్యాఖ్యానించారు. గత చాలా కాలంగా అసైన్డ్ భూముల విషయంలో అశాస్త్రీయ విధానాలు, అవకతవకలు కొనసాగుతున్నాయని, చాలామంది నుంచి ధనవంతులు కూడా కొనుగోలు చేశారని, ఇకపైన ఏం చేయాలో రెవిన్యూశాఖ స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలని సూచించారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఆయా జిల్లాల్లో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని, మానవతాకోణంతో ఆలోచించాలని సూచించారు.

భూరికార్డుల ప్రక్షాళన భేష్ : భూరికార్డుల ప్రక్షాళన అనే నిర్ణయం సాహసోపేతమైనదే కాకుండా దేశం మొత్తానికి ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్యానించిన సిఎం కెసిఆర్ రెవిన్యూ శాఖ అధికారులను, సిబ్బందిని ప్రశంసించారు. ‘మనం చాలా పనులు చేస్తూ ఉంటాం. కానీ ఇంత గొప్పగా చేయలేం. చాలా పనుల్ని వాయిదా వేస్తూ ఉంటాం. కానీ ఈ పనిని మాత్రం చాలా సాహసంతో చేశాం. దేశమంతా మనల్ని అభినందిస్తూ ఉంది. కొత్త రాష్ట్రమైనా దేశానికి ఆదర్శంగా నిలిచాం. చాలా మందికి ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలి’’ అని సిఎం వ్యాఖ్యానించారు. అసాధారణమైన పనులు చేసే శక్తియుక్తులు, దేన్నయినా సాధించే పట్టుదల తెలంగాణకు ఉందని, ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల అమలు విజయాలను సిఎం వివరించారు. సమగ్ర కుటుంబ సర్వేను ఒక్క రోజులోనే చేయగలిగామని, విద్యుత్ సమస్యను అధిగమించి వ్యవసాయానికి 24 గంటలు ఇవ్వగలుగుతున్నామని అన్నారు. అతి తక్కువ కాలంలోనే పరిష్కారం కనుగొన్నామని తెలిపారు. భూరికార్డుల ప్రక్షాళనను వంద రోజుల్లోనే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వమే తమ దగ్గరకు వచ్చి లంచాలకు ఆస్కారం లేకుండా భూమికి రక్షణ కల్పించిందని ప్రజలే సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

రైతుకు పెట్టుబడి ఇస్తున్న రాష్ట్రం తెలంగాణే: రైతుల కష్టాలను తొలగించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కల్తీ ఎరువులు, కల్తీ పురుగుమందుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోందని సిఎం వ్యాఖ్యానించారు. రైతులకు పంట పెట్టుబడి కింద ఎనిమిది వేల రూపాయలను (ఎకరానికి) ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, స్వయంగా ప్రధానమంత్రి మోడీ దీన్ని ప్రశంసించారని కెసిఆర్ గుర్తుచేశారు. రైతులకు పంట మద్దతు ధర విషయంలో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేవామని, ప్రస్తుతానికి గ్రామ, మండల స్థాయిలో ఏర్పాటయ్యాయని అన్నారు. రైతులు సంఘటితంగా లేనందువల్ల వారు పండించిన పంట మార్కెట్‌కు తేవడానికి, విక్రయించుకోడానికి ఈ సమితులు ఉపయోగపడుతున్నాయని, త్వరలో పంటల కాలనీ (క్రాప్ కాలనీ) విధానాన్ని తీసుకురావడానికి దోహదపడతాయని అన్నారు. ఎక్కువ ఉత్పత్తి సాధించే పంటలపై దృష్టి పెట్టడం మాత్రమే కాకుండా పంట మార్కెట్‌కు రావడానికి ముందే లైసెన్సు కలిగిన కొనుగోలుదారు, కమిషన్ ఏజెంట్లతో సమన్వయ సమితి మాట్లాడి ధర నిర్ణయిస్తుందని తెలిపారు. ఒకేసారి రైతులంతా మార్కెట్‌కు రానవసరం లేకుండా వంతులవారీగా వచ్చే విధానానికి ఈ సమితి కృషిచేసి సకాలంలో డబ్బు రైతు చేతికందే ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 2600 మంది ఏఇఓలను నియమించామని, మండలస్థాయి ఏఇఓలకు అగ్రొనామిస్టులుగా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీ, మంత్రులు ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, నాయిని నర్సింహారెడ్డి, జోగురామన్న, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మారావు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడడి, ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్, ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎంపి కేశవ రావు తదితరులు కూడా పాల్గొన్నారు.

19, 20న సాంస్కృతిక విభాగం అంతర్జాతీయ సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: ‘వివిధ కాలాల్లో తెలంగాణ : ప్రాచీన, మధ్య యుగాల ధృక్కోణం’ అనే అంశంపై ఈనెల 19, 20వ తేదీలలో తెలంగాణ సాంస్కృతిక విభాగం రెండవ అంతర్జాతీయ సదస్సును నిర్వహించనుంది. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సదస్సును నిర్వహించనున్నారు. మానవుడు ఆవాసాలు ఏర్పరచుకున్న అత్యంత ప్రాచీన ప్రాంతాలలో తెలంగాణ ఒకటి. మానవ చరిత్రకు సంబంధించిన అనేక ప్రాచీన ఆధారాలు తెలంగాణలో లభ్యమవుతున్నాయి. భారత ఉప ఖండంలో వ్యూహాత్మక ప్రదేశంలో నెలకొన్న ఈ ప్రాంతం వివిధ సంస్కృతులకు పరస్పర మార్పిడికి కేంద్రంగా భాసిల్లుతున్నది. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినీలు, చాళుఖ్యులు, కాకతీయుల, అసఫ్‌జాహీ తదితరులు ఏలిన ఈ ప్రాంతంలో కళలు, వాస్తుశిల్ప కళ రంగంలో అభివృద్ధి చెందింది.

అగ్ని ప్రమాదం కేసులో పబ్ యజమాని లొంగుబాటు

ముంబయి: కమలా మిల్స్ కాంపౌండ్ అగ్ని ప్రమాదం కేసులో అరెస్ట్ కాకుండా తప్పించుకుని తిరుగుతున్న మోజో బిస్ట్రో పబ్ యజమాని యుగ్‌తుల్లి పోలీసుల ఎదుట లొంగి పోయారు. మంగళవారం ఉదయం ఎన్ఎం జోషి మార్గ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడంతో ఆయనను అరెస్ట్ చేశామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ జయకుమార్ తెలిపారు. యుగ్‌తుల్లి అరెస్ట్‌తో మోజో బిస్ట్రో పబ్ యాజమానులందిరినీ అరెస్ట్ చేశామని మరో అధికారి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో తన భార్యతో సహా కనిపించిన యుగ్‌తుల్లి, పోలీసులు ఆయనను పట్టుకునే లోపే అదృశ్యమయ్యారు. గత ఏడాది డిసెంబర్ 29న కమలా మిల్స్ కాంపౌండ్ అగ్ని ప్రమాదంలో 14 మంది మృతి చెందారు. నాగపూర్‌కు చెందిన వ్యాపార వేత్త తుల్లి, ఆయన వ్యాపార భాగస్వామి, నాగపూర్ మాజీ పోలీస్ కమిషనర్ కెకె పాఠక్ కొడుకు యుగ్ పాఠక్‌లపై కేసు నమోదైంది.

అయినా.. అదే పద్ధతి

(మొదటిపేజీ తరువాయి)

చోటివ్వలేదు. సిజెఐ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. అయితే, సిజెఐపై ఆరోపణలు సంధించిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్‌లు ఇందులో లేరు. కాగా, అధికారిక సమాచారం మేరకు ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎకె సిక్రి, జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌లు ఉన్నారు. ఈనెల 17 నుంచి ఈ ధర్మాసనం తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. ఆధార్ చట్టానికి రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన కేసుతో పాటు పలు ముఖ్యమైన కేసులను ఈ ధర్మాసనం విచారించనుంది.

తిరుగుబాటు జడ్జీలతో సిజెఐ భేటీ!

సుప్రీంకోర్టులో పాల నా వ్యవహారాలు గాడి తప్పాయని ఆరోపిస్తూ సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందు మాట్లాడిన నేపథ్యంలో వివాదా న్ని పరిష్కరించే దిశగా ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) దీపక్ మిశ్రా మంగళవారం నాడు వారితో భేటీ అయ్యారు. నలుగురు అసంతృప్త సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వీరితో పాటు పలువురు న్యాయమూర్తులు కూ డా ఇందులో పాల్గొన్నారు. కోర్టు కార్యకలాపాల ప్రారంభానికి 15 నిమిషాల ముందు వారితో సమావేశమయ్యారు. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలతో సిజెఐ చర్చించారు. పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. భేటీ అనంతరం ఎవరికి వారు తమ విధులకు హాజరయ్యారు. కాగా, ఈ నలుగురు న్యాయమూర్తులతో సిజెఐ మరోసారి భేటీ అయ్యే అవకాశముంది. ఈ వివాదం ముగిసిందని సోమవారం వెల్లడించిన అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ మంగళవారం ఉదయం వివాదం ఇంకా ముగియనట్లే కనిపిస్తోందని, మరో రెండు రోజుల్లో సద్దుమణిగే అవకాశముందని వెల్లడించారు. ఈ వివాదం ఈ వారాంతానికి ముగియనుందని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) ప్రెసిడెంట్ వికాస్ సింగ్ అన్నారు. కాగా, ఈ వివాదం ముగిసిందని, ఇప్పుడు ఏ సమస్య లేదని వేణుగోపాల్‌తో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా సోమవారం వ్యాఖ్యానించిన విషయం విదితమే. ‘ఇది అంతర్గత వ్యవహారం. పరిష్కారమైంది.

మేము దాదాపు 15 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో భేటీ అ య్యాం. ఈ వివాదాన్ని సాకుగా చూపించి రాజకీయ పార్టీ లు లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్నాయి. మీడియా సమావేశం నిర్వహించిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు యథావిధిగా కోర్టుకు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు’ అని పేర్కొన్నారు. ‘మీడియా ఎదుటకు వచ్చి మాట్లాడిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వారందరూ చాలా నిజాయతీ గలవారు. ఈ వివాదాన్ని రాజకీయ పార్టీలు తమ సొంత లా భం కోసం వాడుకునేందుకు ప్రయత్నించడాన్ని మేం ఎం తమాత్రం అంగీకరించబోం. సుప్రీంకోర్టులోని అన్ని కార్యక్రమాలు యథావిధిగానే జరుగుతున్నాయి’ అని ఆయన తెలిపారు.

21న మొక్కల’ పెంపకంపై అవగాహన

మన తెలంగాణ/హైదరాబాద్: కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెన్, ఔషధ మొక్కల పెంపకంపై రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హోటల్ చట్నీస్ హాల్‌లో ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సులో ప్రముఖ ఉద్యానశాస్త్ర వేత్త డా మొవ్వా రామారావు, రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామ్‌రెడ్డితో పాటు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు,ఇంటి పంటలో అనుభవం ఉన్న వారు పాల్గొంటారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఖైరతాబాద్‌లోని తమ ఫౌండేషన్‌ను, లేదా 9492075944, 9492964797 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



ప్రజలతో కలిసి వెళితేనే పోలీసులపై నమ్మకం : డిజిపి

మన తెలంగాణ/మహబూబ్‌నగర్: పోలీసులు ప్రజల్లో కలిసిపోయి వారికి న్యాయం చేసినప్పుడే పోలీసులపై నమ్మకం ఏర్పడుతుందని డిజిపి మహేందర్‌రెడ్డి అన్నారు. డిజిపిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో డిజిపి మాట్లాడుతూ 2018లో విప్లవాత్మక మార్పులతో పోలీసు విభాగం నూతన టెక్నాలజీతో రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడుతామన్నారు. శాంతియుతికి నిలయంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు దిశా నిర్దేశం చేసేందుకు తాను వచ్చినట్లు తెలిపారు. ప్రజలను యూనిఫామ్ లేని పోలీసులుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రజలు మెచ్చే విధంగా పోలీసు వ్యవస్థను తయారు చే యడమే లక్ష్యమన్నారు. నేరం చేస్తే వంద శాతం దొరుకుతామనే భయం ప్రతి ఒక్క నేరస్తునికి కల గాలన్నారు. పని పద్ధతిలో పోలీసులు నూతన టెక్నాలజీని వాడుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ దేవాలయంలా ప్రజలు భావించే విధంగా పోలీసు లపై నమ్మకం ఏర్పడాలన్నారు.

కాకతీయుల మాదిరి కెసిఆర్‌పాలన

• **స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి**



మన తెలంగాణ/నల్లబెల్లి: కాకతీయుల పాలన విధానాన్నే సిఎం కెసిఆర్ ఆచరిస్తున్నట్లు స్పీకర్ మధుసూధనాచారి తెలిపారు. మంగళవారం వరంగ ల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకాలపెల్లి, నందిగామ, రేలకుంట, రంగాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన పల్లె ప్రగతి కార్య క్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సివిల్ సప్లై చైర్మన్‌తో కలిసి స్పీక ర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయుల పాలనను దృష్టిలో పెట్టుకుని సిఎం కెసిఆర్ ప్రజలకు మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ , హరితహారం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి వంటి నాయకుడు లభించడం ప్రజల అదృష్టమన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల ఐక్యతాభావంతోనే ప్రతీ పల్లె అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బానోతు సారంగపాణి, వైస్ ఎంపిపి పాలెపు రాజేశ్వర్‌రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు మాయంపై విచారణ

మన తెలంగాణ/చిలప్‌చెడ్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొల్ల కురుమలకు పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెల యూనిట్లను గ్రామానికి తీసుకు రాకుండానే లబ్ధిదారులు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై మంగళవారం నాడు అధికారులు మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండల పరిధిలో గల చిట్కూల్ గ్రామాన్ని సందర్శించారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందించిన గొర్రెలపై ఆరా తీశారు. అధికారులకు గ్రామంలో ఒక్క సబ్సిడీ గొర్రెకూడా కనిపించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేయగా, లబ్ధిదారులు మేతకు వెళ్లాయని బదులిచ్చారు. అసలు గ్రామంలో పంపిణీ చేసిన 50 యూనిట్లలో మొత్తం యూనిట్లను సర్పంచ్ భర్తతో సహా అందరూ సబ్సిడీ గొర్రెలను తీసుకురాకుండానే అక్కడికక్కడే అమ్ముకున్నారని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీ గొర్రెలు అమ్ముకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తిరిగి బుధవారం నాడు ఉదయాన్నే గ్రామాన్ని పర్యవేక్షిస్తామని సబ్సిడీ గొర్రెల యూనిట్లను తమకు చూపాలని తిరిగి వెళ్లారు.

ఐదు ఇళ్లలో వరుస దొంగతనాలు



మన తెలంగాణ/హైదరాబాద్/రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగ రోజు హైదరాబాద్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటికి తాళం ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి, ఒక్కరోజులోనే ఐదు వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి మరీ సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల నగదు, ఓ కారు, ల్యాప్‌టాప్‌తో పాటు ఒక సెల్ ఫోన్‌తో ఉడాయించారు. దర్జాగా దొంగతనాలకు పాల్పడిన ముఠా ఆనవాళ్లు సిసి ఫుటేజీల్లో నమోదు కావడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ సాయిబాబా కాలనీలో జరిగిన ఈ వరుస చోరీల సంఘటన వివరాలను డిఐ నాగయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలీస్‌శాఖలో ఎస్‌ఐగా పనిచేసి పదవీ విరమణ చేసిన నారాయణరావు కుటుంబం సాయిబాబా కాలనీలో నివాసం ఉంటుంది. ఆ పక్కనే గుడిమల్కాపూర్ మండిలో మోండదార్ అయిన వెంకట్‌రెడ్డి ఇళ్లు, వీరికి సమీపంలోని విజయవాడలో ఎసిబి విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జివి.రమణ, అదే ప్రాంతంలో ఉన్న రామ్‌కుమార్ ఇళ్లలో ఒకదాని తరువాత ఒకటిగా వరుసగా తాళాలు పగుల గొట్టిన దుండగులు దొరికినంత దోచుకున్నారు. ఈ క్రమంలో నారాయణరావు ఇంట్లో సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదుతో పాటు స్విఫ్ట్ కారును తస్కరించారు. కానిస్టేబుల్ రమణ ఇంట్లో సుమారు 10 తులాల బంగారం, రూ.80 వేల వరకు నగదు, ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ తస్కరించారు. రామ్‌కుమార్ ఇళ్లు అద్దెకు ఇవ్వడానికి ఖాళీ చేయించి తాళం వేసి ఉండడంతో పాటు రామ్‌కుమార్ ఇంట్లో ఏమీ లభించలేదని పోలీసులు తెలిపారు. అక్కడి నుంచి దొంగలు సూర్యోదయ కాలనీలోని మధుసూదన్ ఇంటి తాళాలు పగుల గొట్టి 5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సినిమాకు వెళ్లి వచ్చి చూడగా పైన పేర్కొన్న బాధితుల ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. జరిగిన వరుస చోరీల వివరాలను నమోదు చేసుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన బోటు ప్రమాదం



మన తెలంగాణ/వెల్గటూర్: కరీంనగర్‌లోని కోటిలింగాల పుణ్యక్షేత్రం గోదావరి నదిలో తెలంగాణ టూరిజం శాఖ చెందిన బోటు ఇంజన్ మొరాయించడంతో నది మధ్యలోనే నిలిచిపోయింది. పండగ సెలవులు, సంక్రాంతి పర్వదినం కావడంతో బోటు షికారు కోసం వచ్చిన ప్రయాణికులు మరో బోటు సహాయంతో సురక్షితంగా ఒడ్డునకు చేరుకున్నారు. బోటులో దాదాపు 50మంది ప్రయాణికులున్నారు. నదిలో మత్స్యకారులు పరచిన వలలతో బోట్ క్లచ్ ప్లేట్లు చెడిపోయి బోటు ఆగిపోయినట్లు బోట్ డ్రైవర్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్త బోట్లను ఏర్పాటు చేసి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

భార్య, అత్తమామలపై కత్తితో దాడి

మన తెలంగాణ/చెన్నూర్: భార్య, అత్తమామలపై ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రకు చెందిన సుర్ల లక్ష్మణ్ అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, అత్త ఆచక్క , మామ గాండ్ల లక్ష్మణ్‌పై మంగళవారం కత్తులతో దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. బాధితులను వెంటనే స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన లక్ష్మణ్ అక్కడే ఉండడంతో గ్రామస్థులు అతడిని గొలుసులతో బంధించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గద్దెలపై గద్దలు!



• **సమ్మక్క, సారక్క జాతరకు కార్పొరేట్ సెగ**

• **మేడారంలో కనుగమరుగవుతున్న ఆచార వ్యవహారాలు**

• **ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజనం**



మన తెలంగాణ/మంగపేట: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పిలువబడుతున్న సమ్మక్క సారలమ్మల జాతర కార్పొరేట్ కళను సొంతం చేసుకుంటోంది. ఇంతకు అధికారులు చేయూతనందించడంతో ఏళ్లుగా వస్తున్న ఆచారం, సంప్రదాయం కనుమరుగవుతోంది. దీంతో గిరిజనంతో పాటు భక్తజనం ఆందోళన వ్యక్తం చేస్తోంది. మూడు దశాబ్దాల క్రితం మూడు దశాబ్దాల క్రితం ఆనవాయితీ, మట్టివాసనల పరిమళాలు, ఎడ్లబండ్ల గజ్జెల చప్పుళ్లు, కుటంబాలతో కలిసి వచ్చే తీరు తెన్నులు కాల గర్భంలో కలుస్తోంది. 1947 వరకు గిరిజన కుల పెద్దల సమక్షంలో నిర్వహించబడిన జాతర, 1962లో రెవెన్యూ ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి జాతర వ్యవహారాలన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరగడం ప్రారంభమైంది. 1980లో జాతరకు ఆదాయాన్ని చూసిన అప్పటి ప్రభుత్వం దేవాదాయశాఖకు అప్పజెప్పింది. ఇక్కడి నుంచే గిరిజనులపై ఆధిపత్య పోరు మొదలైంది. రెండేళ్లకోసారి జాతర జరగడంతో సమక్క సారక్కలను దర్శించుకునేందుకు లక్షల్లో భక్తులు వచ్చేవారు. ఈ క్రమంలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1996లో జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపును తీసుకొచ్చారు. దీంతో అప్పటి నుంచి సమ్మక్క సారలమ్మల ప్రాంగణం కార్పొరేట్ స్థాయికి చేరుకొని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతుందని గిరిజనులు వాపోతున్నారు.

కనిపించని ఎడ్లబండ్లు..

మూడు దశాబ్దాల క్రితం మేడారం జాతరకు వెళ్లాలంటే సారలమ్మ గద్దెలకు చేరుకునే ఒకరోజు ముందు భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవార్లకు మేకపోతు, నిలువెత్తు బెల్లాన్ని తీసుకొని ఎడ్లబండ్లలో తల్లుల దర్శనానికి మేడారం చేరుకునేవారు. ఆ రోజంతా దట్టమైన అటవీ ప్రాంతాల్లోనే నివాసాలను ఏర్పాటు చేసుకునేవారు. ఆ తర్వాత సారలమ్మ, జంపన్న పగిడిద్ద రాజు, సమ్మక్క గద్దెలపైకి చేరుకున్న అనంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని వెనుదిరిగేవారు. ప్రస్తుత తరంలో నేటి జాతరకు ఎడ్ల బండ్లను చూద్దామన్న కనిపించడం లేదు. జాతర జరిగినన్నీ రోజులు వాహనాలే కనిపించడం విశేషం.

ఆచారాల్లో ప్రభుత్వ నిబంధనలు..

ఆచార వ్యవహారాల్లో ప్రభుత్వం నిబంధనలను విధించింది. అమ్మవార్లను గద్దెలపైకి తరలించే క్రమంలో కొమ్ము బూరలు, తోలు డప్పులు తీసుకొని భక్తి శ్రద్ధలతో అమ్మలు కొలువై ఉన్న కన్నెపల్లి, చిలకల గుట్టలకు వెళ్లాలి. ఆ తర్వాత అమ్మవార్లను తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్టించే వారు. కానీ ప్రస్తుతం పోలీసుల బూట్ల చప్పుళ్లు, ఆధునికి సంస్కృతులు చోటు చేసుకుంటున్నాయి.

బంగారం(బెల్లం)పై ఆంక్షలు..

తల్లులకు అతి ప్రీతి పాత్రమైన బంగారం (బెల్లాన్ని తల్లులకు సమర్పించే విషయంలోను ప్రభుత్వం ఆంక్షాలు విధించింది. గత దశాబ్దాల కాలంలో నిలువెత్తు బెల్లాన్ని సమర్పించే భక్తులు, ప్రస్తుతం కేవలం కిలో, రెండు కిలోలు మాత్రమే సమర్పిస్తున్నారు. అమ్మవార్లకు మొక్కులు అప్పజెప్పడంలోనూ అధికారుల ప్రోద్బలం ఎక్కువ కావడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ కలెక్టర్ స్థాయి అధికారి సైతం మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెలపై బెల్లాన్ని వేయొద్దని ఆదేశాలు జారీ చేయడంతో గిరిజనుల ఆగ్రహానికి గురైన విషయం తెలిసిందే. ఎక్కువ శాతం బెల్లాన్ని వేయవద్దని గద్దెల వద్ద విధుల్లో ఉన్న అధికారులు అడ్డుకుని, తమ సంప్రదాయాలను కించపరుస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతర స్వాధీనానికి కుట్ర..

గిరిజనుల ప్రత్యేక జాతర అయిన మేడారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుందని పలువురు గిరిజనులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. గతంలో గిరిజనుల చేతుల్లో ఉన్న భద్రాచలం, శ్రీశైలం, కాళహస్తి తదితర దేవాలయాలు గిరిజనుల ఆచార వ్యవహారాల్లోనే ఉండేవని, దేవాలయాల ఆదాయాన్ని చూసిన ప్రభుత్వాలు వాటిని స్వాధీనం చేసుకుని గిరిజనులను అన్యాయం చేసిందంటున్నారు. వీటితో పాటు మేడారం సమ్మక్క సారలమ్మల దేవాలయాన్ని సైతం స్వాధీనం చేసుకొని గిరిజనులను రోడ్డున వేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపిస్తున్నారు.

అంతరించిన అడవులు..

గిరిజనులు నివాసం ఉండే ప్రాంతంలో కొలువైన సమ్మక్క సారలమ్మల గద్దెల పరిసర ప్రాంతాల్లో ఉన్న అడవులు అంతరించి పోయాయి. 1980లో ఉన్న భారీ వృక్షాలన్నీ నేలకొరిగి, నేడు పెద్దపెద్ద భవంతులు దర్శనమిస్తున్నాయి. గతంలో జాతరకు వచ్చిన భక్తులు చెట్ల కింద నివాసాలను ఏర్పాటు చేసుకుని సేద తీరేవారు. కానీ నేడు చిన్నచిన్న పందిళ్లు, భవంతిలోని గదులను అద్దెలకు తీసుకుని ఉంటున్నారు. ఇదంతా చూస్తుంటే మేడారం మహా జాతరలో కార్పొరేట్ పాగా వేసిందని చెప్పకనే స్పష్టమవుతోంది.

జాతీయ హోదాకు యత్నం

మేడారం జాతరకు జాతీయ హోదాపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే రాష్ట్ర పండుగగా చేసి గిరిజనుల జాతరను ఎండోమెంట్‌కు అనుసంధానించి గిరిజనులకు తీరని అన్యాయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు జాతీయ హోదా కల్పిస్తే పూర్తిగా జాతర వ్యవహారాలు కేంద్రం చేతికి వెళతాయి. దీంతో స్థానికంగా ఉన్న గిరిజనులకు అన్యాయం జరుగుతుంది. అందుకే జాతీయ హోదా వద్దంటున్నారు. ఇప్పటికే గిరిజనేతరులను ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా చేర్చడంతో ఆచార వ్యవహారాలు వారికి తెలియక చాలావరకు ఆచారాలు అపహాస్యం అవుతున్నాయని, జాతీయ హోదా విషయాన్ని ప్రభుత్వం విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వేసవి ఆరంభంలోనే కష్టాలు

• **అడుగంటుతున్న భూగర్భ జలాలు**

• **సింగూరు నుంచి నీటి తరలింపే కారణమా?**

• **ఆటో స్టార్టర్లు తొలగిస్తేనే జలాల సంరక్షణ సాధ్యం**



మన తెలంగాణ/సంగారెడ్డి: వేసవి ఆరంభంలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో తాగు, సాగు నీటికి ప్రజల తండ్లాట మొదలైంది. జిల్లాలోనే ఏకైక తాగు, సాగునీటి ప్రాజెక్టు అయిన సింగూరు నుంచి నెల క్రితం నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 15 టిఎంసిల నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేసిన విషయం తెలిసిందే. గత సంవత్సరంలో పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరద నీటితో సింగూరు ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పూర్తి స్థాయికి చేరుకుంది. పూర్తి స్థాయి నీటి మట్టం చేరుకోవడంతో మంజీరా నది పరీవాహక ప్రాంతంతో పాటు సింగూరు బ్యాక్ వాటర్‌ను వినియోగించుకొనే ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి మట్టం వుంటే బ్యాక్ వాటర్ ద్వారా మనూరు మండలంతో పాటు నది పొడువునా ఉన్న గ్రామాల రైతులు కూడా నీటిని వినియోగించుకొని పంటలు పండించుకోవడంతో పాటు భూగర్భ జలాలు కూడా బాగా వృద్ధిలోకి వస్తాయని ఆశించారు. కానీ వీరి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సింగూరు నుంచి కరీంనగర్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 15 టిఎంసిల నీటిని తరలించింది. ఒకేసారి 15 టిఎంసిల నీరు సింగూరు ప్రాజెక్టు నుంచి ఖాళీ కావడంతో మనూరు, న్యాల్‌కల్ మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలకు బ్యాక్ వాటర్ అందకుండా పోయాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధి కూడా పడిపోయింది. ప్రాజెక్టు నీటి మట్టం తగ్గిపోవడంతో పాటు ఆటో స్టార్టర్ల ద్వారా రైతులు తమ బోరు బావుల ద్వారా భూగర్భ జలాలను తోడేస్తుండడంతో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరెంట్ ఎన్నడు వస్తుందో, ఎన్నడు పోతుందో తెలియని పరిస్థితి వున్నప్పుడు రైతులు ఏర్పాటు చేసుకున్న ఆటో స్టార్టర్లు ఇప్పుడు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా వున్నప్పుడు కూడా ఆటో స్టార్టర్లను వినియోగిస్తుండటం వల్ల నీరు వృధా అవుతున్నాయి. కొంతమంది రైతులు మోటారు స్టార్ట్ చేసి ఇంటికి వెళ్లిపోవడం వల్ల అప్పటివరకు గంటల తరబడి బోరు మోటారు నడుస్తుండటమే భూగర్భ జలాల తగ్గుముఖానికి కారణమని అధికారులు పేర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న ఏకైన ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు సామర్థ్యం 30 టిఎంసిలు కాగా ప్రస్తుతం 13.50 టిఎంసిల నీరు నిల్వ వుంది. సింగూరు ప్రాంతంలోని వ్యవసాయానికి రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ రంగం దాదాపుగా బోరుబావులపైనే ఆధారపడి ఉంది. సంగారెడ్డి జిల్లాలో 84927 బోరుబావులు ఉండగా, 67941 బోరు బావులకు ఆటో స్టార్టర్లు ఉన్నట్టు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1వ తేదీ నుంచి వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంట్ సరఫరా అవుతున్నప్పటికీ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో గత జులై నెల నుంచే ప్రభుత్వం ప్రయోగాత్మకంగా వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తోంది. రైతులు వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న ఆటో స్టార్టర్ల వల్ల 24 గంటల పాటు అవసరం వున్నా, లేకుండా నీరు వృధాగా పోయింది. ఈ కారణంగా నీటి వినియోగం తీవ్రంగా పెరిగిపోయింది. సంగారెడ్డి జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన నారాయణఖేడ్, మనూరు, కంగ్టి, నాగల్‌గిద్ద తదితర మండలాల్లో భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గుతున్నాయి. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 5.92 మీటర్ల జల మట్టం తగ్గినట్టు తెలుస్తోంది. గతేడాది 2017 జూన్ నెలలో భూగర్భ జల మట్టం 17.03 మీటర్లు, జులైలో 16.38 మీటర్లు, ఆగస్టు నెలలో 15.69 మీటర్లు, సెప్టెంబర్‌లో 12.50 మీటర్లు, అక్టోబర్‌లో 9.87 మీటర్లు, నవంబర్‌లో 11.11 మీటర్లు స్థాయికి నీటి మట్టం పడిపోయింది. నారాయణఖేడ్, మనూరు, కంగ్టి, కల్హేర్ తదితర మండ లాల్లో ఇప్పటినుంచే నీటి కష్టాలు మొదలయ్యాయి. బోరు బావుల్లో నీటి మట్టం పాతాళానికి పడిపోవడంతో ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతన్నారు.



మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల పుణ్యక్షేత్రం జనసంద్రంగా మారింది. మంగళవారం నాడు పవిత్ర మాఘ అమావాస్య సందర్భంగా ఇక్కడి దుర్గామాత సన్నిధిలో ప్రవహిస్తున్న మంజీరానదిలో భక్తజనం పుణ్య స్నానమాచరించింది. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పి.విష్ణువర్థన్‌రెడ్డి, ఇఒ వెంకటకిషన్‌రావు ఆధ్వర్యంలో ధర్మకర్తలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా మెదక్ జడ్‌పి చైర్‌పర్సన్ రాజమణి, టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

– మన తెలంగాణ/పాపన్నపేట





హైటెక్ వ్యభిచారం, నిర్వాహకుడి అరెస్టు

మన తెలంగాణ/ హైదరాబాద్/ పంజాగుట్ట: గుట్టు చప్పుడు కాకుండా హైటెక్ తరహా వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకుడితో పాటు అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎసిపి శ్రీనివాస్‌రావు వివరాలను వెల్లడించారు. ఎపిలోని నెల్లురు జిల్లా ,కొవ్వురు లోని శ్రీదేవి నగర్‌కు చెందిన షేక్ ఫహద్ (35) జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 72 లోని ప్రశాసన్ నగర్ ప్లాట్ నెంబర్ 39లో కొద్ది రోజులుగా నివాసం ఉంటున్నాడు. ఈజీ మనీ కోసం పదేళ్లుగా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. తనకు తెలిసిన వరంగల్ జిల్లాకు చెందిన నారగాని సురేశ్ (29) , మంద జోసెఫ్ (39)తో పాటు మరి కొంత మందితో ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. తనకు తెలిసిన కస్టమర్లకు అమ్మాయిలను సప్లై చేస్తూ వారి వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అమ్మాయిలను కమీషన్ పద్ధతిలో తీసుకొస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడని ఎసిపి తెలిపారు. పక్కా సమాచారం మేరకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు. నిందితుడితో పాటు అతడికి సహకరించిన ఇద్దరిపైనా కేసులు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎసిపి తెలిపారు. నిందితుల వద్ద నుంచి 12 వేల నగదుతో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

18న ఎఐఎస్‌ఎఫ్ నిరసన

మన తెలంగాణ/హైదరాబాద్: ఎఐఎస్‌ఎఫ్ పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు చరణ్‌జిత్ చంగారాయ్‌పై బూటకపు హత్యా నేరం మోపడాన్ని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సత్యద్ వలీ ఉల్లా ఖాద్రీ తీవ్రంగా ఖండించారు. చరణ్‌జిత్ చంగారాయ్‌పై హత్యా నేరం మోపడాన్ని నిరసిస్తూ ఈ నెల 18న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. యువ న్యాయవాది అయిన చరణ్‌జిత్ పుట్టిన ప్రాంతంలో ప్రజానాయకునిగా ఎదగకుండా నిరోధించేందుకు మితవాద రాజకీయ నాయకులు, పోలీసులతో కలిసి కుట్రపూరితంగా ఆయనపై హత్యా నేరాన్ని మోపారని ఆయన తెలిపారు.

మన తెలంగాణ
8
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
wraw.manatelangana.news

'అర్జున్ రెడ్డి'గా అర్జున్‌కపూర్

టాలీవుడ్‌లో ట్రెండ్‌సెట్టర్ మూవీగా నిలిచిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. త్వరలోనే బాలీవుడ్‌లో ఈ సినిమా రీమేక్ కానుంది. మొన్నటివరకు ఈ రీమేక్‌లో వరుణ్‌ధావన్ నటిస్తాడంటూ వార్తలు వచ్చాయి. కానీ చివరికి అర్జున్‌రెడ్డిగా అర్జున్‌కపూర్ నటించబోతున్నాడు. ఈమేరకు ప్రాథమిక దశ చర్చలు పూర్తయ్యాయి. ఈ రీమేక్ మూవీకి సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు వినిపించాయి. వాటిలో ఒకటి అర్జున్‌కపూర్ రెమ్యునరేషన్. కథ బాగా నచ్చడంతో పారితోషికం తీసుకోకుండా ఈ రీమేక్ చేయడానికి ఒప్పుకున్న అర్జున్ కపూర్ ఈ చిత్రంలో నిర్మాతగా కొంత వాటాను తీసుకోబోతున్నాడు. గతంలో 'కీ అండ్ కా' అనే సినిమాకు కూడా అతను ఇలాగే పనిచేశాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే టాలీవుడ్‌లో అర్జున్ రెడ్డిని డైరెక్ట్ చేసిన సందీప్‌రెడ్డి వంగా ఈ బాలీవుడ్ మూవీని కూడా డైరెక్ట్ చేసే ఛాన్స్ ఉంది. ఈ రీమేక్ రైట్స్ దక్కించుకున్న నిర్మాత మురద్ ఖేతానీ ప్రస్తుతం ఇదే చర్చల్లో బిజీగా ఉన్నాడు. జూన్ లేదా జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. తెలుగులో సెన్సార్ ఇబ్బందులు ఎదుర్కొన్న 'అర్జున్‌రెడ్డి'కి బాలీవుడ్‌లో ఆ సమస్య పెద్దగా ఎదురుకాకపోవచ్చు.



క్రేజీ కాంబినేషన్‌లో మల్టీస్టారర్?



ఇతర హీరోలతో కలిసి స్క్రీన్ పంచుకోవడానికి అక్కినేని నాగార్జున ఎప్పుడూ వెనుకాడడు. చిన్నా పెద్దా తేడా లేకుండా, భాషా భేదం లేకుండా ఎప్పటినుంచో మల్టీస్టారర్లు చేస్తున్నాడు ఈ సీనియర్ స్టార్. మల్టీస్టారర్లు పూర్తిగా మరుగున పడిపోయిన సమయంలో మోహన్‌బాబుతో 'అధిపతి', శ్రీకాంత్‌తో 'నిన్నే ప్రేమిస్తా' వంటి సినిమాలు చేశాడు నాగార్జున. హిందీ, తమిళ భాషల్లోనూ అతను ఇతర హీరోలతో కలిసి నటించాడు. ఈమధ్యే తమిళ స్టార్ కార్తీతో కలిసి నాగార్జున నటించిన 'ఊపిరి' మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు నానీతో కలిసి శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఒక మల్టీస్టారర్ మూవీ చేయడానికి అతను సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లకముందే నాగార్జున మరో హీరోతో కలిసి మల్టీస్టారర్ చేసే అవకాశం ఉందని తెలిసింది. తమిళంలో తన టాలెంట్‌తో స్టార్‌గా ఎదిగిన ధనుష్‌తో కలిసి అతను మల్టీస్టారర్ చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ కాంబినేషన్‌లో సినిమా తీసేదెవరన్నది తెలియదు కానీ ఇద్దరూ కలిసి ఓ కథ గురించి చర్చించినట్లుగా టాక్ వినిపిస్తోంది. నిజంగా ఇది నిజమైతే ఇటు నాగార్జున అభిమానులకు... అటు ధనుష్ అభిమానులకు ఆనందాన్నిచ్చే విషయమే. దక్షిణాదిన ఇది క్రేజీ కాంబినేషన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ్, హిందీ భాషాల్లో తెరకెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారట.



నాగార్జున, ధనుష్



సూర్య, విఘ్నేశ్ శివన్, జ్ఞానవేల్ రాజా తదితరులు

ఘన విజయం దిశగా గ్యాంగ్

సూర్య కథానాయకుడిగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గ్యాంగ్'. కీర్తిసురేష్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, కార్తీక్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం తాజాగా విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో ఆడుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో హీరో సూర్య మాట్లాడుతూ ''విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం మంచి సక్సెస్‌ను అందుకోవడం ఆనందంగా ఉంది. కొత్తదనంతో కూడిన ఈ సినిమా ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని అందిస్తోంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ సినిమాలో నన్ను కొత్తగా చూపించారు. ఈ చిత్ర విజయంతో తెలుగులో నాకు హీరోగా మరింత పాపులారిటీ వచ్చింది''అని అన్నారు. దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ ''తెలుగులో ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన వస్తోంది. సంక్రాంతి సినిమాల మధ్య వచ్చిన మా చిత్రం సక్సెస్‌ను సాధించడంతో సంతోషంగా ఉంది''అని తెలిపారు. జ్ఞానవేల్‌రాజా మాట్లాడుతూ ''స్టార్ హీరో సూర్య నటన, దర్శకుడు విఘ్నేష్ శివన్ పనితనం ఈ సినిమా విజయంలో ప్రముఖ పాత్ర పోషించాయి. సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. సూర్య కెరీర్‌లో ఈ చిత్రం మంచి హిట్‌గా నిలవనుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువి క్రియేషన్స్ నిర్మాతలు ప్రమోద్, వంశీతో పాటు చిత్ర బృందం పాల్గొంది.

22 నుంచి మూడో చిత్రం

'నందిని నర్సింగ్ హోమ్' చిత్రంతో కథానాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్ విజయ్‌కృష్ణ. నవీన్ పుట్టినరోజును పురస్కరించుకొని అతను నటించబోయే మూడో చిత్రాన్ని ప్రకటించారు. ప్రస్తుతం తండ్రి నరేష్‌తో కలిసి 'విఠలాచార్య' చిత్రంలో నటిస్తున్న ఈ యంగ్ హీరో నటించబోయే నెక్స్ట్ మూవీకి బాలాజీ సనాల దర్శకత్వం వహించనున్నాడు. రోవస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యు అండ్ ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై శ్రీహరి మంగళంపల్లి, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'ఊరంతా అనుకుంటున్నారు' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈనెల 22 నుంచి మొదలుకానుంది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనున్న ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్ర పోషించనున్నాడు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను యంగ్ హీరో సాయిధరమ్ తేజ్ ట్విట్టర్‌లో రిలీజ్ చేశారు. మేఘా చౌదరి, సోఫియా సింగ్, జయసుధ, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య పాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి కథః శ్రీరమ్యశ్రీమంగలం, సంగీతంః కె.ఎం.రాధాకృష్ణ, సినిమాటోగ్రఫీః జి.లింగబాబు.



నవీన్ విజయ్‌కృష్ణ

పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సాయం

ఎస్‌ఎస్ రాజమౌళి ఇప్పుడు కేవలం టాలీవుడ్ దర్శకుడు మాత్రమే కాదు. దేశ, విదేశాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించుకున్న దర్శకధీరుడు అతను. బాహుబలి సిరీస్‌తో ఆయన సాధించిన ఘన విజయం అసామాన్యం. ఒకవైపు ప్రొఫెషనల్‌గా బిజీగా ఉంటున్న రాజమౌళి మరోవైపు సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటున్నాడు. కొంతకాలం క్రితం విశాఖపట్నం జిల్లా కశింకోటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం కోసం ఆయన భారీ విరాళాన్ని ప్రకటించాడు. ఏకంగా 40 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చి భవన నిర్మాణానికి సాయం చేశాడు. ఆ భవనానికి రాజమౌళి తల్లి రాజనందిని పేరు పెట్టడం విశేషం. 2014లో వచ్చిన హుదూద్ తుఫాన్ కారణంగా విశాఖ జిల్లా అతలాకుతలం అయిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో అనేక భవనాలు కూలిపోగా... వీటిలో 154 ఏళ్ల చరిత్ర ఉన్న కశింకోట హైస్కూల్ కూడా బాగా దెబ్బతిన్నది. 2015లో ఈ భవన నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పుడు అది పూర్తయిపోయింది. శిలాఫలకంపై రాజమౌళితో పాటు శోభనాద్రి, ప్రశాంతి, కీరవాణిల పేర్లు దర్శనమిస్తాయి. పాఠశాల భవన నిర్మాణానికి 40 లక్షల విరాళమివ్వడంతో ఇప్పుడు రాజమౌళిని అందరూ కొనియాడుతున్నారు.



రాజమౌళి

ఆమెలా నాజూకుగా మారవచ్చట



శిల్పాశెట్టి

ఇప్పుడు రిటైర్ అయిపోయిన హీరోయిన్లు అందరూ కూడా ఏదో ఒకవిధంగా లైమ్‌లైట్‌లో ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు తిరిగి సినిమాల్లోకి వస్తే... కొందరు టివి సీరియల్స్, వెబ్ సిరీస్ అంటూ హడావిడి చేస్తున్నారు. ఇక 40 దాటినా కూడా ఏమాత్రం అందచందాలు , గ్లామర్ తగ్గని శిల్పాశెట్టి మాత్రం యోగా వీడియోలతో అభిమానులను మురిపిస్తోంది. మొదటి నుండి యోగా, డైట్ మీద ఎంతో శ్రద్ధ చూపించిన శిల్పాశెట్టి ఇప్పుడు తన సొంత యూట్యూబ్ ఛానల్ ఒకటి ఏర్పాటుచేసుకొని యోగా వీడియోలు పెట్టేస్తోంది. ఈ ఛానల్‌లో అమ్మడు నేర్పే యోగాతో అందరూ కూడా ఆమెలా నాజూకుగా మారవచ్చట. ఆసనాల సంగతేమో కానీ శిల్ప అందచందాలను చూసి యూత్ మైమరచిపోతున్నారు. 42 ఏళ్ల శిల్ప అందాలను చూస్తే స్టార్ హీరోయిన్లకు కూడా మతులు పోవాల్సిందే.

రాజీ ప్రసక్తే లేదు

తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను మైమరపించిన బ్యూటీ సాయి పల్లవి. తన తొలి తెలుగు చిత్రం 'ఫిదా'లో భానుమతి పాత్రలో ఆమె అద్భుతంగా నటించి తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకుంది. అయితే భానుమతి క్యారెక్టర్‌లో 'ఇగో'ను పండించిన సాయి పల్లవికి నిజ జీవితంలో కూడా ఇగో ఎక్కువేనని రూమర్లు వచ్చిన సంగతి తెలిసిందే. 'ఎంసిఎ' చిత్రం షూటింగ్ సందర్భంగా నానీకి, సాయి పల్లవికి మధ్య ఇగో సమస్యలు వచ్చాయని టాక్ వచ్చింది. ఆతర్వాత అటువంటిదేమీ లేదని నాని క్లారిటీ ఇచ్చేశాడు. అనంతరం దిల్‌రాజుతో మరో సినిమా చేయడానికి సాయిపల్లవి తిరస్కరించిందనే వార్తలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆమె స్పందిస్తూ... ''దిల్‌రాజు చెప్పిన కథ నాకు నచ్చలేదు. అందుకే ఆ సినిమా చేయలేదు. నాకు ఎక్కువ రెమ్యునరేషన్ ఇస్తామని చెప్పినా కూడా ఆ సినిమాకు ఓకే చెప్పలేదు. అదేవిధంగా ఇటీవల ప్రముఖ దర్శకుడు మణిరత్నం, విలక్షణ నటుడు విక్రమ్‌కు కూడా నో చెప్పాను. మణిరత్నం దర్శకత్వంలో నటించాలని అందరికీ ఉంటుంది. కానీ ఆయన చెప్పిన కథలో నా పాత్రకు తగిన న్యాయం చేయలేననిపించి ఆ సినిమాను తిరస్కరించాను. కథ నచ్చపోవడంతోనే ఆ అవకాశాన్ని వదులుకున్నాను. ఇకముందు కూడా కథల విషయంలో, పాత్రల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడను''అని చెప్పింది.



సాయిపల్లవి

టెన్నిస్ స్టార్ బయోపిక్ చేయాలనుంది

సౌత్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ రాణిస్తున్న బ్యూటీ తాప్సీ. 'నామ్ షబానా' సినిమాతో నటిగా తన టాలెంట్‌ను నిరూపించుకుంది ఈ అమ్మడు. సౌత్‌లో తనకున్న గ్లామరస్ ఇమేజ్‌కు భిన్నంగా వెరైటీ పాత్రల్ని బాలీవుడ్‌లో ఎంచుకుంటోంది ఈ భామ. ఇక బయోపిక్ మూవీ చేయాల్సి వస్తే ఎవర్ని ఎంచుకుంటారు..? అన్న ప్రశ్నకు తాప్సీ ఆసక్తికరమైన సమాధానమిచ్చింది. తాప్సీకి టెన్నిస్ స్టార్ సానియామీర్జా అంటే ఎంతో ఇష్టమట. ఆమె జీవిత చరిత్రలో తాప్సీకి నటించాలని ఉందట. రాజకీయాల్లో అయితే ఇందిరాగాంధీ ఇష్టమని చెప్పిన ఈ భామ... రాజకీయాల గురించి తనకు పెద్దగా తెలియదని చెప్పింది. హీరోయిన్‌కు గ్లామర్ ఎంత అవసరమో... నటన కూడా అంతే అవసరమని చెబుతున్న తాప్సీ త్వరలో పూర్తిగా గ్లామరస్ రోల్‌లో నటిస్తానంటోంది. ఇప్పటికీ సౌత్ సినిమాల్లో తనకు అవకాశాలు వస్తున్నాయనీ, బాలీవుడ్ సినిమాల్లో బిజీగా ఉండడం వల్ల దక్షిణాది చిత్రాల్లో నటించలేకపోతున్నానని పేర్కొంది. సౌత్ సినిమాలంటే తనకెంతో అభిమానమనీ, చిన్న గ్యాప్ వచ్చినంత మాత్రాన సౌత్ సినిమాలకు తాను దూరమయ్యానని అనుకోకూడదని తాప్సీ అంది.



తాప్సీ

మన తెలంగాణ
9
హైదరాబాద్
బుధవారం
17, జనవరి 2018
www.manatelangana.news

అమెజాన్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ 'రిపబ్లిక్ డే సేల్'

న్యూఢిల్లీ: దేశీయ ఇ కామర్స్ సంస్థల్లో విపరీతమైన పోటీ నెలకొంది. ఆన్‌లైన్ మార్కెట్ దిగ్గజం అమెజాన్ ఇండియాకు పోటీగా మరో దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మరో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'రిపబ్లిక్ డే సేల్' పేరుతో సరికొత్త ఆఫర్లకు తెరతీసింది. ఈ ఆఫర్లు జనవరి 21 నుంచి 23 వరకు ఉంటాయి. దీని ద్వారా పలు వస్తువులను తగ్గింపు ధరలకు అందించనుంది. సిటీ బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులపై 10శాతం క్యాష్ బ్యాక్‌ను ఇవ్వనుంది. ఇటీవల అమెజాన్ ఇండియా కూడా 'గ్రేట్ ఇండియా సేల్' పేరుతో ఆఫర్‌ను ప్రకటించగా, ఇది ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఉంటుంది. దీని ద్వారా అమెజాన్ వివిధ వస్తువులపై ఆఫర్లను ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్‌లో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులపై డిస్కౌంట్ ఇవ్వగా, ముఖ్యంగా ల్యాప్‌టాప్‌లు, ఆడియో, కెమెరా, యాక్సెసరీస్‌పై 60శాతం వరకూ తగ్గించింది. ఇక దుస్తులు, చెప్పులు, ఇతర వస్తువులపై 50 నుంచి 80శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. అమెజాన్ కూడా మరిన్ని ఆఫర్లు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే చాలా వస్తువులపై డిస్కౌంట్లు ప్రకటించినా, వాటి జాబితాలో మరిన్ని వస్తువులను జతచేసే అవకాశముంది.

బెంగాల్‌లో భారీ పెట్టుబడులు

• రూ.5 వేల కోట్ల పెట్టుబడులకు రిలయన్స్ సంసిద్ధత • 100 శాతం గ్రామాలకు ఫైబర్ నెట్‌వర్క్ • బెంగాల్ బిజినెస్ గ్లోబల్ సదస్సులో ముఖేష్ అంబానీ



కోల్‌కతా: వచ్చే మూడేళ్లలో పశ్చిమబెంగాల్‌లో జియోయేతర వ్యాపారంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.5 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుందని కంపెనీ చైర్మన్ ముఖేష్ అంబానీ ప్రకటించారు. రిటైల్ పెట్రోలియం ఔట్‌లెట్లు వంటి వాటి ద్వారా ఇన్వెస్ట్ చేయనున్నట్టు మంగళవారం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిర్వహించిన వార్షిక ఇన్వెస్టర్ల సదస్సు 'బెంగాల్ బిజినెస్ గ్లోబల్ సమ్మిట్'లో ఆయన తెలిపారు. కొత్త పెట్రోలియం పంపులు ఏర్పాటు చేయనున్నామని, ప్రస్తుతం ఉన్న పెట్రోలియం పంప్‌లలో కొన్నింటిని తెరిచేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ మానుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు తెలిపారు. మొబైల్ ఫోన్ తయారీ, టెలివిజన్ సెట్‌లు, సెట్ టాప్ బాక్స్(ఎస్‌టిబి)ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖేష్ అంబానీ చెప్పారు. అలాగే బెంగాల్‌లో జియో సేవలను మరింతగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మెరుగైన కనెక్టివిటీ తేనున్నామని అన్నారు. స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు సహా విద్యా సంస్థల్లో ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరించనున్నామని అన్నారు. 2019 నాటికి తమ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా బెంగాల్‌లో 100 శాతం గ్రామాలను కవర్ చేయనున్నామని అంబానీ తెలిపారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో అత్యంత పెద్ద ఇన్వెస్టర్‌గా మారిందని అన్నారు. మెరుగైన 4జి సేవల కోసం జియో ఫోన్‌లను మరింతగా వ్యాప్తి చేయనున్నామని, పోన్లను పెంచేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో 'స్వచ్ఛత' కార్యక్రమం

మన తెలంగాణ/ హైదరాబాద్: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ జోనల్ పరిధిలోని రెండు తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం నుంచి''స్వచ్ఛత'' కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛతను ఈ నెల 31 వరకు నిర్వహించాలని, అన్ని శాఖలలో అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయాలని జోనల్ మేనేజర్ దీపక్ భండారి తెలిపారు. బ్యాంక్ అధికారులు తమ శాఖ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ జి.ఎస్. భగురక్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నట్లు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఒక ప్రకటన విడుదల చేసింది.

మార్కెట్లోకి లెక్సస్ ఎల్ఎస్ 500హెచ్

న్యూఢిల్లీ: జపాన్ కారు తయారీ సంస్థ లెక్సస్ దేశీయ మార్కెట్లోకి సరికొత్త లగ్జరీ కారును ప్రవేశపెట్టింది. జపాన్‌కు చెందిన ఎల్ఎస్ 500హెచ్ పేరుతో విడుదల చేసిన ఈ లగ్జరీ కారు ధర రూ.1.77కోట్ల నుంచి ప్రారంభం కానుంది. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ మోడళ్లను కాకుండా లెక్సస్ గత కొంతకాలంగా హైబ్రిడ్ ఎలక్ట్రిక్ కార్లను తయారు చేస్తోంది. ఎల్ఎస్ 500హెచ్ లగ్జరీ వేరియంట్ ధర రూ.1.77కోట్లు, అల్ట్రా వేరియంట్ ధర రూ. 1.82కోట్లు, డిస్టింక్ట్ వేరియంట్ ధర రూ. 1.93కోట్లుగా ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ సంస్థ నుంచి భారత మార్కెట్లో నాలుగో హైబ్రిడ్ కారు కావడం గమనార్హం. రాబోయే రోజుల్లో ఇలాంటి మోడళ్లను మరిన్ని తీసుకురానున్నట్లు కంపెనీ ప్రకటించింది.




మొబిక్విక్‌లో బజాజ్ ఫైనాన్స్‌కు 12.6 శాతం వాటా

న్యూఢిల్లీ: మొబైల్ వ్యాలెట్ కంపెనీ మొబిక్విక్‌లో 12.60 వాటాను సొంతం చేసుకున్నట్టు బజాజ్ ఫైనాన్స్ ప్రకటించింది. సిసిసిపిఎస్ (కంపల్సరీ కన్వర్టబుల్ క్యూములేటివ్ ప్రిఫరెన్స్ షేర్స్) ధర మార్పిడినలో మార్పు వల్ల గతంలో ప్రకటించిన 10.83 శాతం వాటాతో పోలిస్తే ఇప్పుడు ఎక్కువగానే వాటాను సొంతం చేసుకుంది. గతంలో కంపెనీ ప్రకటించిన దానికంటే అదనంగా ఇన్వెస్ట్‌మెంట్ ఏమీ లేదని బజాజ్ ఫైనాన్స్ పేర్కొంది. ఒప్పందం ప్రకారం, మొబిక్విక్‌కు చెందిన 10 ఈక్విటీ షేర్లు, 271,050 కంపల్సరీ కన్వర్టబుల్ క్యూములేటివ్ ప్రిఫరెన్స్ షేర్లు బజాజ్ ఫైనాన్స్ సొంతం చేసుకోనుంది.

ఆన్‌లైన్‌లో పతంజలి ఉత్పత్తులు

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలతో ఒప్పందం

న్యూఢిల్లీ: యోగా గురు రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు ఇక నుంచి ఆన్‌లైన్‌లో విరివిగా లభ్యం కానున్నాయి. ఎఫ్ఎంసిజి(ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్)లో ప్రవేశించిన పతంజలి స్వదేశీ బ్రాండ్‌గా విక్రయాలను పెంచుకుంటోంది. పేటీఎం మాల్, బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, గ్రోఫర్స్, అమెజాన్, నెట్‌మెడ్స్, 1ఎంజి, షాప్‌క్లూస్ వంటి ఇ–కామర్స్ సంస్థలతో పతంజలి ఒప్పందం కుదుర్చుకుంది. హరిద్వార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఇ–కామర్స్ వెబ్‌సైట్ల సాయంతో తమ ఉత్పత్తులు ప్రతి ఇంటికి చేరుతాయని రాందేవ్ అన్నారు. ఈ ఏడాది 50వేల కోట్ల ఉత్పత్తులను తయారు చేయనున్నామని, వచ్చే ఏడాది నుంచి లక్ష కోట్ల ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు తమ సొంతపోర్టల్ పతంజలి.నెట్‌లోనే సంస్థ ఉత్పత్తులు లభిస్తున్నాయి. ఎక్కువ మందికి చేరువ కావాలనే ఉద్దేశంతో ఎనిమిది ప్రముఖ ఇ–కామర్స్ పోర్టళ్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా పోర్టళ్ల ప్రతినిధులు, పతంజలి ఎండి ఆచార్య బాలకృష్ణ తదితరులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ రోజుల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకునే వారి సంఖ్య పెరిగిందని, ఇది తమ ఉత్పత్తులను మరింతగా ప్రజలకు చేరువ అయ్యేందుకు దోహదం చేస్తుందని ఈ సందర్భంగా పతంజి సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

మార్కెట్‌కు వాణిజ్య లోటు భయాలు

• ఒడిదుడుకుల మధ్య స్వల్ప నష్టాలు



న్యూఢిల్లీ :– దేశీయ వాణిజ్య లోటు ఆందోళనకరంగా మారడంతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. 2016 డిసెంబర్‌లో 10.54 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ వాణిజ్య లోటు 2017 డిసెంబర్‌లో 14.88 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో డిసెంబర్‌లో దేశీయ వాణిజ్యలోటు మూడేళ్ల గరిష్ఠస్థాయికి చేరడం, అలాగే యూరోపియన్ మార్కెట్ల ప్రభావంతో ట్రేడర్లు అమ్మకాల వైపు మొగ్గుచూపారు. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. మార్కెట్ ముగిసిన అనంతరం బిఎస్ఇ సెన్సెక్స్ 72 పాయింట్లు నష్టపోయి 34,771 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక ఎన్ఎస్ఇ నిఫ్టీ 41 పాయింట్ల పతనమై 10,700 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 34,735 నుంచి 34,936 మధ్య స్థాయిలో ట్రేడ్ అయింది. బిఎస్ఇలో ఐటి రంగ సూచీ తప్ప మిగతా అన్ని సూచీలు నష్టాల్లో ముగిశాయి. మార్కెట్‌లో ఐటీ షేర్ల హవా కొనసాగింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ మూడు వారాల కనిష్టస్థాయికి చేరింది. నిఫ్టీ టాప్5 షేర్లూ ఐటీరంగానివే కావడం విశేషం. సూచీలు మరింత పతనండ్డాయి. కోల్ ఇండియా, హింద్ పెట్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫెనాన్స్, టాటామోటర్స్ 5 నుంచి 3 శాతం పతనమయ్యాయి.

గృహరుణ రంగానికి చెందిన హెచ్‌డిఎఫ్‌సి అరుదైన ఘనతను సాధించింది. ఈ సంస్థకు చెందిన షేర్లధరలు పెరగటంతో సంస్థ విలువ రూ.3 లక్షల కోట్లను దాటింది. క్యూఐపి ద్వారా రూ.13,000 కోట్లను సేకరిస్తున్నట్లు వార్తలు రావడంతో సోమవారం షేర్ ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం అత్యధిక రూ.1,878వద్ద ట్రేడ్ అయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు షేరు ధర 9.8శాతం పెరిగింది. మంగళవారం హెచ్‌డిఎఫ్‌సి షేరు స్వల్పంగా 0.92 శాతం పడిపోయి రూ.1,854కు చేరింది. గతంలో రూ.3లక్షల కోట్ల మార్కెట్ విలువను దాటిన భారతీయ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి , మారుతీ సుజుకీ ఇండియా, ఓఎన్‌జిసిలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.6లక్షల కోట్లు. ఆ తర్వాతి స్థానాల్లో టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లు ఉన్నాయి.

ఎస్‌బిఐ షేరు భారీగా పతనం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) షేరు మంగళవారం భారీగా పతనమైంది. షేరు విలువ రూ.300 దిగువకు పడిపోయింది. ఓ దశలో ఎస్‌బిఐ కౌంటర్‌లో అమ్మకాలు పెరగడం తో 2.18 శాతం క్షీణించి రూ.295.65ల కనిష్టధరకు పడిపోయింది. ట్రేడిం గ్ ఆఖరి సమయంలో షేరు గత ముగింపు ధర రూ.302.25తో పోలిస్తే 1.78 శాతం నష్టపోయి రూ.297.20 వద్ద ట్రేడ్ అయింది. షేరు ఏడాది కని ష్ట, గరిష్ట ధరలు చూస్తే రూ.241.25, రూ.351.50లుగా ఉన్నాయి.

ఐసిఐసిఐ బ్యాంక్ షేరు ర్యాలీ

న్యూఢిల్లీ :– ఓ వైపు ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ నష్టాల వైపు పయనిస్తుంటే మరోవైపు ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ ర్యాలీ బాట పట్టింది. వరుసగా మూడు రోజూ ఐసిఐసిఐ బ్యాంక్ ర్యాలీని కొనసాగించింది. మంగళవారం 52వారాల గరిష్టాన్ని చేరింది. విదేశీ బ్రోకింగ్ దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ రేటింగ్ పెంపు, ప్రైవేట్‌రంగ బ్యాంకు షేర్ల ర్యాలీ కారణాలతో షేరు గత రెండు ట్రేడింగ్ సెషన్స్‌లో ర్యాలీ చేసింది. ఇదే ర్యాలీని మంగళవారం కొనసాగిస్తూ బిఎస్ఇలో రూ.329.50ల ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 3.34శాతం లాభపడి రూ.340.65ల వద్ద 52వారాల గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సమయానికి షేరు విలువ 1.43 శాతం పడిపోయి రూ.334కు చేరింది. ఇక షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.326.55లు, రూ.340.65లుగా నమోదయ్యాయి.

మూడేళ్ల గరిష్టానికి వాణిజ్య లోటు



• 2017 డిసెంబర్‌లో 14.88 బిలియన్ డాలర్లకు పెరుగుదల

న్యూఢిల్లీ : డిసెంబర్‌లో దేశీయ ఎగుమతులు ఆరోగ్యకరంగా ఉన్నప్పటికీ దిగుమతులు మాత్రం మరింతగా పెరుగుతూ పోతున్నాయి. దీని పర్యవసానంగా దేశీయ వాణిజ్య లోటు మూడేళ్ల గరిష్టానికి చేరుకుంది. గత నెలలో ఎగుమతులు 12.3 శాతం పెరిగి 27 బిలియన్ డాలర్లకు చేరుకోగా, అదే సమయంలో బంగారం, క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లు.. దిగుమతులను పెంచేశాయి. దీంతో డిసెంబర్‌లో దిగుమతులు 21.1 శాతం పెరిగి 41.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. దీని కారణంగా 2016 డిసెంబర్‌లో 11.5 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ వాణిజ్య లోటు 2017 డిసెంబర్‌లో 14.88 బిలియన్ డాలర్లకు చేరింది. 2014 నవంబర్‌లో వాణిజ్య లోటు 16.2 బిలియన్ల స్థాయిలో ఉంది. బంగారం, క్రూడాయిల్ దిగుమతుల భారం పెరగడంతో వాణిజ్యలోటు పెరిగిందని వాణిజ్య శాఖ వెల్లడించింది. గత నెలలో దేశీయ దిగుమతులు 2016తో పోలిస్తే 21.1శాతం పెరిగి 4,190 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే దేశీయ దిగుమతులు పెరగడం ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగడానికి సంకేతమని బ్రోకరేజ్‌సంస్థ నోమురా అభిప్రాయపడింది. గత డిసెంబర్‌లో బంగారం దిగుమతి అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఏకంగా 71.5 శాతం పెరిగింది. వరుసగా రెండు నెలల పతనం తర్వాత బంగారం దిగుమతులు ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు చమురు దిగుమతి 2016 డిసెంబర్‌తో పోలిస్తే 35 శాతం పెరిగి 1034 కోట్ల డాలర్లకు చేరింది. క్రూడ్ ఆయిల్ ధరలు గతనెల్లో భారీగా పెరగడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. దేశ దిగుమతుల్లో ఎక్కువ శాతం వాటా చమురుదే కావడం, వీటి ధరల్లో ఒక్క డాలర్ పెరిగినా దిగుమతుల బిల్లులో 156 కోట్ల డాలర్ల భారం పెరుగుతుందని ఎస్‌బిఐ అంచనా వేసింది. ఇక గత డిసెంబర్‌లో ఎగుమతులు 12.36 శాతం పెరిగి 2703కోట్ల డాలర్లకు చేరగా, గత అక్టోబర్ నుంచే ఎగుమతులు కాస్త ఊపందుకున్నాయి. ఎగుమతుల్లో అధికభాగం ఇంజనీరింగ్ గూడ్స్.. గతనెల 25.32 శాతం వృద్ధి నమోదు చేశాయి. విలువైన రాళ్లు, ఆభరణాలు, పెట్రోఉత్పత్తులు, సేంద్రీయ, నిరీంద్రయ రసాయనాల ఎగుమతులు కూడా వృద్ధి నమోదు చేశాయి. ప్రధానంగా క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల వాణిజ్య లోటుకు కారణమవుతోంది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34771.05	–72.46	–0.21%
నిఫ్టీ	10700.45	–41.10	–0.38%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28820	30823.53	0.31%
ముంబై	29520	31572.19	0.85%
ఢిల్లీ	29000	31016.04	0%
కోల్‌కతా	29570	31625.67	0%
కేరళ	27850	29786.10	0.36%
బెంగళూరు	28250	30213.90	0.36%
హైదరాబాద్	28850	30855.61	0.49%
గల్ఫ్	1428.21	1527.50	0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	42000.00	41600.00	0.96
ముంబై	42000.00	41600.00	0.96
ఢిల్లీ	42000.00	41600.00	0.96
కోల్‌కతా	42000.00	41600.00	0.96
హైదరాబాద్	42000.00	41600.00	0.96



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	350	విశాఖపట్నం	366
వరంగల్	351	చిత్తూరు	368
విజయవాడ	360	చెన్నై	375
గోదావరి	360	బెంగళూరు	355

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
విప్రో	334.00	316.00	331.95	315.00	16.95	5.38
హెచ్‌సిఎల్ టెక్	955.00	910.00	949.25	909.25	40.00	4.40
ఇన్ఫోసిస్	1,134.80	1,081.25	1,122.85	1,081.15	41.70	3.86
టిసిఎస్	2,861.65	2,750.55	2,850.85	2,746.10	104.75	3.81
టెక్ మహీంద్రా	563.00	547.30	557.65	543.75	13.90	2.56
డా. రెడ్డీస్ ల్యాబ్స్	2,484.00	2,431.75	2,468.70	2,431.75	36.95	1.52
ఐసిఐసిఐ బ్యాంకు	340.75	326.55	334.10	329.30	4.80	1.46
జీ ఎంటర్‌టైన్	618.30	607.50	613.40	606.15	7.25	1.20
హెచ్‌యుఎల్	1,389.50	1,363.75	1,382.00	1,367.20	14.80	1.08
అదానీ పోర్ట్	428.25	418.45	423.55	420.60	2.95	0.70

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
కోల్ ఇండియా	305.90	290.60	291.60	305.90	14.30	4.67
టాటా పవర్	98.45	92.90	93.65	97.95	4.30	4.39
హెచ్‌పిసిఎల్	429.55	409.60	410.40	426.05	15.65	3.67
బజాజ్ ఫైనాన్స్	1,745.80	1,684.60	1,687.35	1,738.15	50.80	2.92
రిలయన్స్	947.70	920.00	922.95	949.15	26.20	2.76
వేదాంత	340.75	325.05	330.15	339.20	9.05	2.67
అరబిందో ఫార్మ	662.00	638.60	641.10	658.00	16.90	2.57
టాటా మోటర్	435.20	419.50	421.90	432.35	10.45	2.42
హిందాల్కో	268.00	259.70	260.55	266.70	6.15	2.31
టాటా స్టీల్స్	782.75	760.10	765.75	783.50	17.75	2.27

శంకుస్థాపనలే కాంగ్రెస్ ఘనత : మోడీ



జైపూర్: కేవలం శంకుస్థాపన రాళ్లు పాతి ప్రజలను మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం నాడు రాజస్థాన్‌లోని పచ్ పద్రాలో జరిగిన ఒక సభలో ఎద్దేవా చేశారు. రూ. 43,129 కోట్లతో నెలకొల్పనున్న బార్మెర్ చమురు శుద్ధి కర్మాగారం ప్రాజెక్టు పని ఒక సభలో ప్రారంభిస్తూ ఆయన ఆ వ్యాఖ్య చేశారు. దుర్భిక్షం, కాంగ్రెస్ చట్టపట్టాలు వేసుకొని నడుస్తాయని, కాంగ్రెస్‌ను వెళ్లగొట్టిన తర్వాత రాష్ట్రంలో దుర్భిక్షం అంతమయిందని ఆయన అన్నారు. ఆ చమురు శుద్ధి కర్మాగారం ఘనత తమదంటే తమదని కాంగ్రెస్, బిజెపి మధ్య చాటింపుల యుద్ధం కొంత కాలం సాగింది. కాంగ్రెస్ కేవలం శంకుస్థాపన రాళ్లు పాతడమే చేస్తుందని, దేశమంతటా అలాగే చేసి ఘనత చాటుకుంటుందని మోడీ విమర్శించారు. అనతి కాలంలో ప్రజాకర్షణ పొందడానికి కొత్తకొత్త రైల్వే లైన్‌లను ప్రకటించి అవి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు. కేవలం ప్రకటనలతో ప్రజలను కాంగ్రెస్ బురిడీ కొట్టిస్తోందని విమర్శించారు. బార్మెర్ చమురు శుద్ధి కర్మాగారం కాగితాలపై ఉందని మరో ప్రాజెక్టు ఒఆర్‌ఒపి కాగితాలపై కూడా లేదని ఆయన విమర్శించారు. ఒఆర్‌ఒపి ప్రాజెక్టు అమలు ఖర్చు రూ. 12,000 కోట్లు కాగా కాంగ్రెస్ కేవలం రూ. 500 కేటాయించిందని పేర్కొన్నారు. తాము నాలుగు విడతల్లో రూ. 10,700 కోట్లు అందించామని చెప్పుకొన్నారు.

నన్ను చంపేందుకు కుట్ర పన్నారు



అహ్మదాబాద్ : తనని చంపాలనుకుంటున్నారని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా ఆరోపించారు. సోమవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిన తొగాడియా దాదాపు 12 గంటల తర్వాత ఓ పార్కులో అపస్మారకస్థితిలో కనిపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆయన మంగళవారం మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'నన్ను ఎన్‌కౌంటర్‌లో చంపించాలని కొందరు పథకం రచిస్తున్నారు. దశాబ్దం నాటి కేసులో నన్ను టార్గెట్ చేస్తున్నారు. రాజస్థాన్‌కి చెందిన పోలీసుల బృందం నన్ను అరెస్ట్ చేయడానికి వచ్చింది. నన్ను ఎన్‌కౌంటర్‌లో చంపాలని వారు పథకం రచిస్తున్నట్లు తెలిసింది. అందుకే నా కార్యాలయం నుంచి వెళ్లిపోయా. ఎన్ని ఆటంకాలు ఎదురైనా గో రక్షణ, రామ మందిర నిర్మాణం అంశాల్లో నేను పోరాడుతూనే ఉంటాను. రాజకీయ అంశాల్లో కలగజేసుకోకూడదని రాజస్థాన్ పోలీసులను కోరుతున్నా' అని తొగాడియా తెలిపారు. 2001లో ఓ ఉద్యమకేసుకు సంబంధించి రాజస్థాన్ పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడానికి విహెచ్‌పీ కార్యాలయానికి వెళ్లగా తొగాడియా అప్పటికే కనిపించకుండా పోయారు. దీంతో గుజరాత్ పోలీసుల సహకారంతోనే రాజస్థాన్ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారని ఆరోపిస్తూ విహెచ్‌పి నేతలు అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్‌లో ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై రాజస్థాన్ పోలీసులు మాట్లాడుతూ.. తొగాడియాను తాము అరెస్టు చేయలేదని కోర్టు నోటీసులు ఇచ్చేందుకు విహెచ్‌పీ కార్యాలయానికి వెళ్లగా అప్పటికే ఆయన కనిపించకుండా పోయారని తెలిపారు. కాగా, ప్రవీణ్ తొగాడియా ఆరోగ్యం నిలకడగానే ఉందని అతనికి వైద్యం చేసిన డాక్టర్ రూప్‌కుమార్ అగర్వాల్ చెప్పారు. కాగా, మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ గుజరాత్ అధ్యక్షులు హార్దిక్ పటేల్‌ను ఆసుపత్రిలో ప్రవీణ్ తొగాడియాను పరామర్శించారు.

ఆ సమావేశంలో ఎన్ఎస్ఎ పాల్గొనడంపై విచారణ జరపాలి

న్యూఢిల్లీ : బిజెపి ఎన్నికల సమావేశంలో జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ డోవల్ హాజరైన అంశంపై విచారణ జరిపించాలని సిపిఐ (ఎం) త్రిపుర శాఖ ఎన్నికల సంఘానికి (ఇసి) విజ్ఞప్తి చేసింది. ఇక్కడ వున్న హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారిక నివాసంలో జనవరి 14న ఈ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో సిపిఐ(ఎం) త్రిపుర శాఖ కార్యదర్శి బిజన్ ధర్ సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి)కి లేఖ రాశారు. బిజెపి నిబంధనలను ఉల్లంఘించి ఎన్ఎస్ఎను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నదని ఆ లేఖలో ఆయన ఆరోపించారు. ఇలా వ్యవహరించిన బిజెపిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇలా అధికార యంత్రాంగాన్ని ఎన్నికలకు వినియోగించుకున్న ఘటనలను తామెప్పుడూ చూడలేదని, సత్వరమే బిజెపి వ్యవహరించిన ఈ తీరుపై విచారణ జరపాలని కోరారు.

గుర్మీత్ అరెస్టుతో రూ. 126కోట్ల నష్టం

చండీగఢ్ : డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌ను కొద్ది మాసాల క్రితం నాటకీయ పరిణామాల నడుమ అరెస్ట్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆయన అరెస్టుతో హర్యానా రాష్ట్రానికి రూ. 126 కోట్ల నష్టం వాటిల్లిందట. ఇందులో గుర్మీత్ అరెస్ట్ తర్వాత జరిగిన ఆస్తి నష్టం, వివిధ విభాగాలు కోల్పోయిన ఆదాయం, భద్రత ఏర్పాట్లు చేయడానికి అయిన ఖర్చు ఉన్నాయి. గుర్మీత్ అరెస్ట్ తర్వాత తీవ్ర హింస చెలరేగిన విషయం తెలిసిందే. వీటి వల్ల మొత్తం రూ.126,68,71,700 నష్టం వాటిల్లినట్లు హర్యానా ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో అత్యధికంగా అంబాలానే రూ.46.84 కోట్లు నష్టపోయింది. ఆ తర్వాత స్థానంలో ఫతేబాద్ రూ.14.87 కోట్ల నష్టంతో ఉన్నది. డేరా హెడ్‌క్వార్టర్స్ ఉన్న సిర్సాలో రూ.13.57 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం తెలిపింది. అసలు ఈ అల్లర్లకు ప్రధాన కేంద్రమైన పంచకులలో రూ.10.57 కోట్ల నష్టం జరిగింది. పంచకులలోనే కాల్పుల్లో మొత్తం 36 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

లాలూ అల్లుడు రాహుల్‌కు ఇడి సమన్లు

న్యూఢిల్లీ: అక్రమ నగదు చలామణి కేసులో తమ ఎదుట హాజరు కావాలని బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరో అల్లుడు రాహుల్ యాదవ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసింది. తన అత్త, లాలూ భార్య రబ్రీదేవికి రాహుల్ యాదవ్ కోటి రూపాయలు బదిలీ చేశారని ఇడి తనిఖీల్లో బయట పడినట్లు ఆరోపణలున్నాయి. లాలూ నాలుగో కుమార్తె రాగిని భర్త రాహుల్ యాదవ్‌ను ఈ వారం తర్వాత తమ ఎదుట హాజరయి, నిధుల బదిలీకి సంబంధించిన వివరాలను తెలపాలని ఇడి సమన్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి లాలూ కుమార్తె , ఎంపి మిసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్‌ను గతంలో ఇడి అనేకసార్లు విచారించింది. మిస్ మిషైల్ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన అక్రమ నగదు చలామణీ కేసులో మిసా, శైలేష్‌లకు సంబంధముందని ఇడి ఆరోపించింది. పిఎంఎల్ఎ చట్టం కింద ఈ కేసును ఇడి విచారిస్తోంది.

కానిస్టేబుల్ కాల్పులు : ముగ్గురు మృతి

పూనే: ఇండియా రిజర్వ్ బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. స్టేట్ రిజర్వు పోలీసు ఫోర్సు క్యాంప్‌లో పోస్టింగ్‌లో ఉన్నాడు. అయితే ఇక్కడికి 80 కి.మీ. దూరంలోని డౌన్ టౌన్‌లో ఈ హెడ్ కానిస్టేబుల్ మంగళవారం జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. ఈ సంఘటన అనంతరం అతను ఓ ఫ్లాట్‌లోకి వెళ్లి లోపల తాళం వేసుకున్నాడని, అతడిని బయటకు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని పోలీసు అధికారి చెప్పారు. మృతులలో ఒకరు ఈ హెడ్ కానిస్టేబుల్‌కు బంధువని తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నటి అమలాపాల్ లొంగుబాటు



చెన్నై: పన్ను ఎగవేత కేసులో ప్రముఖ నటి అమలాపాల్ క్రైమ్ బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. తప్పుడు చిరునామా పత్రాలు సృష్టించి రూ.20 లక్షల పన్ను ఎగ్గొట్టినట్లు ఆమెపై కేరళలో కొద్ది రోజుల క్రితం కేసు నమోదైంది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో ఇటీవల ఆమె కేరళ హైకోర్టును సంప్రదించి, ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో న్యాయస్థానం క్రైమ్ బ్రాంచ్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. తర్వాత కేసు పరిశీలిస్తామని పేర్కొంది. దీంతో అమలాపాల్ సోమవారం తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ పోలీసుల వద్ద లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆమె తప్పుడు పత్రాలు చూపినట్లు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

భారత్–ఇజ్రాయెల్ నవ బంధం

• ఒప్పందాలపై సంతకాలు • మోడీ, నెతన్యాహు పరస్పరం ప్రశంసలు



మంగళవారం నాడు తాజ్‌మహాల్‌ను సందర్శించిన నెతన్యాహు దంపతులు

న్యూఢిల్లీ : భారత్, ఇజ్రాయెల్ దేశాలు పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై చర్చలు జరిపాయి. ఇరు దేశాల నడుమ తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు చేశారు. సోమవారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భేటీ అయి పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. సైబర్ సహకారం, శాస్త్ర సాంకేతికం, ఇంధనం, వ్యవసాయం, భద్రతా, సినిమా సహకారం తదితర రంగాలపై ఇరు దేశాల మధ్య పరస్పరం సహకరించుకోవాలని అవగాహనకు వచ్చారు. అనంతరం ఒప్పంద పత్రాలను ఇరు దేశాల ప్రతినిధులు ఇరు దేశ ప్రధానుల సమక్షంలో మార్చుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మోడీ, నెతన్యాహు మాట్లాడారు. నెతన్యాహును ప్రియమైన స్నేహితుడిగా మోడీ అభివర్ణించారు. తామిద్దరం ఇరు దేశాల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపామని, గత ఏడాది జులైలో తాను 125కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలను ఆయనకు తీసుకెళ్లానని చెప్పారు. అక్కడ నుంచి తిరిగి వచ్చేపుడు నా స్నేహితుడు, నెతన్యాహు, ఇజ్రాయెల్ ప్రజల ప్రేమాభిమానాలను తీసుకొచ్చానని మోడీ పేర్కొన్నారు. గతంలో తాము తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందాలు ఇరుదేశాల మధ్య నెలకొన్న సంబంధాలను మరో స్థాయికి చేర్చాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఇజ్రాయెల్ పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అనంతరం నెతన్యాహు మాట్లాడుతూ మోడీ ఓ విప్లవాత్మకమైన నాయకుడని కొనియాడారు. ఆయన తీసుకునే నిర్ణయాలతో భారత్‌లో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని ప్రశంసించారు. గతేడాది మోడీ ఇజ్రాయెల్ పర్యటన చారిత్రాత్మకమని, భారతీయులు గొప్ప వాళ్లు, సహనశీలురు అన్నారు. మోడీ ఏ సమయంలోనైనా తనతో యోగా చేయొచ్చు అని నెతన్యాహు అన్నారు.

తాజ్‌ను సందర్శించిన ఇజ్రాయెల్ ప్రధాని

భారత పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మంగళవారం ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను తన భార్యతో కలిసి సందర్శించారు. నెతన్యాహు దంపతులను ఖేరియా విమానాశ్రయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘన స్వాగతం పలికారు. బ్రజ్ జానపద కళాకారులు సంప్రదాయక స్వాగతం పలికారు.

ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో ట్విట్టర్‌లో పేర్కొంది. తాజ్ సందర్శనకు ముందు హోటల్ అమర్ విలాస్‌లో కొంతమంది ప్రముఖులు కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. కాగా, ఇజ్రాయెల్ ప్రధాని తాజ్‌మహల్‌ను సందర్శిస్తున్న నేపథ్యంలో పర్యాటకులను రెండు గంటల పాటు అనుమతించలేదు. అదే విధంగా ఖేరియా విమానాశ్రయం నుంచి తాజ్‌కు వచ్చే మార్గాన్ని మూసివేశారు. అదనపు బలగాలను మొహరింపజేశారు. అయితే ఆయన ఢిల్లీకి వెళ్లేముందు హోటల్ అమర్ విలాస్‌లో బస చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆరు రోజుల పర్యటనలో భాగంగా నెతన్యాహూ ఆదివారం భారత్‌కు విచ్చేశారు.

ముంబయిని సందర్శించిన చిన్నారి మోషే



ముంబయి: ముంబై ఉగ్ర దాడిలో తన తల్లితండ్రులను కోల్పోయిన మోషే హోల్ట్జ్‌బెర్గ్, విషాద ఘటన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత మొదటిసారిగా ముంబయిని సందర్శించాడు. తన తాత, నానమ్మతో కలిసి ఆయన మంగళవారం ఉదయం ముంబయి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. నమస్కారం, నేను చాలా సంతోషంగా ఉన్నానని ఆయన సిగ్గుపడుతూ చెప్పాడు. ప్రార్థన చేయడానికి నారీమన్ హౌజ్‌కు వెళతానని, భారత్‌ను సందర్శించడం తనకు సంతోషంగా ఉందని 11 ఏళ్ల మోషే ఆనందం వ్యక్తం చేశాడు. తన తల్లిదండ్రులు మృతి చెందిన నారిమన్ హౌజ్‌ను సందర్శించి మోషే ప్రార్థన చేస్తాడని ఆయన తాత శిమోన్ రోసెన్‌బర్గ్ తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో ఆయన తండ్రి రబ్బీ గాబ్రీల్ హోల్ట్జ్‌బెర్గ్, తల్లి రివ్కా ప్రాణాలు కోల్పోయారు. భారతదేశానికి చెందిన నర్సు సాండ్ర శామ్యూల్ రెండేళ్ల వయసున్న చిన్నారి మోషేను ఉగ్రదాడి నుంచి రక్షించింది. మోషే తల్లిదండ్రులు యూదుల జీవితంలో అత్యంత శక్తివంతమైన 'చబాద్–లుబావిచ్' సాంస్కృతిక సంస్థను నారీమన్ హౌజ్ వద్ద స్థాపించారు. నవంబర్ 2008లో మూడు రోజుల పాటు నారీమన్ హౌజ్‌ను ముట్టడించిన 10 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు 166 మందిని కాల్చి చంపారు. గత ఏడాది జులై ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయ్ పర్యటించినప్పుడు మోషే, ఆయన తాత, నానమ్మలను కలిశారు. తాను భారత్‌కు సందర్శిస్తానని, భారతీయులంటే తనకు ఎంతో ఇష్టమని అప్పుడు ప్రధానితో మోషే తెలిపాడు.

పిటిషనర్లకూ వైద్య నివేదికలివ్వండి

జస్టిస్ లోయా మృతి కేసులో మహారాష్ట్రకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : జస్టిస్ బిఎం లోయా అనుమానాస్పద మృతి కేసులో అన్ని వివరాలు పిటిషనర్లకు తెలియజేయాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో వైద్య నివేదికతోపాటు అన్ని డాక్యుమెంట్లను పిటిషనర్లు పరిశీలించేందుకు ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సమయంలో సిబిఐ జడ్జి జస్టిస్ లోయా మరణించారు. ఈ కేసుపై స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశించాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు గత గురువారం అంగీకరించింది. మంగళవారం నాలుగు నిమిషాలపాటు ఈ పిటిషన్లపై విచారణ జరిగింది. ఇది పిటిషనర్లకు అన్ని విషయాలు తెలియవలసిన కేసు అని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. ఈ వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలే (పిల్)ను విచారిస్తోంది. ఒక పిల్‌ను బంధురాజ్ శంభాజీ అనే జర్నలిస్టు దాఖలుచేయగా, మరొకదానిని రాజకీయ ఉద్యమకారుడు తెహసీన్ పూనావాలా దాఖలు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే సుప్రీంకోర్టుకు వాదనలు వినిపించారు. అన్ని డాక్యుమెంట్లను పిటిషనర్లకు అందజేయడానికి అభ్యంతరం లేదని, అయితే, పిటిషనర్లు ఆ డాక్యుమెంట్లను బహిరంగపరచకూడదని అన్నారు. సుప్రీంకోర్టు గత గురువారం ఆదేశించిన విధంగా అన్ని డాక్యుమెంట్లను సీల్డ్ కవర్‌లో పెట్టి సుప్రీంకోర్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సమర్పించింది. విచారణను వారం పాటు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

ట్రిపుల్ ఐటి మంజూరు చేయండి

• బాలికల విద్యావికాసంలో తెలంగాణ ఆదర్శం • ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మన తెలంగాణ / న్యూఢిల్లీ : బాలికల విద్యా వికాసం కోసం తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను నెలకొల్పిందని, వీటికి ఆర్థికసాయం అందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి విజ్ఞప్తి చేశారు. ప్రతి రాష్ట్రానికి ఒక ట్రిపుల్ ఐటీని మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని, దాంట్లో భాగంగా తెలంగాణకు కూడా రానున్న బడ్జెట్‌లో ప్రకటన చేయాలని కోరారు. రాష్ట్రానికి గిరిజన విశ్వవిద్యాలయం ఉన్నప్పటికీ బడ్జెట్ కేటాయింపుల్లో జాప్యం జరుగుతోందని, రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మొత్తాన్ని కేటాయించాలని కోరారు. పరిపాలనా సౌలభ్యంకోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిందని, ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున కేంద్రీయ, నవోదయ విద్యాలయాలను కేటాయించాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు విజ్ఞప్తి చేశారు. విద్యాభివృద్ధి కోసం ఏర్పడిన కేంద్ర సలహా మండలి (కేబ్) 65వ సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన 'దేశంలో బాలికా విద్య స్థితిగతులు' అనే అంశంపై మధ్యంతర నివేదికను కేంద్ర మంత్రికి సమర్పించారు. వచ్చే నెల చివరికి తుది నివేదిక సమర్పించనున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన 'కేబ్' సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బాలికల విద్యావకాశాలు, ప్రమాణాల పెంపుకు సంబంధించి ఏర్పడిన ఉప కమిటీకి తాను ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నానని, బాలికా విద్యాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, వాటి ఫలాలు, డ్రాపవుట్‌లకు గల కారణాలు, తీసుకోవాల్సిన చర్యలు, నిధుల కేటాయింపు... ఇలా పలు అంశాలను మధ్యంతర నివేదికలో పొందుపర్చినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బాలికల విద్య కోసం చేపట్టిన పథకాలను కేంద్ర మంత్రి ప్రశంసించినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి 296 గురుకుల పాఠశాలలు ఉంటే, ఇప్పుడు అది 470కు పెరిగిందని, తాజాగా 53 గురుకుల డిగ్రీ కళాశాలలు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. తెలంగాణ అమలుచేస్తున్న పథకాల వలన బాలికల డ్రాపవుట్‌లు తగ్గాయని, గురుకుల పాఠశాలలకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానం వలన విద్యార్థుల గైర్హాజరు తగ్గిందని, పాఠశాలల్లో బోగస్ ప్రవేశాలు బందయ్యాయని తెలిపారు. గతంలో ఇంటర్ సీట్ల కంటే ఇంజినీరింగ్ సీట్లు ఎక్కువగా ఉండేవని, ఫలితంగా ఇంజనీరింగ్ విద్యలో ప్రమాణాలు పడిపోయాయని, ఇప్పుడు క్రమబద్ధీకరించడం వలన ప్రతిభ ఉన్న విద్యార్థులకే అవకాశాలు లభిస్తున్నట్లు తెలిపారు. ఇన్ని మంచి ఫలితాలు వచ్చినందువల్ల రాష్ట్ర విజ్ఞప్తులకు స్పందించి నిధుల్ని, అనుమతుల్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరానని, ఆయన కూడా సానుకూలంగా స్పందించారని కడియం శ్రీహరి పేర్కొన్నారు.

జస్టిస్ మిశ్రా కంటతడి



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు పధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో జరిగిన అనధికారిక సమావేశంలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్ మిశ్రా కంటతడి పెట్టారు. జస్టిస్ లోయా మృతి కేసు లో తనను ఆ నలుగురు న్యాయమూర్తులు అనవసరంగా లక్ష్యంగా చేసుకున్నారని, తన చిత్తశుద్ధిని శంకించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిజెఐపై తిరుగుబాటు చేసిన ఆ నలుగురు జడ్జీలు అరుణ్ మిశ్రా పేరును ప్రస్తావించకపోయినా ఆయన వాదనలు విన్న జస్టిస్ లోయా మృతి కేసుపై పరోక్షంగా అనుమానాలు వ్యక్తం చేశారు. తాను ఎంతో కష్టపడి పని చేస్తున్నానని, తనపై పని భారం కూడా చాలా ఉన్నదని ఈ సందర్భంగా అరుణ్ మిశ్రా అన్నారు. గతంలో ఉన్న సిజెఐలు టిఎస్ ఠాకూర్, జెఎస్ ఖేహర్ కూడా తనకు ఎన్నో క్లిష్టమైన కేసులను అప్పగించారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అరుణ్ మిశ్రా కం టతడి పెట్టడంతో దీపక్ మిశ్రా వెంటనే ఆయనను తన చాంబర్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంలో అక్కడే ఉన్న జస్టిస్ చలమేశ్వర్, అరుణ్ మిశ్రా ను ఓదార్చే ప్రయత్నం చేశారు.

చత్తీస్ గఢ్‌లో రోడ్ల భద్రతకు మహిళా కమాండోలు

రాయ్‌పూర్: చత్తీస్ గఢ్‌లో మావోయిస్టులు చురుకుగా ఉన్న ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం పనులు సురక్షితంగా జరగడానికి మహిళా కమాండోల పర్యవేక్షణ ఆ రాష్ట్రం నియమిస్తోంది. దక్షిణ చత్తీస్ గఢ్‌లోని బస్తర్ జిల్లాలో ఒక రోడ్ ఓపెనింగ్ పార్టీలో అందరూ మహిళా పోలీస్ కమాండోలే ఉన్నారు. దక్షిణ సుక్మా వద్ద 60 మంది మహిళా కమాండోలను రోడ్ భద్రతకు ఇటీవల నియమించారు. అక్కడ గత ఏప్రిల్‌లో మావోయిస్టుల మెరుపు దాడి లో 25 మంది సిఆర్‌పిఎఫ్ కమాండోలు మరణించారు. ఆ దాడిలో పాల్గొన్న రెబెల్స్‌లో 60 శాతం మంది మహిళలే. అందుకే మహిళా కమాండోల నియామకానికి ప్రాముఖ్యత పెరిగింది.

మేజర్ల కులాంతర వివాహాలను ప్రశ్నించడం తగదు

కులాంతర జంటలపై ఖాఫ్ తీర్పులు చట్ట వ్యతిరేకం : సుప్రీం

న్యూఢిల్లీ: మైనారిటీ తీరిన పురుషుడు, స్త్రీ కులాంతర వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటే వారిపై ఖాఫ్ పంచాయితీలు గాని, ఇతర సంఘాలుగాని దాడి చేయడం పూర్తిగా చట్ట వ్యతిరేకమని సుప్రీంకోర్టు మంగళవారం నాడు ప్రకటించింది. వారిరువురూ వివాహం చేసుకుంటే ప్రశ్నించడానికి ఖాఫ్ పంచాయతీ లేదా వ్యక్తి లేదా సమాజానికి ఎటువంటి హక్కు లేదనీ అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎఎం ఖాన్‌మిల్కర్, డివై చంద్రచూడ్‌తో కూడిన బెంచ్ ఈ కేసులో కేంద్రానికి నోటీసు జారీ చేసింది. కుటుంబ గౌరవం పేరుతో నవ వధూవరులను కులాంతర, గోత్రాంతర వివాహం చేసుకున్నందుకు వేధించడం, చంపడం జరగకుండా నిరోధించడానికి ఇంతకు ముందు ఎమికస్ క్యూరీ (కోర్టు మిత్రుడు) రాజు రామచంద్రన్ ఇచ్చిన సూచనలపై స్పందించవలసిందిగా కేంద్రాన్ని సుప్రీం కోర్టు బెంచ్ కోరింది. ఖాఫ్ గురించి ఎమికస్ క్యూరీ ఏమి చెప్పినప్పటికీ దానితో మాకు సంబంధం లేదు. మైనారిటీ తీరిన పురుషుడు, స్త్రీ పెళ్లాడితే ఖాఫ్‌కుగాని, మరి ఏ ఇతరులకుగాని ప్రశ్నించే హక్కు లేదన్నదే మా అభిప్రాయం' అని బెంచ్ స్పష్టం చేసింది. అలా పెళ్లి చేసుకున్న యువతి లేదా యువకుడిపై మూకుమ్మడిగా దాడి జరిగితే అది చట్ట విరుద్ధం అని సందేహాలకు తావులేకుండా బెంచ్ ప్రకటించింది. ఇంతకు ముందు ఒక ఎన్‌జిఒ సంస్థ 'శక్తి వాహిని, ఎమికస్ క్యూరీ నుండి ఈ అంశంలో ఖాఫ్ పంచాయత్‌ల తీరుపై అభిప్రాయాలను కోర్టు కోరింది. ఖాఫ్‌లు గ్రామాలలో సాధారణంగా కులవారీ సంఘాలనీ, ఒకోసారి అవి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పురాతన ఆనవాయితీలకు అనుగుణంగా శిక్షలు విధిస్తుంటాయని జవాబు వచ్చింది. సాధారణంగా ఆ శిక్షలు చాలా కఠినంగా, ఒకోసారి హత్యలకు దారితీసేవిగా కూడా ఉండడం రివాజు. 2010లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ అంశంలో మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టుకు ఎన్‌జిఒ సంస్థ అపీల్ దాఖలు చేసింది. ఖాఫ్ పంచాయితీలను తమ వాదన వినిపించవలసిందిగా ఇంతకు ముందు కోర్టు ఆహ్వానించింది. మహిళలపై ఖాఫ్ పంచాయితీల నేరాలను పర్యవేక్షించడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సుప్రీం కోర్టుకు కేంద్రం విజ్ఞప్తి చేసింది. హరియానా, ఉత్తర ప్రదేశ్‌లలో ఖాఫ్ పంచాయితీలు చురుకుగా ఉన్న మూడు జిల్లాలలో పరిస్థితి అంచనా వేయడానికి ఒక పథకాన్ని సుప్రీంకోర్టు సూచించింది. రోహతక్ , జింద్ (హరియానా), బాగ్‌పత్ (యుపి) జిల్లాల సూపరింటెండెంట్లను సుప్రీంకోర్టు సమన్ చేసింది.

చదువులు కావవి.. చట్టుబండలు

• ఏళ్లపాటు చదివినా ఏమీ తెలియదు! • విషయ జ్ఞానంలో మన గ్రామీణ యువత సున్నా!



న్యూఢిల్లీ: 14–16 వయస్సున్న దేశంలోని యువతలో నాలుగింట ఒక వంతు మందికి తమ స్వీయ భాషలో తడుముకోకుండా సునాయాసంగా చదవడం రాదు. వారిలో 57 శాతం మంది మామూలు లెక్కలు (కూడికలు, భాగహారాలు) చేయలేకపోతున్నారు. మంగళవారం నాడు గ్రామీణ విద్యపై విడుదలయిన తాజా నివేదిక ఈ వివరాలు అందించింది. భారత దేశపు మ్యాప్‌ను చూపిస్తే 14 శాతం మంది అదేమిటో చెప్పలేకపోయారు. 36 శాతం మందికి దేశ రాజధాని పేరు తెలియదు. 21 శాతం మంది తాము ఏ రాష్ట్రంలో నివసిస్తున్నామో చెప్పలేకపోయారు. దీనిని బట్టి గ్రామీణ భారతంలో విద్యా ప్రమాణాలు ఎంత హీనంగా ఉన్నాయో ఊహించుకోవచ్చు. 40 శాతం యువతకు తాము పైకి రావాలనుకుంటున్న రంగం ఏదో, దాని నిష్ణాతులెవరో తెలియనే తెలియదు. ఈ స్థితి ఆందోళన కరంగా ఉందని, ఏమి చేయాలన్నది తెలియడం లేదని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వాపోయారు. ఈ విషయంలో బాలురు గాని, బాలికలుగాని ఒకేలా ఉన్నారు. ముఖ్యంగా 14–18 వయో బృందంలో బాలురు, బాలికల మధ్య చిన్న తేడా కనబడుతోంది. ఇక ఆ వయస్సువారిలో బాలురిలో ఎన్‌రోల్‌మెంట్ కాకపోవడం 28 శాతం దాకా ఉండగా, బాలికల్లో అది 32 శాతం. 44 శాతం మందికి లెక్కించడం సరిగా రాదు. కిలో గ్రాములలో లెక్క వారికి తెలియదు. రోజువారి అవసరమైన టైం ఎంతయింది అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేని వారు 40 శాతం దాకా ఉన్నారు. 2017 గ్రామీణ భారత విద్యా వార్షిక నివేదిక కోసం ఈ సర్వే 24 రాష్ట్రాలలోని 28 జిల్లాల్లో జరిగింది. 2000 మంది వలంటీర్లు మొత్తం 1641 గ్రామాలలో 25,000 కుటుంబాలను సందర్శించి ఈ అధ్యయనం సాగించారు. 14 ఏళ్ల వారిలో 53 శాతం మంది మాత్రమే ఒక ఇంగ్లీషు వ్యాక్యాన్ని సవ్యంగా చదవగలుగుతున్నారు. 18 ఏళ్ల యువతలో ఈ శాతం 60కి దగ్గరగా ఉంది. ఇంగ్లీషు వాక్యం చదవగల వారిలో 79 శాతం దాకా యువత అర్థాన్ని చెప్పగలుగుతోంది. ఎనిమిదేళ్లపాటు విడవకుండా స్కూల్‌కు వెళ్ళిన వారిలో కూడా కనీస పరిజ్ఞానం కొరవడింది.

మన తెలంగాణ
11
హైదరాబాద్
బుధవారం
17, జనవరి 2018
www.manatelangana.news

డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు మూల విత్తనాల పంపిణీ



మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామాల్లో డిమాండ్ ఉన్న పంట రకాల మూల విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారధి అన్నారు. సరైన సయంలో విత్తన సరఫరా జరపాలని, ఇవి కూడా ప్రభుత్వ నోడల్ ఏజెన్సీలైన హాకా, టిఎస్ఎస్‌డిసి, ఎన్ఎస్‌సి, మార్క్‌ఫెడ్ మొదలగు సంస్థల ద్వారా సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో మంగళవారం విత్తన కార్పొరేషన్, వ్యవసాయ యూనివర్సిటీ అధికారులతో పార్థసారధి ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ విత్తనోత్పత్తి పథకంపై రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల పనితీరు, విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల విత్తనం రైతుకు అందిన తరువాత విత్తనోత్పత్తి పథకం కింద రైతు ఉత్పత్తి చేసిన విత్తనాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఇవే విత్తనాలను తిరిగి తరువాతి పంట కాలంలో వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేసే విధంగా పటిష్ఠమైన విధివిధానాలను రూపకల్పన చేయాలని సూచించారు. రైతు ఉత్పత్తి చేస్తున్న విత్తన పంటలను సరైన సమయంలో ధ్రువీకరణ అధికారులతో తనిఖీ చేసి నాణ్యమైన ధ్రువీకరణ విత్తనం రైతుఉ అందుబాటులో ఉండే విధంగా విధివిధానాలు రూపకల్పన చేస్తామని విత్తన ధ్రువీకరణ సంచాలకులు కె. కేశవులు తెలిపారు.

ఎల్‌ఓసి వద్ద కాల్పులు నలుగురు పాక్ సైనికులు మృతి

ఇస్లామాబాద్ : భారత నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద సరిహద్దులో జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు పాక్ సైనికులు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. అయితే, ప్రతిగా తమ సైనికులు జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు సైనికులు చనిపోయినట్టు పాకిస్తాన్ ప్రకటించింది. తమ సైనికులను కాల్చిచంపడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ భారత్ డిప్యూటీ హై కమిషనర్ జెపి సింగ్ పాక్ విదేశాంగ అధికారి సమ్మన్లు జారీ చేశారు. కోటిల్ సెక్టార్ జాంద్రాట్ ప్రాంతంలో ఎల్‌ఓసి వెంబడి తమ సైనికులు విధుల్లో ఉండగా భారత్ బలగాలు అకస్మాత్తుగా హెవీ మోర్టర్లతో దాడి చేశాయని సైనిక మీడియా విభాగమైన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ పేర్కొంది. ఈ సందర్భంగా నలుగురు పాక్ సైనికులు అక్కడికక్కడే మృతి చెందగా, ఎదురు కాల్పుల్లో ముగ్గురు భారత సైనికులు చనిపోయారని పేర్కొంది. అయితే, ఎదురు కాల్పుల్లో ఏడుగురు పాక్ సైనికులు చనిపోయినట్టు భారత్ ప్రకటించింది. మరోవైపు చనిపోయింది ఏడుగురు కాదని.. నలుగురే అని పాక్ చెప్పుకుంటోంది. మిగతా ముగ్గురు భారత జవాన్లేనని పేర్కొంది. 'నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం కాల్పులు జరిపింది. అయితే ఆ కాల్పులను పాక్ తిప్పికొట్టింది. ఈ ఘటనలో నలుగురు జవాన్లు మృతిచెందారు. మరో ముగ్గురు భారత సైనికులు కూడా మరణించారు' అని పాక్ ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ పేర్కొంది.


జిన్‌పింగ్‌తో ట్రంప్ టెలిఫోన్ సంభాషణ

బీజింగ్ : చైనా అధ్యక్షుడు జియా జిన్‌పింగ్ మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో టెలిఫోన్‌లో సంభాషించారు. ప్రధానంగా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు మెరుగుదలపై ఆగిపోయిన చర్చను పునఃప్రారంభానికి సంబంధించి ఇరువురి మధ్య సంభాషణ జరిగింది. చైనాకు వ్యతిరేకంగా ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భంలో ఈ చర్చలు సాగడం గమనార్హం. గత కొన్ని మాసాలుగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో మంగళవారం ఇరు దేశాల అధినేతలు ద్వైపాక్షిక వ్యాపారంపై చర్చించారు. కొరియన్ పెనున్సులా, ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య సంప్రదింపులు వంటి అంశాలపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్టు చైనా విదేశాంగ అధికార ప్రతినిధి లు కంగ్ తెలిపారు.

కన్నవాళ్ల కర్కశత్వం

కాలిఫోర్నియా : అమెరికాలో 13 మంది పిల్లలను గృహనిర్బంధం చేసిన ఓ జంటను పోలీసులు అరెస్టు చేశారు. కాలిఫోర్నియాలో ఆ పిల్లల తల్లితండ్రులను అదుపులోకి తీసుకున్నారు. 13 మంది చేతులను తాళ్లతో కట్టివేసి, వాళ్లను మంచాలకు కట్టేశారు. ఈ కేసులో 57 ఏళ్ల డేవిడ్ అల్లెన్ టూరిన్, 49 ఏళ్ల అన్నా టర్పిన్ దంపతులను అరెస్టు చేశారు. చిత్రహింస కేసులో వీరిని అదుపులోకి తీసుకున్నారు. పిల్లల వయసు రెండేళ్ల నుంచి 29 ఏళ్ల వరకు ఉన్నట్లు సమాచారం. లాస్ ఏంజిల్స్‌కు సమీపంలో ఈ ఘటన జరిగింది. 17 ఏళ్ల అమ్మాయి ఒకరు పోలీసులకు ఫోన్ చేయడంతో ఈ ఘటన బయటపడింది. చాలా చీకటి ప్రదేశంలో పిల్లల్ని ఆ తల్లితండ్రులు దాచిపెట్టారు. అయితే పిల్లల్ని ఎందుకు అలా కట్టేశారన్న దానిపై పేరెంట్స్ వివరణ ఇవ్వలేకపోయారు. ఆ పిల్లల్లో సుమారు ఏడు మంది పెద్దవాళ్లే. వాళ్ల వయసు 18 నుంచి 29 వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. బాధితులంతా తిండిలేక బలహీనంగా ఉన్నారని, అందర్నీ స్థానిక హాస్పటల్‌లో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు. పిల్లల సంఖ్య పెరిగిపోవడం, భార్యకు ఉద్యోగం లేకపోవడం, పిల్లల పోషణ కష్టంగా మారడంతో టూరిన్ వాళ్లను ఇంట్లో కట్టిపడేసినట్లు తెలుస్తోంది.

మైనర్ బాలికపై గ్యాంగ్‌రేప్



హమీర్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో దారుణం జరిగింది. మజగవ ప్రాంతంలో 16 ఏళ్ల బాలికపై తన ఇంట్లోనే ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో ఆ బాలిక తనకు తానుగా ఒంటికి నిప్పంటించుకొని ఆత్మాహుతి చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం కొత్త గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుందని ఎస్‌పి దినేష్ కుమార్ చెప్పారు. ఇదే గ్రామాకి చెందిన ఇద్దరు ఇద్దరు అన్నదమ్ముళ్లు బాలికపై అత్యాచారం చేశారన్నారు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న బాలిక తండ్రి వెళ్లగా, ఆమె తల్లి మకర సంక్రాంతి జరుపుకునేందుకు బంధువుల ఇంటికి వెళ్లిందని, ఇంట్లో బాలిక మాత్రమే ఉండడంతో నిందితులు ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. తీవ్ర మనోవేదనకు గురైన ఆ బాలిక ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుందన్నారు. ఈ మేరకు బాలిక తండ్రి ఫిర్యాదు చేశారని, విషయాన్ని గమనించిన తన కుమారుడు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా, నిందితుడు అతన్ని గాయపర్చాడని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌పి వెల్లడించారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఇద్దరిలో ఒకరు అరెస్టు కాగా, మరొకరు పరారీలో ఉన్నాడన్నారు.


ఇళ్లల్లోకి ప్రవేశించి సరుకులు ఎత్తుకెళ్లిన అనుమానిత నక్సలైట్లు

మంగళూరు: కర్నాటలోని దక్షిణ కర్నాటక జిల్లాలో అనుమానిత నక్సలైట్లు ఇళ్లలోకి చొరబడి సరుకులు అపహరించారు. అడ్డహోల్ అటవీ సమీపంలో శిరాడిలో జనవరి 14న ముగ్గురు సాయుధులైన నక్సలైట్లు ఇళ్లల్లోకి చొరబడి కిరాణా సామాన్లు ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఆ బృందంలో మహిళా సభ్యురాలు ఉన్నారని, వారు ఎవ్వరనేది ఇంకా స్పష్టం కాలేదని జిల్లా ఎస్‌పి సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసి, నక్సలైట్ల కోసం గాలింపు చేపట్టామని ఆయన తెలిపారు. బృంద సభ్యుల వయసు 30–35 మధ్య ఉందని, వారంతా ఆయుధాలు ధరించి ఉన్నారని స్థానికులు తెలిపారు. సాయంత్రం గ్రామంలోకి ప్రవేశించిన ముగ్గురు సాయుధులు, ఇళ్లల్లో నుంచి ఆహారం, బియ్యం, చక్కెర, కూరగాయలు సహా పలు సరుకులు తీసుకెళ్లారని తెలిపారు.

తమిళ మత్స్యకారుల అరెస్ట్

రామేశ్వరం: కచ్చతీవు ద్వీపం సమీపంలోని తమ ప్రాదేశిక జలాల్లో చేపలు పడుతున్నారనే ఆరోపనలతో 16 మంది తమిళ మత్స్యకారులను మంగళవారం శ్రీలంక అరెస్ట్ చేసింది. మండపం, రామేశ్వరం నుంచి 2500 మందికి పైగా మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. కచ్చతీవు సమీపంలో శ్రీలంక నావికాదళం వారిని వెంబడించి, 100 పడవల నుంచి చేపల వలలను స్వాధీనం చేసుకుందని మండపం ఫిషరీష్ అసిస్టెంట్ డైరెక్టర్ గోపినాథ్ తెలిపారు. ఈ ఘటనలో 16 మందిని అరెస్ట్ చేసిన నావికాదళం, నాలుగు పడవలను స్వాధీనం చేసుకుంది. తమిళ జాలర్లను తరచుగా అరెస్ట్ చేయడంపై రామేశ్వరం ఫిషరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి శేషురాజ ఖండించారు. పాక్‌జలసంధిలోని సాంప్రదాయ జలాల్లో చేపలు పట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన అభ్యర్థించారు. కచ్చతీవులోని తమ ప్రాదేశిక జలాల్లో చేపలు పడుతున్నారనే ఆరోపణలతో 3500 మంది భారత మత్స్యకారులను శ్రీలంక నావికాదళం వెంబడించి, పలు పడవలను ధ్వంసం చేసింది. 50 పడవల్లోని చేపల వలలను లాక్కెళ్లింది.

'జల్లికట్టు'కు ముగ్గురు బలి



చెన్నై : తమిళనాడు సంప్రదాయక ఎద్దుల క్రీడ 'జల్లికట్టు'లో అపశృతులు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో జల్లికట్టును నిర్వహిస్తుండగా క్రీడను వీక్షిస్తున్న ప్రేక్షకులపై ఎద్దులు దాడి చేశాయి. దీంతో ముగ్గురు మృత్యువాత పడగా, అనేక మంది క్షతగాత్రులయ్యారు. శివగంగ జిల్లాలోని ఓ గ్రామంలో క్రీడ సందర్భంగా ఎద్దులను వదులుతుండగా అవి ప్రేక్షకులపై దాడి చేశాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. దాదాపు మరో 50 మంది గాయపడ్డారు. అదే విధంగా త్రిచే జిల్లాలోనూ ఈ తరహా ఘటన జరిగి మరో వ్యక్తి మరణించాడు. కాగా, మదురై జిల్లా అలంగనల్లూర్‌లో ముఖ్యమంత్రి కె.పళని స్వామి, ఉప ముఖ్యమంత్రి ఓ. పన్నీర్ సెల్వం జెండా ఊపి జల్లికట్టును ప్రారంభించారు. ఈ వేడుకలో దాదాపు వెయ్యి ఎద్దులు, 1200 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో జల్లికట్టు పొంగల్ పండుగలో భాగంగా సంప్రదాయకంగా కొనసాగుతోంది. ఈ క్రీడలో నిర్ణీత సమయంలోగా ఎవరు ఎద్దులను మచ్చిక చేసుకుంటే వారే విజేతలు. వారికి బహుమతిగా నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఇతర వస్తువులను బహూకరిస్తారు. ఈ ఏడాది అల్లంగనల్లూర్‌లో జరుగుతున్న క్రీడలో గెలుపొందిన వారికి బహూకరించేందుకు బహుమతుల జాబితాలో రెండు కార్లు కూడా చేరాయి. అయితే ఈ క్రీడపై గతంలో నిషేధం విధించగా, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడంతో మళ్లీ అనుమతించారు. ఈనెల 14న మధురైలో మొదటి జల్లికట్టును నిర్వహించారు.

గురుకుల అతిథి పంతుళ్లను క్రమబద్ధీకరించాలి



మన తెలంగాణ/హైదరాబాద్: తక్కువ జీతం, కొన్ని పని గంటల కోసమే నియమితులైన అతిథి ఉపాధ్యాయులను శాశ్వత ఉపాధ్యాయులతో సమానంగా పని చేయిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. భుజం గరావు అన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల అతిథి ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 బిసి గురుకులాల్లో సుమారు 850 మంది అతిథి ఉపాధ్యాయులు గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారితో 24 గంటలూ చాకిరి చేయిస్తూ, కేవలం రూ.14వేల వేతనాన్ని చెల్లిస్తున్నారన్నారు. శాశ్వత ఉపాధ్యాయులకు నెలకు రూ.45వేల వేతనాన్ని చెల్లిస్తూ, సమానంగా పనిచేస్తున్న అతిథి ఉపాధ్యాయులకు మాత్రం అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న అతిథి ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని, వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేపల్లిఆదిరెడ్డి మాట్లాడుతూ అతిథి ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలల అతిథి ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు గోవర్దన్ సదస్సుకు అధ్యక్షత వహించగా ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సదానంద్‌గౌడ్, కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, అతిథి ఉపాధ్యాయుల సంఘం నాయకులు సయ్యద్ గౌస్, దయాకర్‌రావు, హర్షవర్ధన్,సైదమ్మ, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్‌తో ఆర్‌టిసి చైర్మన్ భేటీ



మన తెలంగాణ / హైదరాబాద్ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు టెయిల్ ఎండ్‌లో ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ఉద్దేశించిన శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం పనులకు పరిపాలనాపరమైన అనుమతులు మం జూరు చేయడంతోపాటు రూ. 75.74 కోట్ల మేరకు నిధులు విడుదల చేయడానికి అనుమతించినందుకు సిఎం కెసిఆర్‌కు తెలంగాణ ఆర్‌టిసి చైర్మన్ (రామగుండం ఎంఎల్‌ఎ కూడా) సో మారపు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అనుమతుల కారణంగా సుమారు ఇరవై వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, మైనర్ సాగునీటి చెరువులకు నీరు అందుతుందని, రైతులకు ఎంతగానో ఉపయోగపడు తుందని, సకాలంలో నిర్ణ యం తీసుకుని రైతులకు తీపి వార్తను అందించారని సిఎంతో సోమారపు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఇటీవల ఎన్నికైన రంగారెడ్డి జిల్లా జవ్వాడ ఎంపిటిసి మల్లేశ్‌గౌడ్ కూడా సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌డిఎస్ ఆధునీకరణకు చొరవ

ఎపి మంత్రికి హరీశ్ రావు లేఖ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్‌డిఎస్) ఆధునీకరణ పనులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు కోరారు. ఈ మేరకు ఆయన ఎపి నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుకు లేఖ రాశారు. 2018 జులైలోగా ఆర్‌డిఎస్ ఆధునీకీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 4న తెలంగాణ పర్యటనకు వచ్చిన సమయంలో కర్ణాటక జల వనరుల శాఖ మంత్రి ఎం.బి పాటిల్ సైతం అన్ని రకాలుగా సహకరించేందుకు అంగీకరించారని చెప్పారు. ఆర్‌డిఎస్ ఆధునీకరణ పనులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు సమస్యలపై కూలంకుశంగా చర్చించేందుకు హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి హాజరయ్యేందుకు ఆ రాష్ట్ర మంత్రి పాటిల్ అంగీకరించారని తెలిపారు. ఆర్‌డిఎస్ ప్యాకేజ్ 1, ఇతర సమస్యల సమస్యలపై విస్తృతంగా చర్చించేందుకు చీఫ్ ఇంజనీరు స్థాయిలో ప్రతిపాదిత అంశాలపై చొరవ చూపినప్పటికీ, ఎపి నుంచి సరైన సానుకూల సంకేతాలు, స్పందన రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరలో తమకు ఆమోదయోగ్యమైన తేదీ రెండు రోజుల్లో తెలియజేయాలని లేఖలో సూచించారు. దే అంశంపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు కోరుతూ 2017 ఆగస్టు 8వ తేదీన కూడా ఉమాకు లేఖ రాసినట్లు గుర్తు చేశారు. మూడు రాష్ట్రాల ఆయకట్టుదారుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా అడుగులు వేసేందుకు ఎపి ప్రభుత్వం సహకారం అవసరమైనందున సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇసానుకూల స్పందన కోసం వేచిచూస్తామని మంత్రి హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో క్యాట్ ఫిష్ పట్టివేత

మన తెలంగాణ/శంషాబాద్: నిషేధిత క్యాట్ ఫిష్‌లను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం ఉదయం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కోల్‌కత్తా నుండి కర్ణాటకా (బీదర్)కు క్యాట్ ఫిష్‌లను ప్లాస్టిక్ కవర్స్‌లో నీరు పోసి చేపలను అందులో వేసి అనుమానం రాకుండా బాక్స్‌లో వేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి విమానంలో తరలించేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అయితే కస్టమ్స్ అధికారులకు అనుమానం రావడంతో వచ్చిన పార్సిల్ బాక్స్‌లను తనిఖీ చేయగా క్యాట్ ఫిష్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారు తరలించడానికి యత్నించిన 44 క్యాట్ ఫిష్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. వీటిని రాజేంద్రనగర్‌లోని ఫిషర్ భవనానికి తరలించినట్లు తెలిపారు.

గాలిపటం కోసం పరుగులు ....

నాలాలో పడి బాలుడి మృతి

మన తెలంగాణ/హైదరాబాద్/ పంజాగుట్ట: తెగిన గాలి పటం కనిపించడంతో దానిని పట్టుకునేందుకు వెళ్ళిన బాలుడు నాలాలో పడి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .... మసాబ్ ట్యాంక్ ఫస్ట్ లాన్సర్ ప్రాంతానికి చెందిన లుక్‌మాన్ (5) అనే చిన్నారి సంక్రాంతి పండుగ సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం సనత్‌నగర్‌లోని ఇందిరాగాంధీపురంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం ఆకాశంలో పతంగులు ఎగురుతుండటంతో ఆరు బయట ఆడుకోవడానికి వచ్చాడు. తన అమ్మమ్మ ఇంటి సమీపంలో ఉన్న ధనియాల గుట్ట నాలా వద్ద ఆడుకుంటుండగా పైనుంచి గాలిలో తెగిన గాలి పటం కనిపించడంతో దానిని పట్టుకునేందుకు వెళ్ళిన లుక్‌మాన్ పక్కన నాలా ను గమనించకుండానే అజాగ్రత్తగా పరుగులు తీయడంతో అందులో కాలు జారి పడ్డాడు. దీంతో అతను నాలా ప్రవాహంలో కొట్టుకొని పోయాడు. దీనిని గమనించిన స్థానికులు అతనిని నాలా నుంచి బయటకు తీసేలోపే చిన్నారి మృతి చెందాడు. కాగా ఈ విషయంలో కుటుంబ సభ్యులనుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గవర్నర్‌పై అసంతృప్త గళాలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్ తీరుపై బిజెపి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణను గవర్నర్ పట్టించుకోవడం లేదని తెలంగాణ నేతలు చెబుతుండగా, ప్రస్తుత గవర్నర్ తెలంగాణకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌ను పట్టించుకోవడం లేదని కేంద్రంలో ఎపి బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాలకు చెందిన బిజెపి నేతలు గవర్నర్ పనితీరుపై అసంతృప్తి గళం విప్పడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయంశంగా మారింది. మొన్నటి వరకు ఎపి ఎంఎల్‌ఎ విష్ణుకుమార్ రాజు అసంతృప్తి వ్యక్తం చేయగా, తాజాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిజెపి ఎంపి డాక్టర్ కంభంపాటి హరిబాబు ఎపికి నూతన గవర్నర్‌ను నియమించాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖ రాయడం మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలు అన్ని శాఖలు విజయవాడ కేంద్రంగా పని చేస్తున్నాయని, అలాగే ఎపికి ప్రత్యేక హైకోర్టు కూడా ఏర్పాటు కానుందని, ఇలాంటి నేపథ్యంలో ఎపికి నూతన గవర్నర్‌ను నియమించాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కాగా విష్ణుకుమార్ రాజు ఎపికి గవర్నర్ చుట్టపుచూపుగా వస్తున్న నేపథ్యంలో బడ్జెట్ సమావేశాల్లోగా ఎపికి కొత్త గవర్నర్‌ను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మరో వైపు ఇటీవల బిజెఎల్‌పి జి.కిషన్ రెడ్డి స్పందిస్తూ అనేక అంశాలపై సిఎం కెసిఆర్‌తో గంటల తరబడి చర్చించే గవర్నర్, హైదరాబాద్‌లో కనీసం నిరసన తెలిపే హక్కు లేకపోవడం, ప్రజాస్వామ్య పరిరక్షణకు విఘాతం కలుగుతున్న అంశాలపై ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. కాగా సిఎం కెసిఆర్ రాజ్‌భవన్‌కు ఎన్ని సార్లు వెళ్లారు, సచివాలయానికి ఎన్ని సార్లు వెళ్లారనే విషయమై ఆయన సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇలా ఒకేసారి రెండు రాష్ట్రాల్లో కూడా బిజెపి నేతలు గవర్నర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది.

సిఎంతో అసదుద్దీన్ భేటీ



మన తెలంగాణ / హైదరాబాద్ : మైనారిటీ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లిన హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పలు మైనారిటీ విద్యా సంస్థలు 'మైనారిటీ' హోదా గుర్తింపు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నాయని సిఎంకు వివరించారు. రాజ్యాంగంలోని '30 ఏ' అధికరణం ప్రకారం కొన్ని హక్కులు మైనారిటీ విద్యా సంస్థలకు ఉన్నప్పటికీ ఆచరణలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిఎంకు వివరించారు. ముస్లిం విద్యా సంస్థలు మాత్రమే కాకుండా క్రైస్తవ విద్యా సంస్థలకు కూడా ఈ సమస్యలు ఉన్నాయని వివరించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న సిఎం కెసిఆర్ మైనారిటీ విద్యా సంస్థలకు అవసరమైన 'మైనారిటీ సర్టిఫికెట్'లను రానున్న పదేళ్ళ వరకు వర్తించే విధంగా వెంటనే మంజూరు చేయడానికి అంగీకరించినట్లు ఎంపి అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. మైనారిటీ విద్యా సంస్థలకు ప్రభు త్వం నుంచి అందాల్సిన ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడానికి సిఎం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఒవైసీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మహిళల కోసం కొత్తగా ప్రారంభించనున్న డిగ్రీ కళాశాలలకు కూడా సిఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అసదుద్దీన్ వెంట విఆర్‌కె ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శులు మహబూబ్ ఆలం ఖాన్, షా ఆలం ఖాన్‌లతో పాటు క్రైస్తవ విద్యా సొసైటీకి చెందిన ఫాదర్ విన్సెంట్, ఆరోగ్య టెడ్డీలు కూడా సిఎం కెసిఆర్‌తో జరిగిన భేటీలో పాల్గొన్నారు.

9వ తరగతి చదువుతున్న

బాలిక ఆత్మహత్య

మన తెలంగాణ/యాలాల(వికారాబాద్ జిల్లా) : యాలాల మండలం జెక్కేపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారు. దీంతో బాలిక శరీరం తీవ్రంగా కాలింది. కాలిన గాయాలతో ఉన్న బాలిక ను స్థానికులు చికిత్స నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి యాలాల ఎస్సై 2 ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జక్కేపల్లి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ అనే బాలిక బెన్నూరులో గల ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది.అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో భాగ్యశ్రీని గత కొన్నాళ్లుగా వెంటాడుతున్నాడు. మంగళవారం సైతం ఎప్పటి మాదిరిగానే యువకుడు వెంటపడుతుండగా బాలిక మేనమామ చూశాడు. బాలికను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక ఇంట్లోకి వెళ్ళి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు బాలిక తన వాంగ్మూలంలో తెలిపినట్లు ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
బుధవారం
17, జనవరి 2018
www.manatelangana.news

కోహ్లి కంటే ఎక్కువ ధర పలకడం ఖాయం:సెహ్వాగ్

న్యూఢిల్లీ: ఐపిఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా విరాట్ కోహ్లి (బెంగళూరు) పేరిట ఉన్న రికార్డును ఈసారి వేలం పాటలో ఎవరో ఒకరూ బద్దలు కొట్టడం ఖాయమని టీమిండియా మాజీ స్టార్ వీరేంద్ర సెహ్వాగ్ జోస్యం చెప్పాడు. ఈ ఏడాది జరిగే ఐపిఎల్ మ్యాచ్‌ల కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తమ కెప్టెన్ విరాట్ కోహ్లికి 17 కోట్ల రూపాయలను చెల్లించి సొంతం చేసుకుంది. అయితే ఈ నెల 27, 28 తేదీల్లో బెంగళూరు వేదికగా జరిగే ఐపిఎల్ వేలం పాటలో కోహ్లి రికార్డు బద్దలు కావడం ఖాయమని సెహ్వాగ్ ధీమా వ్యక్తం చేశాడు. చాలా మంది స్టార్ ఐపిఎల్ వేలం పాట బరిలో ఉండడంతో వీరిని దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీ పడడం ఖాయమన్నాడు. ఇదే జరిగితే క్రికెటర్లపై కాసుల వర్షం కురుస్తుందన్నాడు. ఎవరో ఒకరూ కోహ్లిని దాటడం తథ్యమన్నాడు. గేల్, డివిలియర్స్, గంభీర్, మాక్స్‌వెల్, ఆమ్లా, యువరాజ్ సింగ్, ధావన్, సాకిబ్ వంటి స్టార్లు ఈసారి ఐపిఎల్ బరిలో నిలిచారు. దీంతో వీరిని భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకునేందుకు ఆయా ఫ్రాంచైజీలు ప్రయత్నిస్తాయని, ఈ క్రమంలో ఐపిఎల్ చరిత్రలోనే అత్యధిక పలికిన క్రికెటర్‌గా ఎవరో ఒకరు వెలుగు లోకి రావడం ఖాయమని సెహ్వాగ్ పేర్కొన్నాడు.



కష్టాల్లో టీమిండియా

- లక్ష్యం 287..
  ప్రస్తుతం 35/3
- పట్టుబిగించిన సౌతాఫ్రికా



సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత్‌కు ఓటమి ఖాయంగా కనిపిస్తోంది. 287 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన టీమిండియా మంగళవారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే కోహ్లి సేన మరో 252 పరుగులు చేయాలి. ఇప్పటికే ఓపెనర్లతో పాటు కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా పెవిలియన్ చేరాడు. పిచ్ కూడా బౌలింగ్‌కు అనుకూలంగా మారింది. ఈ పరిస్థితుల్లో భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం అనుకున్నంత తేలిక కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతేగాక సెంచూరియన్ పిచ్‌పై గతంలో ఏ జట్టు కూడా ఇంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించలేదు. అయితే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య వంటి మెరుపులు మెరిపించే బ్యాట్స్‌మెన్ ఉండడంతో భారత్ అవకాశాలను కొట్టి పారేయలేం. కానీ, ప్రస్తుతం మాత్రం మ్యాచ్ సౌతాఫ్రికా చేతిలోకి వెళ్లిందనే చెప్పాలి.

ప్రారంభంలోనే..

క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ మురళీ విజయ్ నాలుగు పరుగులు మాత్రమే చేసి రబడా వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కొద్ది సేపటికే మరో ఓపెనర్ లోకేష్ రాహుల్ కూడా వెనుదిరిగాడు. నిగిడి బౌలింగ్‌లో రాహుల్ పెవిలియన్ చేరాడు. ఆ వెంటనే కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా ఔటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో వీరోచిత సెంచరీతో భారత్‌ను ఆదుకున్న కోహ్లి ఈసారి ఐదు పరుగులకే వికెట్ పారేసుకున్నాడు. దీంతో భారత్ 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకు పోయింది. కాగా, పుజారా (11), పార్థివ్ (5) పరుగులతో క్రీజులో ఉన్నారు.

ఆదుకున్న డివిలియర్స్..

అంతకుముందు దక్షిణాఫ్రికాను డివిలియర్స్, కెప్టెన్ డుప్లెసిస్ ఆదుకున్నారు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన డివిలియర్స్ పది ఫోర్లతో 80 పరుగులు చేశాడు. మరోవైపు ఓపెనర్ ఎల్గర్ కూడా తనవంతు పాత్ర పోషించాడు. ఎల్గర్ 8 ఫోర్లు, ఒక సిక్స్‌తో 61 పరుగులు చేశాడు. కెప్టెన్ డుప్లెసిస్ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా తన పోరాటాన్ని కొనసాగించాడు. చివరికి 48 పరుగులు చేసి ఔటయ్యాడు. ఫిలాండర్ 28 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించాడు. దీంతో దక్షిణాఫ్రికా 258 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో షమి నాలుగు, బుమ్రా మూడు, ఇషాంత్ రెండు వికెట్లు పడగొట్టారు. ఇదిలావుండగా భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది. అసాధారణ పోరాట పటిమను కనబరిచిన కోహ్లి 15 ఫోర్లతో 153 పరుగులు చేశాడు. రవిచంద్రన్ అశ్విన్ (38) అతనికి అండగా నిలిచాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మోర్కెల్‌కు నాలుగు వికెట్లు లభించాయి.

స్కోరుబోర్డు:

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: డీన్ ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, ఐడెన్ మార్క్రామ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94, హాషిం ఆమ్లా రనౌట్ 82, డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20, డుప్లెసిస్ (బి) ఇషాంత్ శర్మ 63. డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, ఫిలాండర్ రనౌట్ 0, కేశవ్ మహారాజ్ (సి) పార్థివ్ పటేల్ (బి) మహ్మద్ షమి 18, రబడా (సి) హార్దిక్ (బి) ఇషాంత్ 11, మోర్నె మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, లుంగిసాని నిగిడి నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు 9, మొత్తం 113.5 ఓవర్లలో 335 ఆలౌట్.
బౌలింగ్: జస్‌ప్రిత్ బుమ్రా 22–6–60–0, మహ్మద్ షమి 15–2–58–1, ఇషాంత్ శర్మ 22–4–46–3, హార్దిక్ పాండ్య 16–4–50–0, రవిచంద్రన్ అశ్విన్ 38.5–10–113–4.
భారత్ మొదటి ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) డికాక్ (బి) మహారాజ్ 48, లోకేష్ రాహుల్ (సి) అండ్ (బి) మోర్నె మోర్కెల్ 10, చటేశ్వర్ పుజారా రనౌట్ 0, విరాట్ కోహ్లి (సి) డివిలియర్స్ (బి) మోర్కెల్ 153, రోహిత్ శర్మ ఎల్బీ (బి) రబడా 10, పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) లుంగిసాని నిగిడి 19, హార్దిక్ పాండ్య రనౌట్ 15, రవిచంద్రన్ అశ్విన్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 38, మహ్మద్ షమి (సి) ఆమ్లా (బి) మోర్కెల్ 1, ఇషాంత్ శర్మ (సి) మార్క్రామ్ (బి) మోర్కెల్ 3, బుమ్రా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 12, మొత్తం 92.1 ఓవర్లలో 307 ఆలౌట్.
బౌలింగ్: కేశవ్ మహారాజ్ 20–1–67–1, మోర్నె మోర్కెల్ 22.1–5–60–4, ఫిలాండర్ 16–3–46–1, రబడా 20–1–74–1, లుంగిసాని నిగిడి 14–2–51–1.
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్రామ్ ఎల్బీ(బి) బుమ్రా 1, ఎల్గర్ (సి) రాహుల్ (బి) షమి 61, హాషిం ఆమ్లా ఎల్బీ (బి) బుమ్రా 1, డివిలియర్స్ (సి) పార్థివ్ (బి) షమి 80, డుప్లెసిస్ (సి) అండ్ (బి) బుమ్రా 48, డికాక్ (సి) పార్థివ్ (బి) షమి 12, ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇషాంత్ 26, కేశవ్ మహారాజ్ (సి) పార్థివ్ (బి) ఇషాంత్ 6, రబడా (సి) కోహ్లి (బి) షమి 4, మోర్కెల్ నాటౌట్ 10, నిగిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 91.3 ఓవర్లలో 258 ఆలౌట్.
బౌలింగ్: రవిచంద్రన్ అశ్విన్ 29.3–6–78–1, బుమ్రా 20–3–70–3, ఇషాంత్ శర్మ 17–3–40–2, మహ్మద్ షమి 16–3–49–4, హార్దిక్ పాండ్య 9–1–14–0.
భారత్ రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ (బి) రబడా 9, లోకేష్ రాహుల్ (సి) మహారాజ్ (బి) నిగిడి 4, పుజారా (బ్యాటింగ్) 11, విరాట్ కోహ్లి ఎల్బీ (బి) నిగిడి 5, పార్థివ్ పటేల్ (బ్యాటింగ్) 5, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం 23 ఓవర్లలో 35/1.
బౌలింగ్: ఫిలాండర్ 6–3–6–0, రబడా 5–2–9–1, నిగిడి 6–2–14–2, మోర్కెల్ 5–3–4–0, కేశవ్ మహారాజ్ 1–0–1–0.

యువ జట్టుకు రెండో విజయం

- అండర్-19 వరల్డ్‌కప్



మౌంట్ మౌంగానూయి: అండర్–19 ప్రపంచకప్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మంగళవారం పాపువా న్యూ గునియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకు ముందు ఆస్ట్రేలియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో కూడా యువ జట్టు జయభేరి మోగించిన విషయం తెలిసిందే. ముందుగా బ్యాటింగ్ చేసిన పాపువా న్యూ గునియా 21.5 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. జట్టులో ముగ్గురు మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. ఓపెనర్‌గా వచ్చిన సమోన్ అటల్ (13), ఓవియా శామ్ (15), సినకా అరువా (12) మాత్రమే డబుల్ డిజిట్ మార్క్‌కు చేరుకున్నారు. ఎక్స్‌ట్రాల రూపంలో 12 పరుగులు లభించాయి. భారత బౌలర్లలో అనుకుల్ సుధాకర్ రాయ్ అద్భుత బౌలింగ్‌ను కనబరిచాడు. అసాధారణ రీతిలో చెలరేగిన రాయ్ 6.5 ఓవర్లలో 14 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు తీశాడు. శివమ్ రెండు వికెట్లు తీసి తనవంతు పాత్ర పోషించాడు. రాయ్ ధాటిగా పాపువా న్యూ గునియా జట్టు ఏ దశలోనూ కోలుకోలేక పోయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 8 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండానే లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ పృథ్వీ షా 12 ఫోర్లతో 39 బంతుల్లోనే 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ మరో 42 ఓవర్లు మిగిలివుండగానే విజయాన్ని అందుకుంది.

జూన్‌లో అఫ్గాన్ టెస్టు ప్రస్థానం షురూ



- బెంగళూరు వేదికగా
  భారత్‌తో తొలి టెస్టు

దుబాయి: అఫ్గానిస్థాన్ తన టెస్టు ప్రస్థానాన్ని బెంగళూరులో ప్రారంభించనుంది. భారత్‌తో జూన్ 14 నుంచి బెంగళూరు వేదికగా అఫ్గాన్ తన తొలి టెస్టు మ్యాచ్‌ను ఆడనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారికంగా ధ్రువీకరించింది. అఫ్గాన్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో భారత్‌తో తన తొలి టెస్టు మ్యాచ్‌ను ఆడుతుంది. అఫ్గాన్‌కు టెస్టు హోదా కల్పిస్తూ కిందటి ఏడాదే ఐసిసి సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాగా, అఫ్గాన్ మాత్రం భారత్‌తోనే తన తొలి మ్యాచ్ ఆడాలనే కోరికను వెల్లడించింది. భారత్ అంటే తమకు ఎంతో గౌరవమని తమ టెస్టు ప్రస్థానాన్ని భారత్‌తోనే ప్రారంభించేందుకు అనుమతించాలని అఫ్గాన్ బోర్డు ఐసిసిని కోరింది. దీనికి సమ్మతించిన ఐసిసి భారత్‌తోనే తొలి టెస్టు మ్యాచ్ ఆడేందుకు అఫ్గాన్‌కు అనుమతి ఇచ్చింది. కాగా, ఇప్పటికే వన్డేల్లో, టి–20లలో అఫ్గాన్ మెరుగైన జట్టుగా పేరు తెచ్చుకుంది. అంతేగాక 2016 టి–20 ప్రపంచకప్‌లో విండీస్‌పై సంచలన విజయం సాధించింది. కాగా, భారత్‌తో తొలి టెస్టు ఆడనుండడంపై అఫ్గాన్ క్రికెట్ జట్టు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ అభిమాన జట్టుతో టెస్టు ప్రస్థానాన్ని ప్రారంభించడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు ఆ కెప్టెన్ నబి, స్టార్ బౌలర్ రషేద్ ఖాన్ తదితరులు పేర్కొన్నారు.

ఐర్లాండ్ జయకేతనం

దుబాయి: ముక్కోణపు సిరీస్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ ఆరు వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 219 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ఐర్లాండ్ మరో15.1 ఓవర్లు మిగిలివుండగానే నాలుగు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. కెప్టెన్ విలియన్ పోర్టర్‌ఫీల్డ్ ఇన్నింగ్స్ రెండో బంతికే పెవిలియన్ చేరాడు. అయితే మరో ఓపెనర్ పాల్ స్టిర్లింగ్‌తో కలిసి ఆండ్రూ బాల్బిమి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన స్టిర్లింగ్ 4 ఫోర్లతో 38 పరుగులు చేసి ఔటయ్యాడు. ధాటిగా ఆడిన ఆండ్రూ పది ఫోర్లు, ఒక సిక్స్‌తో 67 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ నీల్ ఓబ్రియాన్ కూడా అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 55 పరుగులు సాధించాడు. చివర్లో జోయ్సె అజేయంగా 31 పరుగులు చేయడంతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. అంతకు ముందు స్కాట్లాండ్ 219 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. ఓపెనర్ మైఖేల్ జోర్స్ 9 ఫోర్లతో 87 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. మిగతావారిలో కాలమ్ మెక్‌లాయిడ్ (33), వికెట్ కీపర్ క్రెగ్ వలాసె (34) మాత్రమే రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో రాన్‌కిన్ మూడు, మెక్ కార్టిన్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు.

నాదల్, జొకోవిచ్ శుభారంభం

రెండో రౌండ్‌లో ఫెదరర్, హలెప్, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి క్రీడాకారులు రఫెల్ నాదల్(స్పెయిన్), రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), నొవాక్ జొకొవిచ్ (సెర్బియా) శుభారం భం చేశారు. మహిళల సింగిల్స్‌లో నంబ ర్ క్రీడాకారిణి సిమోనా హలెప్ (రుమేనియా), ఆరోసీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) రెండో రౌండ్‌కు చేరుకున్నారు. అయితే అమెరికా వెటరన్ క్రీడాకారిణి వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. పురుషల సింగిల్స్‌లో స్విట్లర్లాండ్ స్టార్ వావ్రింకా, నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మని) రెండో రౌండ్‌కు చేరుకున్నారు. తొలి రౌం డ్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీ డ్ నాదల్ 6–1, 6–1, 6–1 తేడాతో డొమినికా రిపబ్లిక్‌కు చెందిన విక్టర్ బుర్గోస్‌ను చిత్తు చేశాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన నాదల్ ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. సు నాయాస విజయంతో సీజన్‌కు శ్రీకారం చు ట్టాడు. ఇక, డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ రోజర్ ఫెదరర్ కూడా తొలి రౌండ్‌లో సునాయాస గెలుపును అందుకున్నాడు. మొ దటి రౌండ్‌లో ఫెదరర్ 6–3, 6–4, 6–3 తే డాతో స్లోవేకియా ఆటగాడు బెడెనెను ఓడించాడు. మరో పోటీలో ఐదో సీడ్ డొమినిక్ థీమ్ విజయం సాధించాడు. జి. పెల్లాతో జరిగిన పోరులో థీమ్ 6–4, 6–4, 6–3తో జయభేరి మోగించాడు. మరోవైపు 12వ సీడ్ డెల్‌పొట్రో కూడా తొలి రౌండ్‌లో సునాయాస విజయాన్ని దక్కించుకున్నాడు. టియాఫొయెతో జరిగి న మ్యాచ్‌లో డెల్‌పొట్రో 6–3, 6–4, 6–3తో విజయం సాధించాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6–1, 7–5, 7–5తో ఇటలీ క్రీడాకారుడు ఫాబియాన్‌ను చిత్తు చేశాడు. ఇక, మాజీ చాంపియన్ జొకొవిచ్ కూడా మొదటి రౌండ్‌లో సులువుగా విజయం సాధించాడు. చాలా రోజుల తర్వా త మళ్లీ రాకెట్ చేత పట్టిన జొకొవిచ్ తొలి రౌండ్‌లో అమెరికా ఆటగాడ డియంగ్‌ను చిత్తు చేశాడు. ఏక పక్షంగా సాగిన మ్యాచ్‌లో జొకొవిచ్ 6–1, 6–2, 6–4తో విజయం సాధించాడు.



హలెప్ ముందంజ..

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా) శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో హలెప్ 7–6, 6–1 తేడాతో ఐవాను ఓడించింది. తొలి సెట్‌లో కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్న హలెప్ తర్వాతి సెట్‌లో చెలరేగి ఆడి విజయాన్ని అందుకుంది. మరో పోటీలో ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్) విజయం సాధించింది. సెపాడెతో జరిగిన మ్యాచ్‌లో ప్లిస్కోవా 6–3, 6–4 తేడాతో జయకేతనం ఎగుర వేసింది. మాజీ నంబర్‌వన్ మారియా షరపోవా (రష్యా) కూడా రెండో రౌండ్‌కు చేరుకుంది. టి.మారియా(జర్మనీ)తో జరిగిన మ్యాచ్‌లో షరపోవా విజయం సాధించింది. ఏకపక్ష మ్యాచ్‌లో షరపోవా 6–1, 6–4తో జయభేరి మోగించింది. అయితే ఐదో సీడ్ వీనస్ విలియమ్స్ మాత్రం మొదటి రౌండ్‌లోనే ఓటమి పాలైంది.



పాక్‌కు నాలుగో ఓటమి

- న్యూజిలాండ్‌తో వన్డే

హామిల్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ వరుసగా నాలుగో ఓటమి చవి చూసింది. మంగళవారం జరిగిన నాలుగో వన్డేలో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య కివీస్ జట్టు 45.1 ఓవర్లలోనే కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. కివీస్‌ను గ్రాండోమ్ విధ్వంసక బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. అతనికి హెన్రీ నికోలస్ అండగా నిలిచాడు. చెలరేగి ఆడిన గ్రాండోమ్ 40 బంతుల్లోనే ఐదు భారీ సిక్సర్లు, మరో ఏడు ఫోర్లతో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. నికోలస్ 3 ఫోర్లతో 52 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. అంతకుముందు ఓపెనర్లు మార్టిన్ గుప్టిల్ (31), కొలిన్ మున్రో (56) శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 88 పరుగులు జోడించారు. అయితే ఈ సమయంలో పాక్ బౌలర్లు విజృంభించారు. దీంతో కివీస్ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయింది. ఒక దశలో 154 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో గ్రాండోమ్, నికోలస్ అసాధారణ బ్యాటింగ్‌తో కివీస్‌ను గట్టెక్కించారు. అంతకుముందు పాకిస్థాన్ 262 పరుగులు చేసింది. ఓపెనర్ ఫకర్ జమాన్ (54), హరిస్ సోహైల్ (50), మహ్మద్ హాఫీజ్ (81) అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. చివర్లో సర్ఫరాజ్ అహ్మద్ 3 ఫోర్లు, 3 సిక్సర్లతో వేగంగా 51 పరుగులు చేశాడు. దీంతో పాక్ గౌరవప్రద స్కోరును నమోదు చేసింది. గ్రాండోమ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

బంగ్లాదేశ్ విజయం

ఢాకా: స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. జింబాబ్వేతో జరిగిన మొదటి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సాకిబ్ అల్ హసన్ ఆల్‌రౌండ్ ప్రతిభతో బంగ్లాను గెలిపించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 170 పరుగులకే కుప్పకూలింది. స్టార్ ఆటగాడు సికందర్ రజా 52 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పీటర్ మూర్ 33, వికెట్ కీపర్ బ్రాండెన్ టైలర్ 24 తప్ప మిగతా వారు విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో సాకిబ్ మూడు వికెట్లు తీశాడు. ముస్తఫిజుర్ రహ్మాన్, రుబెల్ హుస్సేన్ రెండేసి వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చడంలో తమవంతు పాత్ర పోషించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 28.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ 8 ఫోర్లు, ఒక సిక్స్‌తో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సాకిబ్ అల్ హసన్ ఐదు ఫోర్లతో 37 పరుగులు చేసి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. సాకిబ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.